RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



19 జనవరి 2025 ఆదివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:196

## సింగపూర్‌లో తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, భాగస్వామ్యాలపై చర్చలు



సింగపూర్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఆ దేశ పర్యావరణ శాఖ మంత్రి గ్రేస్ ఫూ హైయిన్ తో సమావేశమయ్యారు. తెలంగాణలో ఉన్న అపార పెట్టుబడి అవకాశాలు, భాగస్వామ్యాలపై ఈ సమావేశంలో ఇరుపక్షాల మధ్య విస్తృత చర్చలు జరిగాయి.

ముఖ్యంగా పట్టణాభివృద్ధి ప్రణాళిలు, మౌలిక సదుపాయాల కల్పన, నీటి వనరులు – నిర్వహణ, నైపుణ్యాల అభివృద్ధి, క్రీడలు, సెమీ కండక్టర్లు, తయారీ, పర్యావరణం, స్థిరత్వ, సాంకేతికత సహా వివిధ రంగాలలో తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, భాగస్వామ్యాలపై చర్చలు సానుకూల వాతావరణంలో జరిగాయి.

ఈ చర్చల్లో ముఖ్యమంత్రి వెంట ఐటీ &పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, రాష్ట్రానికి చెందిన ఉన్నతాధికారులు, సింగపూర్‌లో భారత డిప్యూటీ హై కమిషనర్ పూజ ఎం.టిల్లు గారు పాల్గొన్నారు.



తెలంగాణ రైజింగ్ లక్ష్యాలు, ఆ మేరకు ప్రజా ప్రభుత్వం అనురిస్తున్న కార్యాచరణ పట్ల సింగపూర్ మంత్రి గ్రేస్ ఫూ హైయిన్ గారు ఆసక్తి కనబరిచారు. పధానంగా నెట్ జీరో ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్, నీటి నిర్వహణ, స్థిరత్వ ప్రణాళికల్లో తెలంగాణతో భాగస్వామ్యం అంశాన్ని సింగపూర్ ప్రభుత్వం పరిశీలిస్తుందని వారు హామీ ఇచ్చారు. ఉమ్మడి ప్రాజెక్టులపై సాధ్యమైనంత వేగంగా ముందుకు పోవాలని, మరింత సమన్వయంతో పని కలిసి చేయాలని ఇరుపక్షాలు అంగీకరించాయి.

## సింగపూర్‌లోని ఎస్టీటీ గ్లోబల్ డేటా సెంటర్‌ను సందర్శించిన మంత్రి డి.శ్రీధర్ బాబు



ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సింగపూర్ పర్యటన సందర్భంగా మరో కీలకమైన ఒప్పందం చేసుకుంది. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో రూ. 3,500 కోట్ల పెట్టుబడులకు ST Telemedia Global Data Centres India%సంస్థ ముందుకు వచ్చింది. ముచ్చర్ల - మీరాన్‌పేటలో అత్యాధునిక ఏఐ ఆధారిత డేటా సెంటర్ క్యాంపస్‌ను స్థాపించేందుకు ఈ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది.

ఈ అవగాహన ఒప్పందంపై ముఖ్యమంత్రి స్పందిస్తూ త్వరలోనే హైదరాబాద్ డేటా సెంటర్లకు రాజధానిగా అవతరిస్తుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పెట్టుబడుల నిర్ణయం తీసుకున్నందుకు ఎస్టీటీ గ్లోబల్ కంపెనీ ప్రతినిధులను అభినందించారు.

ప్రపంచ వ్యాప్తంగా ఏఐ ఆధారిత రంగంలో వస్తున్న వినూత్న మార్పుల్లో హైదరాబాద్ డేటా సెంటర్ల హబ్‌గా ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.




మంత్రి డి.శ్రీధర్ బాబు సింగపూర్‌లోని ఎస్టీటీ గ్లోబల్ డేటా సెంటర్‌ను సందర్శించి ఆ సంస్థ ప్రతినిధులతో చర్చలు జరిపారు. అనంతరం పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఎస్‌టీటీ గ్రూప్ సీఈవో బ్రూనో లోపెజ్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు.

100 మెగావాట్ల సామర్థ్యంతో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే అత్యాధునిక AI రెడీ డేటా సెంటర్‌ను ఈ కంపెనీ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నెలకొల్పనుంది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా డేటా సెంటర్ సామర్థ్యాన్ని పెంచుకునే సదుపాయం ఇందులో ఉంటుంది. దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్లలో ఇది ఒకటిగా నిలుస్తుంది. తెలంగాణతో కలిసి పని చేయటం గౌరవంగా ఉందని ఎస్టీటీ మీడియా గ్లోబల్ డేటా సెంటర్స్ ప్రెసిడెంట్, గ్రూప్ సీఈవో బ్రూనో లోపెజ్ అన్నారు. మౌలిక సదుపాయాలతో పాటు తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రగతిశీల విధానాలు సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహకంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం అందించే సహకారంతో ఆర్థిక వృద్ధితో పాటు ఉపాధి కల్పన, స్థిరమైన డిజిటల్ భవిష్యత్తు నిర్మించాలనే ఉమ్మడి లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. ప్రస్తుతం STT GDC హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో డేటా సెంటర్‌ను నిర్వహిస్తోంది. కొత్త క్యాంపస్ ఏర్పాటుతో కంపెనీ కార్యకలాపాలను విస్తరించనుంది. ఈ కంపెనీ దేశంలో వచ్చే పదేండ్లలో దాదాపు 3.2 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో ఒక గిగావాట్ సామర్థ్యానికి విస్తరించాలన్న లక్ష్యంతో పెట్టుబడులు పెడుతోంది.

# పేదవారికి కళ్యాణ లక్ష్మి గొప్ప వరం

**అర్హులైన వారందరూ కల్యాణ లక్ష్మీ పథకాన్ని వినియోగించుకోవాలి.**

**చేగుంట-70 మందికి,నార్సింగ్-21**

**మొత్తం 91 మంది లబ్ధిదారులకు కళ్యాణ్ లక్ష్మీ పథకం ద్వారా 91,10,556-00 రూపాయలు పంపిణీ**

**ప్రజల కోసం పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వం మాది**

**సంక్షేమ పథకాలలో ఎలాంటి రాజకీయ ఒత్తిడి లేదు.**

**రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ, ధర్మాదాయ శాఖ మాత్యులు శ్రీమతి కొండా సురేఖ.**



**దుబ్బాక నియోజకవర్గం జనవరి 18 ప్రాజబలం న్యూస్ :-**ప్రజల కోసం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మాత్యులు శ్రీమతి కొండా సురేఖ పేర్కొన్నారు.మెదక్ జిల్లా దుబ్బాక నియోజకవర్గం చేగుంట మండలం వడియారం గ్రామంలోని గోల్డెన్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ , తూప్రాన్ ఆర్డీవో జై చంద్ర రెడ్డి, చేగుంట తాసిల్దార్ సంబంధిత ప్రజా ప్రతినిధులు, ఇతర ప్రభుత్వ అధికారులతో కలిసి కళ్యాణ్ లక్ష్మి షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం 33 కెవి విద్యుత్ ఉప కేంద్రాన్ని మంత్రివర్యులు ప్రారంభించారు.

మెదక్ జిల్లా దుబ్బాక నియోజకవర్గం చేగుంట మండలానికి చేరుకున్న మంత్రివర్యులు కొండా సురేఖ కు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి,దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్ రాహుల్ రాజ్ తదితరులు పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ కళ్యాణ్ లక్ష్మి షాది ముబారక్ పథకం పేదింటి ఆడపిల్లల పాలిట వరంగా భావించాలని,ఒక ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాలను ప్రభుత్వాలు మారినప్పుడు ఆ పథకాలను కొనసాగిస్తుంది అంటే అది మంచి పథకం గా భావించాలని స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉన్నప్పుడు రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్మెంట్ ,రైతు రుణమాఫీ, కార్యక్రమాలు ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు

ఆ పథకాలు ప్రజలకు తప్పనిసరి అవసరమని గుర్తించి..తర్వాత వచ్చిన ప్రభుత్వం వాటిని కొనసాగించిందని కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం పేదవారికి ఎంతో ఉపయోగపడుతుందని. పెళ్లి బట్టలు కూడా కొనుక్కోలేని పరిస్థితుల్లో ఉన్నప్పుడు కళ్యాణ లక్ష్మి పథకం అర్హులను ఆదుకుందన్నారు ఏ పథకమైన మొదలు పెట్టినప్పుడు కొంత సమస్య తలెత్తవచ్చునని, సమస్యలు పరిష్కరించుకొని ఆ పథకం క్రమీపి ఆచరణ దిశగా ముందుకు సాగుతుందన్నారు.

మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కళ్యాణ లక్ష్మి పథకాన్ని కొనసాగిస్తూ చెక్కులను ఇస్తుందన్నారు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నాలుగు పథకాలు 26 నుండి అమలు అవుతాయని చెప్పారు.

ఇందిరమ్మ ఇండ్ల కోసం గ్రామ గ్రామాన అధికారులు తిరుగుతున్నారని రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఈ నాలుగు సంక్షేమ పథకాలు ప్రభుత్వం ప్రజల్లోకి తీసుకొని లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుంది. అని వివరించారు. రైతు భరోసా సంవత్సరానికి 12 వేల రూపాయలు రెండు విడతలు ఇవ్వడం జరుగుతుందన్నారు

వ్యవసాయ యోగ్యమైన భూమి ఉన్న ప్రతి ఎకరాకి రైతు భరోసా అందిస్తామని చెప్పారు.సంక్షేమ పథకాలలో ఎలాంటి రాజకీయ ఒత్తిడి లేదని వివరించారు.

మిగతా 2లో

# ప్రజాబలం

19 జనవరి 2025 ఆదివారం


## ఈ తీర్పు మనువాదులకు చెంపపెట్టు!

ఉన్నది ఉన్నట్లు చెప్పినా తమ మనోభావాలను దెబ్బ తీశారంటూ దెబ్బలాటలకు దిగుతున్న పరిస్థితి. తరతరాలుగా జరుగుతున్నదే. భూమి చుట్టూ సూర్యుడు తిరుగుతున్నాడని నాటి క్రైస్తవ మతగ్రంథాలు, జ్యోతిష గ్రంథాలు చెప్పినది వాస్తవం కాదని సూర్యుడి చుట్టూ భూమి తిరుగుతున్నదని నిరూపించిన ఖగోళ శాస్త్రజ్ఞుడు నికోలస్ కోపర్నికస్‌పై ఐదు వందల సంవత్సరాల క్రితమే నాటి క్రైస్తవ మతవాదులు దాడి చేశారు, మూర్ఖుడని నిందించారు. చరిత్రలో ఏ మతవాదీ నిజాన్ని అంగీకరించిన దాఖలా లేదు. మన దేశంలో హిందూత్వ, ఇస్లామిక్, క్రైస్తవ మతవాదులు దానికి అతీతులు కాదు. అలాంటి వారికి 2025 జనవరి మొదటి వారంలో మద్రాస్ హైకోర్టు చెంపపెట్టులాంటి తీర్పు ఇచ్చింది. తమిళనాడులో విడుతలై చిరుతాయిగల్ కచ్చి (విసికె) అనే పార్టీ ఎంపీ తిరుమావళవన్. అతని మీద 2020లో ఒక ప్రైవేటు కేసు నమోదైంది. అదేమిటంటే పెరియార్ అనే యూట్యూబ్ ఛానల్‌లో ఫిర్యాదుదారు ఒక కార్యక్రమాన్ని చూశారు. తిరుమావళవన్ మరొక వ్యక్తితో కలసి హిందూ మహిళల గురించి బహిరంగంగా చెప్పిన మాటలు వారి స్థాయిని దిగజార్చేవిగా ఉన్నాయని, వారి గురించి ఒక తప్పుడు కథనాన్ని చెప్పారని, వాటిని విని ఒక హిందువుగా అవమానకరంగా భావించానని, తన మనోభావాలను దెబ్బతీసేవిగా ఉన్నందున తగిన చర్యలు తీసుకొని శిక్షించాలన్నది కేసు సారం. ఆ కేసులో పసలేదని దాన్ని కొట్టివేయాలంటూ తిరుమావళవన్ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. దాని మీద విచారణ జరిపిన న్యాయమూర్తి పి.వేలుమురుగన్ కేసును కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. కరోనా సమయంలో 'పెరియార్–భారత రాజకీయాలు' అనే అంశంపై యూరోపియన్ పెరియార్ అంబేద్కర్ కామ్రేడ్స్ ఫెడరేషన్ నిర్వహించిన అంతర్జాతీయ అంతర్జాల సమావేశంలో తిరుమావళవన్ ప్రసంగించారు. దానిలో మనుస్మృతిలో ఉన్న కొన్ని అంశాలను ప్రస్తావించారు. అవి తమ మనోభావాలను దెబ్బ తీశాయన్నది కేసు. అయితే తిరుమావళవన్ మనుస్మృతిలో ఉన్న అంశాలను ప్రస్తావించి వాటికి అర్థం చెప్పారు. తానుగా కొత్తగా చెప్పిందేమీ లేనందున ఎలాంటి చర్య తీసుకోనవసరం లేదంటూ న్యాయమూర్తి కేసును కొట్టివేశారు. తిరోగామి భావజాలం గురించి గతంలోనే అనేక మంది చీల్చి చెండాడారు. వాటిని పునశ్చరణ చేయవచ్చు, మరింతగా వివరించవచ్చు. అంతే కాదు ఈ తీర్పుతో ఒకటి స్పష్టమైంది. ఎవరినీ కొట్టావద్దు తిట్టావద్దు, పురాతన సంస్కృత గ్రంథాల్లో ఉన్న వాటి అసలు అర్థాలను చెబుతూ వాటిని జనంలోకి మరింతగా తీసుకువెళితే చాలు. ముంజేతిని చూసుకొనేందుకు అద్దాలు అవసరం లేదు.

ఇదే అంశంపై మద్రాస్ హైకోర్టులో దాఖలైన ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని 2020 నవంబరులో జస్టిస్ ఎం సత్యనారాయణన్, జస్టిస్ ఆర్ హేమలత డివిజన్ బెంచి కొట్టివేసింది. ఎస్ కాశీరామలింగం దాఖలు చేసిన ఈ వ్యాజ్యంలో బిజెపి నేత, న్యాయవాది ఆర్‌సి పాల్ కనకరాజ్ వాదించారు. ఉనికిలో లేని మనుస్మృతిని నిషేధించాలని పార్లమెంటు సభ్యుడు కోరుతూ చేసిన ప్రసంగం అశాంతికి, వివిధ తరగతులను రెచ్చగొట్టటానికి దోహదం చేసినందున సభ్యత్వానికి అనర్హుడిగా ప్రకటించాలని కోర్టును కోరారు. ప్రసంగం చేయటమే గాక దాన్ని నిషేధించాలని కూడా డిమాండ్ చేశారన్నారు. మనుస్మృతి రాజ్యాంగ బద్ధమైనదేమీ కాదని, అందువలన దాన్ని ఫలాన విధంగానే చదవాలనే నిబంధనేమీ లేదని, రెండు వేల సంవత్సరాల నాటి గ్రంథానికి భాష్యాలు చెప్పవచ్చని అందువలన ఎంపీపై చర్య తీసుకోవాల్సిన అవసరం లేదని కోర్టు తీర్పు చెప్పింది. దానిలో చెప్పిన నైతిక నియమావళి రాజ్యాంగబద్ధం కాదని, వాటిని అమలు జరపలేమని న్యాయమూర్తులు పేర్కొన్నారు. వాద ప్రతివాదనల సందర్భంగా తమ పిటీషన్‌ను ఉపసంహ రించుకొని రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన అంశాలతో మరొక పిటీషన్ దాఖలు చేసేందుకు అనుమతించాలని న్యాయవాది పాల్ కనకరాజ్ కోర్టును కోరారు. చివరికి పిల్‌ను కోర్టు కొట్టివేసింది. ఈ అంశం మీదే జిల్లా కోర్టులో ఒక ప్రైవేట్ కేసును దాఖలు చేశారు. దాన్ని ఈ నెలలో హైకోర్టు కొట్టివేసింది.

మద్రాస్ హైకోర్టు తీర్పు మరో ఉదంతాన్ని గుర్తుకు తెచ్చింది. కర్ణాటకలో మైసూరు విశ్వవిద్యాలయ విశ్రాంత ప్రొఫెసర్, ప్రముఖ రచయిత, హేతువాది కెఎస్. భగవాన్. రామాయణం ఉత్తరకాండలో ఉన్న వాటిని గురించి చెప్పినందుకు హిందూత్వవాదులు అంతుచూస్తామని బెదిరించారు. గత కొద్ది సంవత్సరాలుగా ఆయన ఈ అంశాలను చెబుతున్నారు. ఉత్తరకాండలో ఉన్నదాని ప్రకారం రాముడు పదకొండువేల సంవత్సరాలు పాలించలేదని, పదకొండు ఏళ్లు మాత్రమే రాజుగా ఉన్నట్లు, అడవుల్లో తాను మద్యం తాగుతూ సీతాదేవిని కూడా తాగమని కోరినట్లు, కొందరు రామరాజ్యం తెస్తామని చెబుతున్నారని, రాముడు ఆదర్శప్రాయుడేమీ కాదని భగవాన్ చెప్పిన అంశాలు తమ మనోభావాలను గాయపరచినట్లు కొందరు ప్రైవేటు కేసును దాఖలు చేశారు. సీతాదేవిని అడవుల పాల్జేసి పట్టించుకోని, శూద్రుడైన శంబుకుణ్ని వధించిన రాముడిని ఎలా సమర్థిస్తారని భగవాన్ ప్రశ్నించారు. "ప్రొఫెసర్ కల్‌బుర్గి, గోవింద్ పన్సారే, నరేంద్ర దబోల్కర్‌లను హత్య చేసినవారు ఇప్పుడు నన్ను కూడా చంపుతామని బెదిరిస్తున్నారు. వారికి నేను చెప్పదలచుకున్నది ఒక్కటే. మీరు మా మీద దాడి చేయవచ్చు, ముక్కలుగా నరకవచ్చు కానీ మా రచనలు సజీవంగానే ఉంటాయి. వారు నన్ను చంపవచ్చు తప్ప. నా వైఖరిని మార్చలేరు" అని భగవాన్ స్పష్టం చేశారు. ఈ వివాదం తరువాత కొంత మంది అసలు ఉత్తరకాండను వాల్మీకి రాయలేదని, తరువాత కొందరు దాన్ని చేర్చారని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. రామాయణాలు అనేకం ఉన్నాయి. దేన్ని సాధికారికంగా తీసుకోవాలో చెప్పినవారెవరూ లేదు. ఎవరికీ అలాంటి సాధికారత లేదు. ఎవరైనా పుచ్చుకుంటే దానితో అంగీకరించాలని కూడా లేదు.మనుస్మృతిలో రాసినవి, వాటి ఆచరణ చూసి తన మనోభావాలు తీవ్రంగా గాయపడిన కారణంగానే బాబాసాహెబ్ అంబేద్కర్ వంద సంవత్సరాల క్రితమే దాన్ని తగులబెట్టి నిరసన వెల్లడించారు. సదరు మనువాదాన్ని మరింతగా ముందుకు తీసుకుపోవాలని, అది లేకుండా రచించిన రాజ్యాంగాన్ని విమర్శిస్తూ ఆర్‌ఎస్‌ఎస్ పత్రిక సంపాదకీయాలు రాసింది. రాజ్యాంగ నిర్మాతలు పక్కన పెట్టిన మనుస్మృతిని తమ న్యాయశాస్త్ర విద్యార్థులకు పాఠ్యాంశంగా పెట్టాలని ఢిల్లీ విశ్వవిద్యాలయం నిర్ణయించింది. కోర్టులలో అమలు చేసే శిక్షాస్మృతులను పాఠాలుగా చెప్పాలి, శిక్షణ ఇవ్వాలి తప్ప ఇలాంటి చర్యలతో అధికారికంగా మనువాదులను తయారు చేసే వ్యవహారం తప్ప మరొకటి కాదు. ఇలాంటి బలవంతాలు చేసే శక్తులు ఒక వైపు రెచ్చిపోతుంటే మరోవైపు దాన్ని వ్యతిరేకించేవారు కూడా ఎప్పటికప్పుడు తయారవుతారు. నూతన ఆర్థిక విధానాల పేరుతో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన సంస్కరణలు దేశంలో ఆర్థిక అసమానతలను మరింతగా పెంచి, కార్పొరేట్ జలగలకు జనాలను అప్పచెప్పాయి. వాటిని మరింత వేగంగా అమలు జరుపుతున్న బిజెపి నూతన విద్యావిధానం పేరుతో తన కాషాయ ఎజెండాను దేశం మీద రుద్దేందుకు పూనుకుంది. దానిలో భాగమే సిలబస్‌లో మనువాదాన్ని చేర్చటం. మరింతగా మనువాదులను న్యాయ వ్యవస్థలో చేర్చేందుకు వేసిన పథకమిది. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకు విద్య, సమాన హక్కులు, సాధికారతను పూర్తిగా వ్యతిరేకించే తిరోగమన భావాలను బలవంతంగా అధ్యయనం చేయించేందుకు చూస్తున్నారు. అంతేకాదు, శూద్రులు, దళితులుగా ఉన్న 85 శాతం మంది గురించి కూడా దాన్నిండా వ్యతిరేకతలే, మొత్తంగా మన రాజ్యాంగానికి, దానికి స్ఫూర్తికి వ్యతిరేకమైనది.ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసిలో ఉన్న బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో భగత్ సింగ్ స్టూడెంట్స్ మోర్చా (బిఎస్‌ఎం)కు చెందిన వారు డిసెంబరు 25న మనుస్మృతి గ్రంథంపై ఒక చర్చ నిర్వహించారు. తరువాత తగుల బెట్టేందుకు నిర్ణయించారు. ఆ సందర్భంగా ముగ్గురు విద్యార్థినులతో సహా 13 మందిని పోలీసులు అరెస్టు చేసి కేసు పెట్టారు. పదిహేడు రోజుల తరువాత వారు బెయిలు మీద జనవరి 11న విడుదలయ్యారు. ఈ విశ్వవిద్యాలయంలో మనుస్మృతిపై పరిశోధన చేసే వారికి ఫెలోషిప్ ఇస్తున్నారు.

# పేదవారికి కళ్యాణ లక్ష్మి గొప్ప వరం

మొదటి పేజీ తరువాయి

ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఒక నియోజకవర్గానికి 3500 ఇళ్ళు మంజూరు చేయడం జరిగిందన్నారు ఎస్సీ ఎస్టీలు ఉన్నచోట ఎక్కువగా ఇవ్వడానికి ప్రభుత్వ సిద్ధంగా ఉందని చెప్పారు. పేదవాళ్లలో కెల్లా పేదవాళ్లను గుర్తించి మొదట ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు రానివాళ్లు ఎమ్మార్వో కార్యాలయం కెళ్ళి మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.గ్రామ సభలు పెట్టి వాస్తవాలు తెలుసుకొని అర్హులైన లబ్ధిదారులను ఇప్పిస్తామన్నారుఏ ఒక్క రూపాయి కూడా ప్రజాధనం దుర్వినియోగం కాకూడదు అనేదే ప్రభుత్వ లక్ష్యంగా ముందుకు పోతున్నట్లు వివరించారు.రైతులకు రైతు భరోసా, చేనేతలకు పెన్షన్ ఇచ్చిన తరహాలోని కూలీలకుఇందిరమ్మ ఆత్మీయ భరోసా సత్ఫలితాలను ఇస్తుందన్నారు.గుంట భూమి లేకున్న ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 12,000 ఇవ్వడం జరుగుతుందని చెప్పారు కుటుంబాన్ని యూనిట్ గా తీసుకొని ఈ 12 వేల రూపాయలు అందజేస్తాం. అన్నారు. రేషన్ కార్డులు ఇచ్చుకుంటూ ఇందిరమ్మ ఇండ్ల సెలెక్షన్ జరుగుతుందని తెలిపారు.చిన్న పొరపాటు జరగకుండా సంక్షేమ పథకాలు అమలయేలా పగడ్బందీగా చర్యలు చేపట్టామన్నారు

పార్టీలకతీతంగా ఇందిరమ్మ కమిటీల ద్వారా లబ్ధిదారుల జాబితా ఎంపిక చేయాలన్నారు.

ప్రభుత్వం లోటు బడ్జెట్ లో ఉన్న సంక్షేమ పథకాలు అందించలానే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు.

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పేదవారికి కళ్యాణ లక్ష్మి గొప్ప వరం అన్నారు గత ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టింది.ఇప్పటి ప్రభుత్వం కూడా దాని నిర్వహిస్తున్నందుకు కృతజ్ఞతలు.తెలిపారు.

అనంతరం మంత్రి చేగుంట మండలం గొల్లపల్లి గ్రామంలో2.16 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన 33 కెవి విద్యుత్ ఉప కేంద్రాన్ని మంత్రి దుబ్బాక శాసనసభ్యులతో కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ ట్రాన్స్కో ఏ. శంకర్, ఏ.డి.ఈ శృతి, సంబంధిత ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం మార్కెట్ మాజీ వైస్ ఛైర్మన్ ఆత్మహత్యాయత్నం

**రంగారెడ్డి జిల్లా ప్రజాబలం ప్రతినిధి:**ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్థలో కూల్చివేతలను ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దండేటికారి రవి సోదరులు అడ్డుకున్నారు. పెట్రోల్ పోసుకొని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సోదరులు ఆత్మహత్యాయత్నం చేసారు. హై కోర్ట్ స్టే ఉన్న ఎలా తమ నిర్మాణాలు కూల్చివేస్తారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ప్రోత్బలంతోనే తమ నిర్మాణాలను కూల్చివేస్తున్నరని ఆరోపించారు. లీగల్ గా డాక్యుమెంట్స్ ఉన్నవి. హైకోర్ట్ అనుమతులతోనే నిర్మాణాలను చేపట్టం. మేము ఎక్కడ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టలేదు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ అధికారులు నోటీసులు ఇవ్వగానే అన్ని ఆధారాలు చూపించాం. కావాలనే రాజకీయ దురుద్దేశంతోనే కూల్చివేతలు చేస్తున్నారన్నారు.

## రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమార్తె మృతి

విజయనగరం జిల్లా గజపతినగరం మండలం మదుపాడ సమీపంలో ఆగి ఉన్న లోడ్ లారీని బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తండ్రి , కుమార్తె స్పాట్ లో మరణించారు. మరో అయిదుగురు తీవ్రంగా గాయపడ్డారు.. ప్రమాద సమయంలో బస్సులో 42 మంది ప్రయాణీకులు ఉన్నారు. వారంతా ఫ్రీ మెడికల్ క్యాంప్ కోసం వెళ్తున్నట్లు సమాచారం.ఒడిశాలోని మల్కన్ గిరి నుంచి విశాఖ తరగవలస వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.. ప్రమాదం గురించి సమాచారం తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి 5 అంబులెన్స్ చేరుకున్నాయి. బస్సులో చిక్కుకున్నవారిని బయటకు తీశారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు.. బస్సులో ఉన్నవాళ్లు అంతా ఒరిస్సా రాష్ట్రంలో మల్కాజిగిరి వాసులుగా పోలీసులు గుర్తించారు.

## విద్యుత్ షాక్ తో ఇద్దరు మృతి

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**హైదరాబాద్ హబ్సిగూడలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఓ భవనానికి ఉన్న హోర్డింగ్‌ను దింపే క్రమంలో విద్యుదాఘాతంతో మంటల్లో కాలి ఇద్దరు మృతి చెందారు. సైంటిస్ట్ కాలనీలో శుభ నందిని చిట్‌ఫండ్ సంస్థను ఓ భవనంలో నిర్వహించేవారు. ఇటీవలే సంస్థను మూసి వేసి, భవనాన్ని ఖాళీ చేశారు. ఈ క్రమంలోనే భవనానికి ఉన్న హోర్డింగ్ తొలగించాలని శుభనందిని చిట్‌ఫండ్ ప్రతినిధులకు యాజమాని తెలిపారు. దీంతో ఆ హోర్డింగ్ తొలగించడానికి 1000 ఇస్తామని బాలు అనే వ్యక్తితో బేరం కుదుర్చుకున్నారు.దానికి ఒప్పుకున్న బాలు తోడు కోసం తన బంధువైన మల్లేశ్‌ను పిలిచాడు. ఇద్దరూ కలిసి రెండో అంతస్తు ఎక్కి హోర్డింగ్‌కు తాళ్లు కట్టి దించేందుకు ప్రయత్నించారు. హోర్డింగ్ ఒక వైపునకు జారి పక్కనే ఉన్న 11 కేవీ ఎలక్ట్రిక్ వైర్లపై పడింది. హోర్డింగ్ పట్టుకుని ఉన్న ఇద్దరికి విద్యుత్ షాక్ తగిలి మంటలు వ్యాపించాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా, మంటలు ఆర్పేశారు.ఘటనా స్థలంలోనే చనిపోయిన బాలు, మల్లేశ్ మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడు బాలుది మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇనుగుర్తి కాగా, మల్లేశ్ది సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం దేవునిగుట్ట తండా. విద్యుదాఘాతంతో ఇద్దరు దుర్మరణం చెందడంతో స్థానికంగా విషాదం అమలుకుంది. మృతుల కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

## ఆర్ఎస్ఎస్ చీఫ్ చేసిన వ్యాఖ్యలపై విరుచుకుపడ్డ రాహుల్‌గాంధీ



పాట్నా జనవరి 18 దేశ స్వాతంత్ర్యం విషయంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ విరుచుకుపడ్డారు. ఆయన రాజ్యాంగ విరుద్ధంగా వ్యాఖ్యానించారని మండిపడ్డారు. బీహార్ రాజధాని పాట్నాలో జరిగిన" సంవిధాన్ సురక్ష సమ్మేళన్ " కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. " బీజేపీ, ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. అణగారిన వర్గాలను నిర్లక్షం చేస్తున్నాయి. మైనారిటీ, దళితులు, రాజకీయాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కానీ వారికి ఎలాంటి అధికారాలు ఉండడం లేదు. ఆర్ఎస్ఎస్ సహా మరికొన్ని సంస్థలే దేశాన్ని నడుపుతున్నాయి. దేశ సంపద కొందరు పారిశ్రామిక వేత్తల చేతుల్లోనే ఉంది. భారత రాజ్యాంగం ఒక పుస్తకం మాత్రమే కాదని, దళితులు ఎదుర్కొన్న అన్యాయాల గురించి అది మాట్లాడుతుంది. " అని రాహుల్ పేర్కొన్నారు.దేశ వ్యాప్తంగా కులగణన కచ్చితంగా అవసరమని, ఇది అభివృద్ధిలో కీలక పాత్ర వహిస్తుందని, రాహుల్ అన్నారు. కాగా, ఇటీవల ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ స్వాతంత్ర్యం విషయంలో కీలక వ్యాఖ్యలు చేశారు. అయోధ్యలో రామమందిర ప్రతిష్ఠాపన రోజునే భారత్ నిజమైన స్వాతంత్ర్యాన్ని పొందిందన్నారు. శత్రువులతో భారత్ ఎన్నో శతాబ్దాల పాటు పోరాడిందని, అయితే రామమందిర ఉద్యమం ఎవరినీ వ్యతిరేకించడానికి ప్రారంభించింది కాదన్నారు. దేశం తనను తాను మేలుకొల్పుకోవడానికి చేసింది మాత్రమేనని అన్నారు. భారత్ తన కాళ్లపై నిలిచి ప్రపంచానికి మార్గం చూపుతుందని, రామమందిర ప్రతిష్ఠాపన సందర్భంగా దేశంలో ఎలాంటి అసమ్మతి చోటుచేసుకోలేదన్నారు. ఈ వ్యాఖ్యలపై రాహుల్ తీవ్రంగా స్పందించారు. మోహన్‌భగవత్ రాజ్యాంగ విరుద్ధంగా మాట్లాడారని విమర్శించారు.

## ప్రతి మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ లో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

### మన ఇల్లు, పరిసరాలు, పని చేసే కార్యాలయాలో పరిశుభ్రత పాటించాలి : డి ఆర్ ఓ నరసింహులు

తిరుపతి, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తిరుపతి జిల్లాలో ప్రతి మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ ను నిర్వహించి విజయవంతం చేయాలని డిఆర్ఓ నరసింహులు తెలిపారు.

శనివారం ఉదయం స్థానిక కలెక్టరేట్ ఆవరణంలో స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం లో భాగంగా కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా డి ఆర్ ఓ మాట్లాడుతూ.. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా గత 10 సంవత్సరాల నుండి గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఏర్పాటు చేసుకోవడం, మరుగు కాలువలు శుభ్రపరుచుకోవడం ప్రతి పల్లె, పట్టణంలో క్లీన్ అండ్ గ్రీన్ పాటించడం జరుగుతోందన్నారు. దీనివల్ల చాలావరకు వ్యాధులు రావడం తగ్గిందన్నారు. ప్రతి మూడవ శనివారం పల్లెలు, పట్టణాలు, కార్యాలయాలు, పరిసరాలు శుభ్రపరుచుకోవాలని తెలిపారు. జిల్లా లో ప్రతి శాఖకు ఒక్క నోడల్ అధికారిని నియమించడం జరిగిందని, ఈ రోజు మన పరిసరాలను, కార్యాలయాలను ప్రతి ఉద్యోగి వారి కార్యాలయం లోని టేబుల్, ఫైల్స్, ఎలెక్ట్రానిక్ వేస్ట్ వంటి వాటిని శుభ్రపరుచుకోవలన్నారు. కార్యాలయాలలో చెత్తను వేయుటకు డస్ట్ బిన్ ఉపయోగించుకోవాలని, మనం ఎంత శుభ్రంగా ఉంటామో మన పరిసరాలు అంతే శుభ్రంగా ఉంచుకోవాలని అది అలవాటుగా మార్చుకోవాలని తెలిపారు. అనంతరం ప్రతి రోజు పరిసరాల పరిశుభ్రత కొరకు సమయం కేటాయిస్తానని " స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ" చేసి కార్యాలయ ఆవరణంలో ఉన్న పిచ్చి మొక్కలను, చెత్తను సిబ్బంది తో కలిసి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మన ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్

### స్వచ్ఛ సర్వేక్షన్ లో ఉత్తమ ర్యాంకుకు సహకరించండి. కమిషనర్ ఎన్.మౌర్య

**తిరుపతి, మన ఇంటితో పాటు మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అన్నారు.**

తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తో పాటు నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య, శాప్ చైర్మన్ రవి నాయుడు, కార్పొరేటర్లు ఆర్.సి మునికృష్ణ, అన్నా అనితా, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని పరిసరాలను శుభ్రం చేసి, మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా జీవిస్తారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ ను నిర్వహిస్తామని అన్నారు. ఏప్రిల్ 2025 లోపు ఇంటింటి చెత్త సేకరణ 100 శాతం నిర్వహించేలా చేయడం, అక్టోబర్ 2025 లోపు చెత్తకుప్పలు లేకుండా చేయాలన్నదే ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. నూతన సంవత్సరంలో క్లీన్ స్టార్ట్ అనే థీమ్ మన ఇల్లు, మన ఆఫీసు, సచివాలయాలు, బస్టాండ్లు, పరిసరాలను శుభ్రం చేయడం జరుగుతుందని అన్నారు. ఇందులో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎవరికి వారు స్వచ్ఛందంగా పాల్గొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. తద్వారా మన నగరంతో పాటు రాష్ట్రం, దేశం పరిశుభ్రంగా మారుతుందని అన్నారు.కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ.. స్వచ్ఛాంధ్ర – స్వచ్ దివస్ కార్యక్రమం లో భాగంగా ప్రకాశం పార్కుల్లో చెత్త తొలగించి , మానవహారం ఏర్పాటు చేశామని అన్నారు. శెట్టిపల్లి వద్ద పెద్ద చెత్త కుప్పలను తొలగించి మొక్కలు నాటడం జరిగిందన్నారు. పారిశుధ్యం పై ప్రజల్లో అవగాహన కల్పించామని అన్నారు. ప్రజలు తడి, పొడి చెత్త వేర్వేరుగా తమ సిబ్బందికి ఇవ్వాలని, కాలువల్లో వేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు పిలుపునిచ్చారు. శాప్ చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ ప్రజలందరూ ఎవరికి వారు తమ పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ స్థాపన దిశగా అడుగులు వేస్తున్నారని అందరూ సహకరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డి.ఈ.లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

## ఫ్లెమింగో ఫెస్టివల్ – 2025... పక్షుల పండుగ

తిరుపతి, ఫ్లెమింగో ఫెస్టివల్ 2025 నేపథ్యంలో పురుషుల వాలీబాల్, కబడ్డీ జూనియర్ కళాశాల,సూళ్లూరుపేట ప్రాంగణంలో గౌ. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ ఎంఎల్ఏ నెల వల విజయ శ్రీ, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, మాజీ మంత్రి పరశా రత్నం, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, మాజీ ఎంఎల్సి వాకాటి నారాయణరెడ్డి, మునిసిపల్ చైర్మన్ శ్రీమంత్ రెడ్డి, జెసి శుభం బన్సల్, డిఎఫ్ఓ వైల్డ్ లైఫ్ మేనేజ్మెంట్ సూళ్లూరుపేట హారిక, ఆర్డీవో సూళ్లూరుపేట కిరణ్మయి తదితరులతో కలసి ప్రారంభించారు. అలాగే కోట పోలూరు జడ్పీ ఉన్నత పాఠశాల నందు మహిళలకు త్రో బాల్, టెన్ని కాయిట్, స్కూల్ పిల్లలకు ఖోఖో కబడ్డీ, వాలీ బాల్ నిర్వహణ ఏర్పాటు చేశారు. ఫ్లెమింగో ఫెస్టివల్ 2025 కార్యక్రమం జ్యోతి ప్రజ్వలన, ప్రార్థన గీతంతో ప్రారంభం అయింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

### సినిమాల్లో అవకాశాల పేరిట మహిళపై అసిస్టెంట్ డైరెక్టర్ అత్యాచారం

హైదరాబాద్ జనవరి 18 సినిమాల్లో అవకాశాల పేరిట మహిళపై అత్యాచారం జరిగింది. ఆడిషన్స్ పేరిట గదికి పిలిచి మహిళపై అసిస్టెంట్ డైరెక్టర్ అఘాయిత్యానికి పాల్పడ్డారు. దీంతో మహిళ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో అసిస్టెంట్ డైరెక్టర్‌పై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

# ఆధునిక ఆధ్యాత్మిక గురువు ఓషో

ఓషో (1931–1990), అసలు పేరు రాజనీష్ చంద్ర మోహన్ జైన్, 20వ శతాబ్దపు ప్రభావవంతమైన ఆధ్యాత్మిక గురువులలో ఒకరు. ఆయన తత్వశాస్త్రం, ఆధ్యాత్మికత, ప్రేమ, స్వేచ్ఛ వంటి అంశాలపై తన ప్రవచనాల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందిని ప్రభావితం చేశారు. సంప్రదాయ ఆధ్యాత్మికతను విస్మరించకుండానే, ఆధునిక జీవన విధానానికి అనుగుణంగా ఆధ్యాత్మికతను ఎలా అనుసరించాలో చూపించారు. ఓషో 1931 డిసెంబర్ 11న మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని కుచ్వాడా గ్రామంలో జన్మించారు. చిన్నతనం నుంచి విభిన్న ఆలోచనా శైలితో, ప్రశ్నించే వాడిగా ఉండేవారు. సంప్రదాయాలకు లోబడకుండా జీవించడం ఆయనకు చిన్నప్పటి నుంచే అలవాటైంది. ఓషో విద్యలో మెరుగైన ప్రతిభ కనబరిచారు. జబల్పూర్ విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ పొందారు. విద్యార్థి జీవితంలోనే జీవితం లోని అర్థాన్ని తెలుసు కోవడంలో ఆసక్తి కనబరిచారు. ఓషో తత్వశాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తూ సమాజంలోని సంక్షోభాలను పరిశీలించారు. బోధనల ద్వారా విద్యార్థులను ప్రేరేపిస్తూ, తత్వశాస్త్రంలో తన దృక్పథాన్ని వ్యక్తీకరించారు. ఓషో జీవితంలోని ప్రధాన మలుపు ఆయన ఆధ్యాత్మికతను అన్వేషించడం. 1960లలో భారతదేశం అంతటా పర్యటిస్తూ తన ప్రసంగాలతో ప్రజల మనస్సులను ప్రభావితం చేశారు. ఓషో తన బోధనల ద్వారా సంప్రదాయాలను ప్రశ్నిస్తూ, ఆధునిక ప్రపంచంలో వ్యక్తిగత స్వేచ్ఛకు ప్రాముఖ్యత ఇచ్చారు. స్వేచ్ఛను మానవ జీవితంలోని అత్యంత కీలక అంశంగా పరిగణించారు. వ్యక్తి తన స్వంత మార్గాన్ని అన్వేషించి, సంకెళ్ళను తెంచుకోవాలని సూచించారు. ఓషో రూపొందించిన “డైనమిక్ మెడిటేషన్” ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. ఈ ధ్యాన పద్ధతులు శరీరాన్నీ, మనస్సునీ శుద్ధి చేసి, జీవనోత్సాహాన్ని పెంపొందించడంలో సహాయ పడతాయి. ఓషో ప్రేమను స్వేచ్ఛ, బాధ్యతలతో కూడిన వ్యక్తీకరణగా అభివర్ణించారు. నిజమైన ప్రేమ బంధనాలను కలిగించదని చెప్పారు. మతం అనే వ్యవస్థను విమర్శించినప్పటికీ, వ్యక్తిగత అనుభవం ద్వారా ఆధ్యాత్మికతను పొందాలని అన్నారు. శాస్త్ర సాంకేతికతను ఉపయోగించుకుంటూ, ఆధునిక జీవనశైలిలో కూడా ఆధ్యాత్మికతకు స్థానం ఉందని అన్నారు. ఓషో జీవితంలో అనేక వివాదాలు చోటుచేసుకున్నాయి. ఆయన మతాలపై, సంప్రదాయాలపై చేసిన విమర్శలు ఆయనకు అనేక శత్రువులను కల్పించాయి. 1981లో అమెరికాలోని ఒరెగాన్ రాష్ట్రంలో ఆయన స్థాపించిన “రజనీష్ పురం” ఆశ్రమం అనేక చట్టపరమైన సమస్యలకు కారణమైంది. ఆయన విమర్శలు, జీవిత విధానం కొంత మందిని ఆకర్షిస్తే, మరికొంత మందిని దూరం చేసింది. ఓషో అనేక ఉపన్యాసాలు ఇచ్చి వాటిని పుస్తకాల రూపంలో ప్రచురించారు. ఆయన రచనలు ప్రపంచ వ్యాప్తంగా అనేక భాషల్లోకి అనువదించ బడ్డాయి.  “ది బుక్ ఆఫ్ సీక్రెట్స్”, “జోయ్: ది హ్యాపినెస్ దట్ కమ్స్ ఫ్రమ్ వితిన్”, “లవ్, ఫ్రీడమ్, అలోనెనెస్”, “ధ్యానం: ఆర్ట్ ఆఫ్ ఎక్రాసి”. ఓషో 1990 జనవరి 19న పూణేలోని తన ఆశ్రమంలో మరణించారు. ఆయన మరణం తర్వాత కూడా ఆయన బోధనలు ప్రపంచ వ్యాప్తంగా ఆధ్యాత్మికతను ప్రేరేపిస్తున్నాయి. పూణేలోని ఓషో అంతర్జాతీయ ధ్యాన కేంద్రం ఆయన బోధనల మార్గదర్శకంగా ఉంది. ఓషో తత్వశాస్త్రం, ఆధ్యాత్మికత ఆధునిక ప్రపంచంలోనూ సమానంగా సమర్థవంతంగా పనిచేస్తుంది. ఆయన ధ్యాన పద్ధతులు, స్వేచ్ఛాపరమైన ఆలోచనలు ప్రతి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయి. ఆధునికతతో కూడిన ఆధ్యాత్మికతకు ఓషో సమగ్ర రూపం అని చెప్పవచ్చు.

## విజయానికి స్ఫూర్తి ప్రదాత

ప్రపంచంలో అగ్రరాజ్యమైన అమెరికాతో 20 ఏళ్ళు పోరాటం చేసి, ఎదురే లేదనుకుని విర్రవీగిన అమెరికా మెడలు వంచి విజయం సాధించిన దేశం వియత్నాం. అమెరికాపై సాధించిన విజయం తర్వాత వియత్నాం అధ్యక్షుడిని ఒక విలేకరి ఇలా ప్రశ్నించాడు. “మీరు అమెరికాను ఎలా ఓడించారో ఎవరికీ అంతుబట్టడం లేదు” అని. ఆ విలేకరి అడిగిన ప్రశ్నకు వియత్నాం అధ్యక్షుడు చెప్పిన సమాధానం... “శక్తివంతమైన అమెరికాను ఓడించడానికి నేను గొప్ప దేశభక్తిగల భారతీయ రాజు చరిత్రను చదివాను.... ఆయన జీవితం నుంచి ప్రేరణ పొంది యుద్ధనీతి, ప్రయోగాలతో విజయం సాధించాం” అని అన్నాడు. ఎవరా భారతీయ రాజు? అని విలేకరి అడిగితే వియత్నాం అధ్యక్షుడు లేచి నిలబడి ఆయనే  రాజస్థాన్‌లోని “మేవాడ్ వీరుడు మహారాజు రాణా ప్రతాప్ సింగ్” అని గర్వంగా ప్రకటించాడు. మహారాణా ప్రతాప్ సింగ్ పేరు చెప్పేటప్పుడు అతడి కళ్లల్లో వీరత్వం తొణికిసలాడింది. “అలాంటి రాజు మా దేశంలో జన్మించి ఉంటే మేము ఈ ప్రపంచాన్నే జయించే వారమని” అన్నాడు. కాలక్రమంలో వియత్నాం అధ్యక్షుడు చనిపోయిన తర్వాత అతడి సమాధి మీద “ఇది మహారాణా ప్రతాప్ యొక్క శిష్యుడిదని” రాశారు. కొన్నేళ్లకు వియత్నాం విదేశాంగమంత్రి భారత పర్యటనకి రావడం జరిగింది. దేశంలోని గొప్పవారికి శ్రద్ధాంజలి ఘటించడానికి ఆయనకు మొదట గాంధీ సమాధి చూపించారు. ఆ తర్వాత ఎర్రకోట ఇలా చూపించే టప్పుడు... వియత్నాం మంత్రి మహారాణా ప్రతాప్ సమాధి ఎక్కడ? అని ప్రశ్నించాడు.

ఆ మంత్రి ప్రశ్నకు ఆశ్చర్య పోయిన భారత అధికారి ఉదయపూర్‌లో ఉందని తెలిపాడు. ఆయన ఉదయ్‌పూర్ వెళ్లి సమాధిని దర్శించి, అక్కడ నుంచి “పిడికిడు మట్టిని” తీసుకొని తన బ్యాగ్‌లో వేసుకున్నాడు. దీన్ని గమనించిన భారత అధికారి మట్టిని బ్యాగ్‌లో ఎందుకు పెట్టుకున్నారని అడిగాడు.... ఇదే మట్టి దేశ భక్తులైన వీర పుత్రులకు జన్మనిచ్చింది... అందుకే దీన్ని తీసుకెళ్లి మాదేశం మట్టిలో కలుపుతాను. ఇలాంటి రాజు ప్రేరణతో అక్కడ కూడా దేశభక్తులు జన్మిస్తారని.... మహారాణా ఈ దేశమే కాదు ప్రపంచం గర్వించదగ్గ రాజని” అన్నాడు. రాజపుత్ర వీరుడు మహారాణా ప్రతాప్ 1540 మే 9 (జ్యేష్ఠ శుక్ల తదియ) రాజస్థాన్‌లోని కుంబల్‌లో జన్మించాడు. 1568లో మేవాడ్ పాలకుడిగా బాధ్యతలు చేపట్టిన మహారాణా 1597 వరకు పరిపాలించాడు. గొప్ప చక్రవర్తిగా చరిత్రకారులు పేర్కొన్న అక్బర్ ఆ సమయంలో ఢిల్లీ సింహాసనాన్ని పాలిస్తున్నాడు. స్వాతంత్రం, ఆత్మ గౌరవం కోసం నిరంతరం మొఘలులతో పోరాటం చేస్తూ రాణా ప్రతాప్ ఏనాడు తల వంచలేదు. మహారాణా ప్రతాప్ ఒకసారి తలదించి, తన కాళ్లమీద పడితే సగం హిందూస్థాన్‌కు రాజును చేస్తానని అక్బర్ ప్రతిపాదిస్తే, దాన్ని తుచ్ఛమైందిగా తిరస్కరించాడు.

ఒకసారి భారత్ పర్యటన కోసం అబ్రహాం లింకన్ సిద్ధమవు తుండగా తన తల్లిని తిరిగి వచ్చే టప్పుడు ఏమి తీసుకు రావాలని అడిగాడు. దానికి ఆమె రాజస్థాన్‌లోని “మేవాడ్ నుంచి పిడికెడు మట్టి తీసుకురా”, అక్కడి రాజు ఎంత విశ్వస పాత్రుడిగా ఉండే వాడంటే సగం దేశాన్ని ఇస్తామని ప్రలోభపెట్టినా తన మాతృ భూమినే కోరుకున్నాడు, కానీ స్వార్థం చూప లేదని చెప్పిందట. అయితే కొన్ని కారణాల రీత్యా అతని పర్యటన రద్దయ్యింది. ఈ విషయాలు “బుక్ ఆఫ్ ప్రెసిడెంట్ యుఎస్ఏ”లో పేర్కొన్నారు. మహారాణా ప్రతాప్ 7 అడుగుల ఎత్తు ఉండేవాడు. 235 కిలోల బరువున్న మహారాణా యుద్ధ సామగ్రి ఉదయపూర్ ప్యాలెస్‌లో భద్రపరచ బడింది. భాలా (ఈటె) మాత్రమే 35 కిలోల బరువు ఉంటుంది. అల్ బరౌని అనే రచయిత మహారాణా ప్రతాప్ దగ్గర ఉన్న “రాంప్రసాద్” అనే ఏనుగు గురించి తన పుస్తకంలో రాశాడు. మేవాడ్ మీద యుద్ధం చేసేటప్పుడు మహారాణా ప్రతాప్ తోపాటు అయన ఏనుగు రాంప్రసాద్‌ను కూడా బంధిగా పట్టుకుంటే సరిపోతుందని అక్బర్ తన సైన్యంతో అన్నాడు. రాంప్రసాద్ మొఘలకు చెందిన 13 ఏనుగులను హత మార్చింది. అలాగే దాన్ని బంధించడానికి 7 పెద్ద ఏనుగుల మీద 14 మంది నైపుణ్యం కలిగిన మావటిలు చక్రవ్యూహం పన్నారని అల్ బరౌని తన రచనలో పేర్కొన్నాడు. బంధించిన రాంప్రసాద్‌ను అక్బర్ ముందు నిలబెడితే దానికి “పీర్ ప్రసాద్” అని నామకరణం చేశాడు. అయితే ఆ ఏనుగు 18 రోజుల వరకు మంచి నీళ్లు కూడా ముట్టు కోకుండా ప్రాణాలు కోల్పోయింది. తర్వాత ఈ దృశ్యాన్ని చూసిన అక్బర్ ఈ ఏనుగునే వంచలేక పోయాను... మహారాణాను ఎలా వంచగలుగుతా అని అన్నాడట. మహా రాణా ప్రతాప్ సింహ్ చనిపోయాక అక్బర్ కూడా కన్నీళు పెట్టుకున్నట్లు చరిత్ర కారులు పేర్కొన్నారు. రాణా గుర్రం అయిన “చేతక్” మహారాణాను మోస్తూ, 26 అడుగుల కందకం మీద నుంచి దూకి అది దాటిన తరువాత చనిపోయింది. అంతకంటే ముందే దానికి ముందు కాలు విరిగి ఉన్నప్పటికి ఆ కందకాన్ని దుమికింది. అది ఎక్కడైతే చనిపోయిందో, అదే ప్రదేశంలో దాని గౌరవార్థం చేతక్ మందిరం కట్టారు. చేతక్ ఎంత బలమైనదంటే తన ఎదుట ఏనుగుమీద ఉన్న సైనికుణ్ణి అందు కోవటానికి అంత ఎత్తులో గాలిలో ఎగిరేది.

అంతటి శక్తి కలిగినది కనుకే చేతక్ పేరును ద్విచక్ర వాహనానికి పెట్టడం గమనార్హం. హల్దీ ఘాట్ యుద్ధం జరిగి 300 సంవత్సరాల తరువాత కూడా అక్కడి నేలలో కత్తులు లభించాయి. చివరి సారిగా 1985 లో ఒక ఆయుదం దొరికింది. “ఒంటరిగా, మరే రాజపుత్ర రాజ్యాల మద్దతూ లేకుండా మొగలు సామ్రాజ్యాన్ని ధిక్కరించిన రాణా ప్రతాప్ శౌర్యం, రాజపుత్ర శౌర్య ప్రతాపాలను, వారి ఆత్మ గౌరవాన్నీ, వారి విలువలనూ వివరించే గొప్ప గాథ. రాణా ప్రతాప్ అవలంబించిన యుద్ధ తంత్రాన్ని ఆ తరువాత మాలిక్ అంబర్, ఛత్రపతి శివాజీలు కూడా అనుసరించారని”, చారిత్రికుడు సతీష్ చంద్ర పేర్కొన్నాడు.

# సంస్కరణాభిలాషి దేవేంద్రనాథ్ ఠాగూర్

దేవేంద్రనాథ్  ఠాగూర్ ( మే 15 1817 – జనవరి 19 1905) హిందూ తత్వవేత్త, బ్రహ్మ సమాజంలో మత సంస్కర్త. బ్రహ్మ సమాజ చరిత్రలో దేవేంద్రనాథ్ ఠాగూర్ పాత్ర ఎన్నదగినది.దేవేంద్రనాథ్ ఠాగూర్ ఈ దేశం సృష్టించిన గొప్ప మత మేధావులలో ఒకరు. ఆయనను. పూర్వ నిజంగా ఋషుల వారసునిగా భావించేవారు.. ఆయన స్వభావం ముఖ్యంగా ఆధ్యాత్మికం. ఆయన హిందూ మత సంస్కరణానికి కృషి చేశారు. 1848లో బ్రహ్మో మతం స్థాపించిన వ్యక్తి. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ ఆయన కుమారుడే. దేవేంద్రనాథ్ ఠాగూర్ ధనిక కుటుంబంలో బెంగాల్ లో శ్రీలైదాహాలో జన్మించారు. ఆయన తండ్రి ప్రముఖ విద్వాంసులు, ఆధ్యాత్మిక వేత్త  ద్వారకానాథ్ ఠాగూర్. దేవేంద్రనాథ్ వంశస్థులు తరతరాలుగా స్థితిమంతులే కాక ఉన్నత విద్యావంతులు, వారి రంగాల్లో నిపుణులూ కూడా అయి ఉన్నారు. దేవేంద్రనాథ్ ఠాగూర్ తండ్రి ద్వారకానాథ్, ఆయనలోని దాతృత్వ గుణం కారణంగా ప్రిన్స్ అనే పేరుతో పిలిచేవారు. ద్వారకానాథ్ ఠాగూర్ ఆనాటి వంగదేశంలో సంస్కర్తగా, మతకర్తగా ప్రఖ్యాతులైన రాజా రామ్మోహనరాయ్‌తో సన్నిహిత సంబంధాలు ఉండేవి. ఆయన సంస్కరణాభిలాషను, హిందూమత ఔన్నత్య చింతననూ ద్వారకానాథ్ అభినందించేవారు. రామమోహనరాయ్ ప్రారంభించిన బ్రహ్మ సమాజంపై సమాజంలోని నలువైపులా ఆరోపణలు, వ్యతిరేకత ప్రారంభమైన రోజుల్లో ద్వారకానాథ్ బ్రహ్మసమాజానికి, రామ్మోహనరాయ్‌కీ ప్రధాన సహాయకునిగా ఉండేవారు. ఠాగూరు కుటుంబపు జాగీరైన జాకో సంకోలోని ఒక భవనంలో బ్రహ్మసమాజపు మొదటి ప్రార్థనాలయాన్ని నిర్మించారు. దానికి బ్రాహ్మ సమాజం అని పేరుపెట్టారు రామ్మోహనరాయ్. ఆపైన జోరా సంకోలో ఠాగూరు వంశస్థులందరూ బ్రహ్మ సమాజీకులుగా మారారు. రామ్మోహనరాయ్ క్రైస్తవ మతప్రచారాన్ని తిప్పికొట్టేందుకు మిషనరీ పాఠశాలలకు ప్రతిగా ప్రారంభించిన విద్యాలయాల్లో కూడా ఠాగూర్ వంశస్థులే తొలి విద్యార్థులుగా చేరారు. దేవేంద్ర నాథ్ తండ్రి జమీందార్ అయిన ద్వారకానాథ్, అనేక ఆస్తులు... టీ, జనపనార వ్యాపారం, చక్కెర శుద్ధి, వార్తాపత్రికలు, షిప్పింగ్ వంటి వ్యాపారాలను కలిగి ఉండేవారు.18 సంవత్సరాల వయస్సులో, దేవేంద్రనాథ్ ప్రాపంచిక వ్యవహారాలతో తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూనే, తన ఆలోచనలకు అనుగుణంగా వ్యవహారాలను కొనసాగిస్తున్న సమయాన ఏదో తెలియని నిర్లిప్త భావాన్ని పెంచుకున్నారు. కొంత కాలానికి వ్యాపార నిర్వహణ చాలా వరకు సిబ్బందికి అప్పగించారు.  తన సమయాన్ని ఆధ్యాత్మిక సత్యంపై గడపాలని ఎంచుకున్నారు. అది జీవితకాల అన్వేషణగా మారింది.1848లో బ్రహ్మోయిజం అనే మతాన్ని స్థాపించారు. దేవేంద్రనాథ్ ఆది ధర్మ సిద్ధాంతాన్ని బ్రహ్మ ధర్మ బీజ్ (బ్రహ్మ ధర్మానికి బీజం)గా క్రోడీకరించారు. 1950 లో, అతను ప్రాథమిక సూత్రాలను పొందుపరుస్తూ బ్రహ్మ ధర్మ అనే పుస్తకాన్ని ప్రచురించారు. ఈ సూత్రాలు ఏకేశ్వరోపాసన, హేతుబద్ధతను నొక్కిచెబుతాయి. 19 జనవరి 1905న మరణించే వరకు దానికి నమ్మకంగా ఉన్నారు, దానిని మరియు సేవించారు. రాజా రామ్ మోహన్ రాయ్ యొక్క బ్రహ్మ సభ (తరువాత బ్రహ్మ సమాజం) నుండి ప్రేరణ పొందిన, బ్రహ్మోయిజం అనేది 19వ శతాబ్దపు బెంగాల్ ప్రతిఘటనకు కీలకమైన సంస్కరణవాద మతం. ఇది ఉపనిషత్తుల పఠనాలపై ఎక్కువగా ఆధారపడింది. ఉపనిషత్తులను అనుసరించిన దేవేంద్ర నాథ్ మాస్టర్ గా తర్వాత మహర్షి అయ్యారు. బ్రహ్మ సభకు ప్రారంభ సందర్శనలలో, అన్ని కులాలు,   మతాల ప్రజలు వివక్ష లేకుండా ఎలా స్వాగతించ బడ్డారో ఆయన గమనించారు. తత్వబోధిని అనే పత్రికను 1843లో స్థాపించి, నాటి సాంఘిక దురాచారాలు, మూఢ నమ్మకాలకు, మిషనరీల ద్వారా ధార్మిక పరివర్తనకు వ్యతిరేకంగా ప్రచురణల పరంపర కొనసాగించారు. ఆయన మొదట తత్వబోధిని సభ అనే ప్రత్యేక వేదాంత సమాజాన్ని నడిపారు, కాని తరువాత రెండింటినీ విలీనం చేసి బ్రహ్మో ఉద్యమాన్ని చేపట్టాలని నిర్ణయించుకున్నారు. నేను బ్రహ్మసమాజాన్ని సంస్కరించే బాధ్యతను స్వీకరించాను మరియు దానితో తత్వబోధిని సభను విలీనం చేసాను, ”అని ఆయన తన ఆత్మకథలో రాశారు. తత్వబోధిని సభ బ్రహ్మ సమాజ ప్రయోజనాలను మరింత పెంచేలా ఏర్పాటు చేయ బడింది. ఆయన అమితంగా ఇష్టపడే అమ్మమ్మ మరణం దేవేంద్రునిలో మౌలిక మార్పుకు కారణమైంది. ఆమె మరణం యువకుడైన దేవేంద్రనాథ్‌ను శాశ్వతంగా మార్చేసింది. “నేను ఇక ఇదివరకటి మనిషిలా లేను. నాలో సంపద పట్ల బలమైన విరక్తి ఏర్పడింది. నేను కూర్చున్న ముతక వెదురు చాప నాకు సరిపోయే ఆసనంగా అని అనిపించింది, తివాచీలు, ఖరీదైన వస్తువులు ద్వేషపూరితంగా అనిపించాయి, నా మనస్సులో ఇంతకు ముందు అనుభవించని ఆనందం మేల్కొంది, ”అని ఆయన పేర్కొన్నారు.వృద్ధాప్యంలో, దేవేంద్రనాథ్ మరింత ఒంటరిగా మారారు, తాము స్థాపించిన మతం వ్యవహారాల  నుండి వైదొలిగి, మరింత శాంతియుత వాతావరణాన్ని కోరుకున్నారు. 1860వ దశకంలో,  శాంతినికేతన్‌కు వెళ్లారు. అక్కడ  గ్రంథాలను చదవడం మరియు బ్రహ్మోయిజం యొక్క పరిమితులను గురించి ఆలోచించడం కొనసాగించారు. ఆయన అమితంగా ప్రేమించే రూపం ఆయన దైవం బ్రహ్మ.“నేను వెళ్లి ఒక అశ్వత్థ చెట్టు క్రింద కూర్చున్నాను, ఆత్మలో నివసించే పరమాత్మ గురించి ధ్యానం చేయడం ప్రారంభించాను, ” అని తమ మొదటి బ్రహ్మ దర్శనంపై రాశారు. “నా మనస్సు భావోద్వేగాలతో నిండిపోయింది, నా కళ్ళు కన్నీళ్లతో నిండిపోయాయి. ఒక్కసారిగా నా హృదయ కమలంలో బ్రహ్మదేవుని ప్రకాశించే దృశ్యం కనిపించింది. నా శరీరమంతా పులకించింది. నేను అన్ని స్థాయిలకు మించిన ఆనందాన్ని అనుభవించాను”. కుల వ్యవస్థను త్యజించడం,  విగ్రహారాధనతో సహా సంస్కరణవాద విధానం, ఆ కాలంలోని అత్యంత ప్రభావవంతమైన మతాలలో ఒకటిగా బ్రహ్మోయిజాన్ని మార్చింది. దాని ఆలోచనలు ప్రజలను ఆలోచింప చేశాయి. దేవేంద్రనాథ్ ఆధ్వర్యంలో బ్రహ్మోయిజం ప్రభావం భారతదేశం అంతటా వ్యాపించి, అతను ప్రత్యేక ఆధ్యాత్మిక సాఫల్య వ్యక్తిగా ఖ్యాతిని పొందాడు మరియు మహర్షిగా పిలువబడ్డాడు. దేవేంద్రనాథ్‌ను సందర్శించిన 19వ శతాబ్దపు గొప్ప హిందూ ఋషి శ్రీరామకృష్ణ అతని ఆధ్యాత్మిక స్థాయిని ధృవీకరించారు. బెంగాల్ పునరుజ్జీవనం మరియు హిందూ మతం యొక్క సంస్కరణ మరియు పునరుజ్జీవనంలో దేవేంద్రనాథ్ పాత్రలు నిస్సందేహమైనవి.

## డీజీపీ రేసులో హరీష్ గుప్తా

విజయవాడ, జనవరి 18, ఏపీలో కొత్త డీజీపీ ఎంపికపై మళ్లీ చర్చ మొదలైంది. జనవరి నెలాఖర్లో ప్రస్తుత డీజీపీ ద్వారకా తిరుమల రావు పదవీ విరమణ చేయనుండటంతో ఆయన స్థానంలో ఎవరిని ఎంపిక చేస్తారనేది ఆసక్తి కరంగా మారింది. ప్రస్తుత డీజీపీని కొనసాగించడంపై యూపీఎస్సీకి ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ప్రతిపాదన పంపకపోవడంతో కొత్త డీజీపీ ఎంపిక అనివార్యం కానుంది.మరోవైపు కొత్త డీజీపీ రేసులో మాజీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం హరీష్ కుమార్ గుప్తాను గత మేలో డీజీపీగా నియమించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం సందర్భంగా ఏర్పాట్లలో పోలీసులు విఫలం కావడం, గత ఏడాది జూన్ 12న నగరంలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ కావడం వివాదాస్పదమైంది. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విఐపిలు కూడా సకాలంలో చేరుకోలేకపోయారు. ఆ తర్వాత అనూహ్యంగా జూన్ 21వ తేదీన డీజీపీగా ద్వారకా తిరుమలరావును రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిందిద్వారకా తిరుమల రావు పదవీ కాలం జనవరి 31తో ముగియనుండటంతో ఆయన్ని మరికొంత కాలం పొడిగిస్తారా లేదా అనే దానిపై అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి దావోస్ పర్యటన తర్వాత కొత్త డీజీపీ ఎంపికపై నిర్ణయం తీసుకుంటారు. ద్వారకా తిరుమల రావు తర్వాత సీనియార్టీలో మొదటి స్థానంలో ఉన్నఅంజనీ కుమార్ ఏపీ క్యాడర్‌కు రాలేదు. ఆయన తర్వాత ఉన్న హరీష్ కుమార్ గుప్తా 2025 ఆగస్టులో పదవీ విరమణ చేస్తారు. ద్వారకా తిరుమలరావు పదవీ కాలాన్ని పొడిగిస్తే హరీష్‌కుమార్‌కు డీజీపీ అవకాశం దక్కదు. దీంతో ప్రభుత్వం సీనియార్టీ ప్రాతిపదికన హరీష్ కుమార్‌కు అవకాశం ఇచ్చే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.గత ఏడాది మే6వ తేదీన హరీశ్ కుమార్ గుప్తాను కేంద్ర ఎన్నికల సంఘం డీజీపీగా ఎంపిక చేసింది. 1992 ఐపీఎస్ బ్యాచ్ కు చెందిన హరీశ్ కుమార్ గుప్తాను డీజీపీగా నియమించాలని ఈ మేరకు సీఎస్ కు జవహర్ రెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. మే 5న ఏపీ డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డిపై ఈసీ బదిలీ వేటు వేసింది.రాజకీయ ఆరోపణల నేపథ్యంలో రాజేంద్రనాథ్ రెడ్డిని బదిలీ చేసిన ఈసీ ఆయన స్థానంలో హరీష్‌ను ఎంపిక చేసింది. సీనియార్టీలో ద్వారకా తిరుమల రావు, హరీశ్ కుమార్ గుప్తా, మాదిరెడ్డి ప్రతాప్ ల పేర్లను ఏపీ సీఎస్ ఈసీకి సూచించారు. వీరిలో సీనియర్ ఐపీఎస్, 1992 బ్యాచ్ కు చెందిన హరీశ్ కుమార్ గుప్తా పేరును ఈసీ డీజీపీగా ఎంపిక చేసింది. జమ్మూ కశ్మీర్‌కు చెందిన హరీష్ కుమార్ ఏపీ క్యాడర్‌కు ఎంపికయ్యారు.సీనియార్టీలో హరీష్ తర్వాత స్థానాల్లో సీతారామాంజనేయులు, కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి ఉన్నారు. ఆ తర్వాత 93 బ్యాచ్‌కు చెందిన నళినీ ప్రభాత్, మహేష్ దీక్షిత్‌లు కేంద్ర సర్వీసుల్లో ఉన్నారు. అమిత్ గార్గ్ సర్దార్ వల్లభాయ్‌పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో ఉన్నారు. 94 బ్యాచ్‌లో పీవీ సునీల్, కుమార్ విశ్వజిత్, రవిశంకర్ అయ్యన్నార్, బాలసుబ్రహ్మణ్యం ఉన్నారు. హరీష్ కుమార్ తర్వాత డీజీపీ రేసులో బాలసుబ్రహ్మణ్యం, రవిశంకర్ అయ్యన్నార్, కుమార్ విశ్వజిత్ లు ఉంటారు.

## కోడిపందేలు... సామాన్యులపై కేసులు
### ఇదెక్కడి చోద్యం

కాకినాడ, జనవరి 18, ఆడింది.. వారు... ఆడించింది రాజకీయ ప్రముఖులు.. కానీ బుక్ అయ్యింది మాత్రం సామాన్యులు.. అదికూడా పనివాళ్లు.. తెలుగువారి పెద్దపండుగ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మూడు రోజుల పాటు నిర్వహించిన కోడిపందేలుకు సంబంధించి కోడిపందేల వద్ద కత్తులు కట్టేవారు.. అక్కడ రోజు కూలీకోసం పనిచేసిన వారు కేసుల్లో ఇరుక్కున్నట్లు తెలుస్తోంది.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా సుమారు 1200 మందిపై బైండోవర్ కేసులు నమోదు కాగా ఎక్కువశాతం మంది సామాన్యులే బలయ్యారన్నది వాస్తవంగా కనిపిస్తోంది.ముందెప్పుడూ లేనంతగా ఈ ఏడాది కోడిపందేలు జోరుగా సాగాయి. ఉభయగోదావరి జిల్లాల్లో ఊరికి పది చొప్పున అక్కడ ఇక్కడ అన్న తేడా లేకుండా కోడిపందేలు బరులు ఏర్పాటు చేశారు. ఇక వాటి చెంతనే గుండాటలు, ఇతర జూదాలు, కొన్నిచోట్ల ఏకంగా క్యాసినోలు కూడా నిర్వహించారు. పోలీసుల ఆంక్షలు మాట అటుంచితే ఎక్కడబడితే అక్కడ విచ్చలవిడిగా కోడిపందేలు, జూదాలు జరగ్గా కోట్లాది రూపాయలు చేతులు మారాయి.కోడిపందేల నిర్వాహణకు ముందు నెల రోజుల నుంచి పోలీసులు గతంలో కోడిపందేలు ఆడుతున్నవారి మీద ఉన్న కేసులు ఆధారంగా, గుండాటలు నిర్వహించే వారిపై నమోదైన కేసులు ఆధారంగా బైండోవర్లు నమోదు చేశారు. అయితే వీరిలో అంతా కూడా సామాన్యులు, కూలినాలీ చేసుకునేవారు, కోళ్ల పోషణను చూసి వాటికి కత్తులు కట్టేవారే ఉన్నారు.గోదావరి జిల్లాలో ప్రతీ నియోజకవర్గంలో ఈ ఏడాది భారీ ఎత్తున కోడిపందేలు నిర్వహించారు. వీటి వెనుక ప్రతీ మండల పరిధిలో, గ్రామ పరిధిలోనూ రాజకీయ నాయకులు ఉన్నారు. వారిపై ఒక్క కేసు నమోదు కాని పరిస్థితి కనిపించింది. పైగా కోడిపందేల బరులను వీరే దగ్గరుండి ట్రాక్టర్లుతో చదును చేయించి ఆపై అక్కడ షామియానాలు ఏర్పాటు చేయించారు. పైగా బరుల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి మరీ వారి పేర్లు వేయించుకున్నారు. అయినా వీరిపై కేసులు నమోదు కాకపోవడం విమర్శలపాలవుతోంది. ఈ ఏడాది ఎక్కడ బడితే అక్కడ విచ్చలవిడిగా కోడిపందేలు నిర్వహించడంతో చాలా మంది అప్పులు చేసి, ఆస్తులు తాకట్టుపెట్టి మరీ లక్షలు పోగొట్టుకున్న పరిస్థితి కనిపించిందని టాక్ నడుస్తోంది. ముఖ్యంగా భీమవరం, కాకినాడ, మురముళ్ల ప్రాంతాల్లో చాలా మంది ఆస్తులను కూడా పందేల్లో బెట్టింగ్ పెట్టి పోగొట్టుకున్నారని తెలుస్తోంది. భీమవరంలో నిర్వహించిన కోడిపందేలలో ప్రతిష్టకు పోయి రెండెకరాల వ్యవసాయ భూమిని పందెంలో వేసి పోగొట్టుకున్నట్లు సమాచారం. ఇలా ప్రతీ చోట అతికి పోయి డబ్బును, డబ్బులు కట్టలేని పరిస్థితిలో ఆస్తులను పందేలలో పోగొట్టుకున్నారట..

# బలమైన మిత్రబంధమేనా...

తిరుపతి, జనవరి 18,రాజకీయాలు అన్నప్పుడు పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. మొన్నటి ఎన్నికల్లో లభించినంత ప్రజా మద్దతు ఎప్పటికీ ఉండకపోవచ్చు. అలాంటప్పుడు కూటమిగా పోటీ చేస్తే..గత ఎన్నికల్లో వచ్చినంత ల్యాండ్ స్లైడ్ విక్టరీ కాకపోయిన..ప్రభుత్వ ఏర్పాటుకు మాత్రం ఇబ్బంది ఉండదనేది బాబు, పవన్ ప్లాన్‌గా తెలుస్తోంది. సేమ్‌టైమ్ కూటమిగా గెలిచారు..ఎన్నాళ్లు కలిసి ఉంటారు.? మిత్రబంధం ఎప్పటిదాకా.? అన్న ప్రశ్నలకు కూడా తమ కామెంట్స్‌తో క్లారిటీ ఇచ్చేస్తున్నారు టీడీపీ, జనసేన అధినేతలు. పొత్తు ఉంటుంది.. క్షేత్రస్థాయిలో టీడీపీ-బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు కలిసి నడవాల్సిందేనని ఇండికేషన్ ఇస్తున్నారు.మరో 15 ఏళ్లు పొత్తు ఉంటుందని అని పవన్ అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సీఎం అయ్యేదెప్పుడు అనేది పెద్ద క్వశ్చన్‌గా మారింది. పవన్ మాత్రం పదవుల కంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమంటున్నారు. ఈ టర్మ్‌లోనే రెండున్నరేళ్లు సీఎం పదవి అడగాలని కొందరు సూచించినా అలాంటి షరతులు ఏం పెట్టలేదు.ఎన్నికలు ఎప్పుడొచ్చినా కూటమిగానే రంగంలోకి దిగుతాం. మొన్న గెలిచామని లైట్ తీసుకోవడం లేదు.. ఇంకో పదిహేనేళ్లు టీడీపీతోనే దోస్తీ అంటున్నారు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్. కలిసి కదం తొక్కి మొన్నే సత్తా చాటాం..రాబోయే రోజుల్లోనూ కలిసే నడుస్తాం..నవ్యాంధ్రను ఒక్కో మెట్టుపైకి ఎక్కిస్తామంటూ..కూటమి ఫ్యూచర్‌పై అటు సీఎం చంద్రబాబు, ఇటు డిప్యూటీ సీఎం పవన్ ఫుల్ క్లారిటీతో ఉన్నారు.మరో పదిహేనేళ్లు కలిసే ఉండాలని భావిస్తున్నాం. రెండు రోజుల నుంచి డిప్యూటీ సీఎం జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలివి. గతంలోనూ కూటమిగానే ముందుకెళ్తామని చెప్పారు పవన్. ఇప్పుడు మరింత గట్టిగా తన వాదనను వినిపిస్తున్నారు. గతేడాది జరిగిన ఎన్నికల్లో అనూహ్యంగా పొత్తు పెట్టుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి నేతల మధ్య అక్కడక్కడ విభేదాలు వచ్చాయి. నియోజకవర్గాల్లో మూడు పార్టీల లీడర్లకు కోఆర్డినేషన్ మిస్ అవడంతో పాటు వైసీపీ నుంచి వచ్చే నేతల చేరికల విషయం లోనూ కాస్త గ్యాప్ ఏర్పడింది.అనంతపురంలో బీజేపీ వర్సెస్ టీడీపీ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో టీడీపీ వర్సెస్ జనసేన.. ఇలా పలు జిల్లాల్లో కూటమి నేతల మధ్య గొడవలు రాజకీయంగా ఉద్రిక్తతలకు దారితీశాయి. ఇలాంటి సందర్భాల్లో పొత్తు ఉంటుందని కుండ బద్దలుకొట్టి చెప్తున్నారు పవన్. అయితే నియోజకవర్గాల్లో మూడు పార్టీల నేతల సఖ్యత కుదరకపోవడంతో పొత్తు కష్టమేనన్న వాదనలు వినిపించాయి. అయినా ఎక్కడా కూడా గాడి తప్పకుండా పొత్తు రథం పదిలంగా ముందుకు సాగింది.అయితే పొత్తు విషయంలో బాబు కంటే ముందే పవన్ క్లారిటీతో ఉన్నారు. పలుమార్లు సేనాని ఓపెన్‌గానే స్టేట్‌మెంట్ ఇచ్చేశారు. ఇంకో పదేళ్లు చంద్రబాబే సీఎంగా ఉండాలని ఆ మధ్య తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు పవన్. బాబు దూరదృష్టితో ఏపీ మరింత డెవలప్ అవుతుందని చెప్పుకొచ్చారు.ఆ తర్వాత కూటమి ఫ్యూచర్‌పై హస్తిన వేదికగా సీఎం చంద్రబాబు చేసిన కామెంట్స్ చర్చనీయాంశం అయ్యాయి. జమిలి ఎన్నికలు వచ్చినా..2029లో ఎలక్షన్స్ జరిగినా కలిసే పోటీ చేస్తాం.. ఇప్పటి నుంచే ఎన్నికలకు రెడీ అవతున్నామంటూ బాబు చెప్పడం హాట్ టాపిక్ అయింది. అధికారంలోకి వచ్చాం..అవసరమైపోయిందని కాకుండా..కలిసి నడిస్తే పార్టీలకు, ప్రజలకు జరిగే మేలేంటి తెలిసిన నాయకులుగా అటు చంద్రబాబు, ఇటు పవన్ బిహేవ్ చేస్తున్నారు.ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చాయి. ఇందులో ఒక్క టీడీపీకి మాత్రమే గెలుపును సొంతం చేసుకునేంత ఓటు బ్యాంకు ఉంది. జనసేనకు పవన్ ఇమేజ్, క్యాస్ట్ ఈక్వేషన్స్‌తో చెప్పుకోదగ్గ ఓటు బ్యాంకు ఉన్నప్పటికీ సొంతంగా గెలిచేంత బలం లేదు. అలా అని కీలకం కాదని చెప్పలేం.

ఏపీలో గెలుపోటములను డిసైడ్ చేసేంత సత్తా మాత్రం జనసేకు ఉంది. ఇక బీజేపీ అయితే కూటమితోనే అన్నో ఇన్నో సీట్లు సంపాదిస్తూ వస్తోంది. సో ఈ నేపథ్యంలో అధికారంలో ఉండాలని కోరుకునే ఈ మూడు పార్టీలు..కలిసి పోటీ చేస్తేనే పవర్ స్టీరింగ్‌ను పట్టుకోగలవన్నది రాజకీయ నిపుణుల అభిప్రాయం.పొత్తుపై ముందే అలర్ట్ అవడం వెనుక ఇంకో స్ట్రాటజీ ఉందట. ఏ పార్టీ ప్రభుత్వంలో ఉన్నా అంతో ఇంతో ప్రజావ్యతిరేకత కామన్. డిసైడింగ్ ఫ్యాక్టర్‌గా ఉండే ఆ ఓటు షేర్ మీదే గెలుపోటములు డిపెండ్ అయి ఉంటాయ్. అందుకే ఎవరిదారి వారిదే అని కాకుండా..లాంగ్ లివ్ కూటమి అంటున్నారు బాబు, పవన్.రాష్ట్రంలో జనసేన, బీజేపీ కంటే టీడీపీ ఓటు బ్యాంకే ఎక్కువ. ఆ పార్టీనే బూత్ స్థాయి వరకు చాలా స్ట్రాంగ్‌గా ఉంది. ఆ తర్వాత ప్రతీ ఊర్లో పవన్‌కు అభిమానులు ఉంటారు. అంత పటిష్టంగా ఉండి కూటమిని లీడ్ చేస్తున్న టీడీపీ, జనసేన అధినేతలే పొత్తు ఉంటుందని పదేపదే చెప్పడం వెనుక పెద్ద ప్లానే ఉన్నట్లు కనిపిస్తోంది.రాబోయే రోజుల్లో కూడా కలిసి నడుస్తామంటే పవన్ సీఎం పదవి ఆశలు వదులుకున్నారా అన్న చర్చ జరుగుతోంది. లేక కూటమిగా పోటీ చేస్తేనే గెలుపు సాధ్యమని భావిస్తున్నారా.? టీడీపీకి అండగా నిలిచి..వాళ్ల మద్దతుతోనే సీఎం పదవిలో కూర్చోవాలని స్కెచ్ వేస్తున్నారా అనేది ఆసక్తికరంగా మారింది. పవన్ కామెంట్స్ నేపథ్యంలో ఏపీ పాలిటిక్స్ రాబోయే రోజుల్లో ఎలా ఉండబోతున్నాయో చూడాలి మరి.

# భారతీయ వీర పుత్రుడు మహారాణ ప్రతాపుడు -నేడు ఆయన వర్ధంతి



ప్రతాప్ సింగ్ ప్రస్తుత రాజస్థాన్ రాష్ట్రంలో ఉన్న మేవార్ యొక్క 13 వ రాజు.అతడు మహారాణా ప్రతాప్ గా ప్రసిద్ధి చెందాడు. అతను మేవార్ రాయల్ ఫ్యామిలీకి చెందినవాడు.

మహారాణా ప్రతాప్ హిందూ రాజ్‌పుత్ర కుటుంబంలో 1540 మే 9న జన్మించారు. అతను ఉదయ్ సింగ్ ఎ౨, జైవంతా బాయి దంపతులకు జన్మించాడు. అతని తమ్ముళ్ళు శక్తి సింగ్, విక్రమ్ సింగ్, జగ్మల్ సింగ్. ప్రతాప్‌కు చాంద్ కన్వర్, మాన్ కన్వర్ ఇద్దరు సవతి సోదరీమణులు కూడా ఉన్నారు. అతను బిజోలియాకు చెందిన అజాబ్దే పున్వర్‌ను వివాహం చేసుకున్నాడు.

1572 లో ఉదయ్ సింగ్ మరణం తరువాత, రాణి ధీర్ బాయి తన కుమారుడు జగ్మల్ రాజు కావాలని కోరుకుంది. కాని రాజ దర్బారు లోని సీనియర్ సభికులు పెద్ద కొడుకైన ప్రతాప్‌నే తమ రాజుగా చేసుకోవటానికి ఇష్టపడ్డారు. వారి కోరికే నెగ్గింది.

1567-1568లో చిత్తోర్‌గఢ్ ముట్టడి తరువాత మేవార్ యొక్క సారవంతమైన తూర్పు బెల్టును మొఘలుల వశమైంది. అయితే, ఆరావళి ప్రాంతాంలో అడవులతో కూడిన కొండ రాజ్యం ఇప్పటికీ రాణా నియంత్రణ లోనే ఉంది. మొఘల్ చక్రవర్తి అక్బర్ మేవార్ ద్వారా గుజరాత్‌కు స్థిరమైన మార్గం ఒకటి ఉండాలని అనుకున్నాడు; 1572 లో ప్రతాప్ సింగ్ రాజు (రానా) ఐనప్పుడు, అక్బర్ ఈ ప్రాంతంలోని అనేక ఇతర రాజ్‌పుత్ర నాయకుల మాదిరిగానే రాణా కూడా తనకు సామంతుడుగా ఉండాలని కోరుతూ అనేక రాయబారాలు పంపించాడు. అక్బర్‌కు లొంగడానికి రాణా నిరాకరించడంతో, యుద్ధం అనివార్యమైంది.

హల్దీఃఘాటీ యుద్ధం మహారాణా ప్రతాప్‌కు, మాన్ సింగ్ నేతృత్వం లోని అక్బర్ సైనిక దళాలకూ మధ్య 1576 జూన్ 18 న జరిగింది. ఇందులో. మొఘలులు విజయం సాధించారు. మేవార్ సైన్యానికి గణనీయమైన ప్రాణనష్టం కలిగింది. కాని మహారాణాను పట్టుకోలేక పోయారు. యుద్ధం జరిగిన ప్రదేశం రాజస్థాన్‌లోని ఆధునిక రాజ్‌సమంద్, గోగుండా సమీపంలోని హల్దిఘాటి వద్ద ఒక ఇరుకైన కనుమ దారి. మహారాణా ప్రతాప్ సుమారు 3000 అశ్వికదళాలు, 400 మంది భిల్ విలుకాళ్ళను మోహరించాడు. మొఘలు సేనలకు అంబర్‌కు చెందిన మాన్ సింగ్ నాయకత్వం వహించాడు, అతని వెంట 5000-10,000 మంది సైనికులున్నారు. ఆరు గంటలకు పైగా జరిగిన భీకర యుద్ధం తరువాత, మహారాణా గాయపడ్డాడు. మొఘలు అతన్ని పట్టుకోలేకపోయారు. అతను కొండల్లోకి తప్పించుకోగలిగాడు.

మహారాణా ప్రతాప్‌ను లేదా ఉదయపూర్‌లోని అతని దగ్గరి కుటుంబ సభ్యులను పట్టుకోలేక పోవడంతో, హల్దిఘాటి విజయం మొఘలులకు నిరర్థకమైంది. సామ్రాజ్యం దృష్టి వాయవ్య దిశగా మారిన వెంటనే, ప్రతాప్ ససైన్యంగా అజ్ఞాతం లోంచి వచ్చి పశ్చిమ ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకున్నాడు.


బెంగాల్, బీహార్లలో తిరుగుబాట్లు, మిర్జా హకీమ్ పంజాబ్లోకి చొచ్చుకు రావడం మొదలైన వాటి వల్ల 1579 తరువాత మేవార్ పై మొగలుల ఒత్తిడి సడలింది. 1582 లో మహారాణా ప్రతాప్, దావర్ వద్ద ఉన్న మొగలు స్థావరంపై దాడి చేసి ఆక్రమించాడు. ఇది మేవార్‌లోని మొత్తం 36 మొఘల్ సైనిక కేంద్రాల మూసివేతకు దారితీసింది. ఈ ఓటమి తరువాత, అక్బర్ మేవార్‌పై తన సైనిక చర్యలను ఆపాడు. దావర్ విజయం మహారాణా ప్రతాప్ కీర్తి కిరీటంలోఇక కలికి తురాయి. జేమ్స్ టాడ్ దీనిని "మారథాన్ ఆఫ్ మేవార్"గా అభివర్ణించాడు.1585 లో, అక్బర్ లాహోర్కు వెళ్లి, తరువాతి పన్నెండు సంవత్సరాలు అక్కడే ఉండి, వాయవ్యం లోని పరిస్థితిని పర్యవేక్షించాడు. ఈ కాలంలో మేవార్‌పై పెద్ద మొఘల్ దండయాత్ర ఏదీ జరగలేదు. ఈ పరిస్థితిని సద్వినియోగం చేసుకొన్న ప్రతాప్, కుంభాల్‌గఢ్, ఉదయపూర్, గోగుండలతో సహా పశ్చిమ మేవార్‌ను స్వాధీనం చేసుకున్నాడు. ఈ కాలంలో, అతను ఆధునిక దుంగార్‌పూర్ సమీపంలో చావండ్ అనే కొత్త రాజధానిని కూడా నిర్మించాడు.

ఒక కథనం ప్రకారం 1597 జనవరి 19 న చావండ్ వద్ద వేటకు వెళ్ళినపుడు ప్రమాదంలో గాయపడి రాణా ప్రతాప్ మరణించాడు. అప్పటికి అతడికి 56 సంవత్సరాల వయస్సు. అతని తరువాత అతని పెద్ద కుమారుడు మొదటి అమర్ సింగ్ రాజయ్యాడు.

# డీ టెన్షన్ విధానంపై చర్చ

మానవ వనరుల నిర్మాణానికి విద్య అత్యంత కీలకమైనది. అందరికీ నాణ్యమైన విద్య అందించినప్పుడే ఇది సాధ్యమవుతుంది. ఈ లక్ష్య సాధనలో విద్యాహక్కు చట్టం 2009ను తీసుకురావడం జరిగింది. దేశంలోని 16 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఇప్పటికే డిటెన్షన్ విధానం అమల్లో ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మాత్రం నో డిటెన్షన్ విధానం కొనసాగుతున్నది. కొన్ని రాష్ట్రాలు ఏ నిర్ణయమూ తీసుకోలేదు. 2009 నాటి విద్యాహక్కు చట్టం ప్రకారం 1-8వ తరగతి వరకు నో డిటెన్షన్ విధానం అమల్లో ఉంటుంది. దీని ప్రకారం పరీక్షల్లో ఉత్తీర్ణతతో సంబంధం లేకుండా పై తరగతులకు ప్రమోట్ చేస్తారు. నో డిటెన్షన్ విధానం వల్ల పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ గణనీయంగా పెరిగింది. డ్రాపౌట్ రేటు తగ్గి, ఉన్నత పాఠశాల స్థాయికి వచ్చే విద్యార్థినుల సంఖ్య పెరిగింది. పిల్లల్లో పరీక్షల పట్ల భయం పోయింది. కానీ, విద్యార్థులు వివిధ తరగతులకు తగ్గట్టుగా సామర్థ్యం సాధించడం లేదని నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్), అసెర్ నివేదికలు తేల్చిచెబుతున్నాయి. అంతేకాదు, విద్యార్థుల్లో అభ్యసన పట్ల శ్రద్ధ తగ్గిందని, ఫలితాలకు ప్రాధాన్యం లేకపోవడం వల్ల ఉపాధ్యాయులు బోధనపై దృష్టి సారించడం లేదని విమర్శకుల వాదన.నూతన విధానం ప్రకారం 5వ, 8వ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో కచ్చితంగా ఉత్తీర్ణులు కావాలి. ఉత్తీర్ణత సాధించనివారికి రెండు నెలల పాటు శిక్షణ ఇచ్చి మళ్లీ పరీక్ష నిర్వహిస్తారు. రెండవసారి కూడా ఉత్తీర్ణత సాధించకుంటే అదే తరగతిలో కొనసాగిస్తారు. కానీ, 8వ తరగతి పూర్తి చేయకుండా ఏ విద్యార్థినిని బడిలో నుంచి తొలగించకూడదని గెజిట్‌లో కేంద్రప్రభుత్వం పేర్కొన్నది. అయితే, డిటెన్షన్ విధానం తిరోగమన చర్య అని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులు ప్రాథమిక విద్యకూ దూరమయ్యే అవకాశం ఉన్నదని వారు విమర్శిస్తున్నారు. డిటెన్షన్ విధానం వల్ల పిల్లల్లో పరీక్షల పట్ల భయం పెరిగే అవకాశముంది. ఫెయిలైన విద్యార్థులు బడికి దూరమయ్యే ప్రమాదం లేకపోలేదు. మళ్లీ అదే తరగతి చదవాల్సిరావడం వారిలో నిరాసక్తతను పెంచుతుంది. తద్వారా బాలకార్మికులు పెరిగే ప్రమాదం ఉన్నది. ఈ చట్టం ప్రకారం 6 నుంచి 14 సంవత్సరాలు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అందించడం జరుగుతున్నది. విద్యను సార్వత్రికం చేయడంలో ఈ చట్టం విజయవంతమైందని చెప్పవచ్చు. నేడు మెజారిటీ విద్యార్థులకు విద్య అందుబాటులోకి వచ్చినప్పటికీ నాణ్యతా ప్రమాణాలు లోపిస్తున్నాయని అనేక అధ్యయనాలు పేర్కొంటున్నాయి.ఈ విషయాన్ని అసర్ సర్వే, నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలు ధ్రువీకరిస్తున్నాయి. ఈ క్రమంలో విద్యా నాణ్యతపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. ఇందులో భాగంగానే డిటెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. వాస్తవంగా మొదట్లో విద్యాహక్కు చట్టం సెక్షన్ 16 ప్రకారం నో- డిటెన్షన్ విధానం ఉండేది.ఈ సెక్షన్ రెండు కీలకమైన నిబంధనలను నిర్దేశిస్తుంది. మొదటిది, ప్రాథమిక విద్యను పొందుతున్న ఏ పిల్లవాడినీ పాఠశాలనుంచి బహిష్కరించకూడదు. రెండవది, ఏ తరగతిలోనూ పిల్లలను నిలుపుదల చేయకూడదు. అనగా 8వ తరగతి వరకు విద్యార్థులను నిర్బంధించకుండా పైతరగతులకు అనుమతించాలి. పిల్లలు ప్రతి తరగతిలో ఫెయిల్ అవుతానేమో అనే భయంలేకుండా కనీస అభ్యసనస్థాయి పొందేలా చేయడం, తద్వారా డ్రాపౌట్ రేటును తగ్గించడం సెక్షన్ 16 ప్రధాన ఉద్దేశం. సమ్మిళిత విద్యను ప్రోత్సహించడం, డ్రాపౌట్లను తగ్గించడం కోసం నో -డిటెన్షన్ విధానం ఒక సదుద్దేశంతో తీసుకురావడం జరిగింది. అయితే, దీని అమలు తీరు పలు విమర్శలను ఎదుర్కొంది. ఈ విధానం పిల్లల-స్నేహపూర్వక విద్యా వ్యవస్థను ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ విద్య నాణ్యత, జవాబుదారీతనంపై ప్రభావం చూపింది. ప్రాథమిక విద్యపై ఇటీవల కేంద్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 5, 8 తరగతులకు నో డిటెన్షన్ పాలసీని రద్దు చేసింది. ఈ రెండు తరగతులకు చెందిన విద్యార్థులపై తరగతులకు వెళ్లేందుకు తప్పనిసరిగా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు పాసైనా, ఫెయిలైనా హాజరు శాతంతో విద్యాహక్కు చట్టం ప్రకారం పైతరగతులకు పంపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం విద్యార్థి ఫెయిలైతే మళ్లీ పరీక్ష రాసేందుకు అవకాశం కల్పిస్తారు. పరీక్షల ఫలితాలు వెలువడే తేదీకి రెండు నెలల్లోపే మళ్లీ పరీక్షపెడతారు.ఒకవేళ అందులోనూ ఫెయిలైతే వారు 5, 8 తరగతులను మళ్లీ చదవాల్సి ఉంటుంది. ఫెయిలైన విద్యార్థుల జాబితాను ప్రధానోపాధ్యాయులు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే, ప్రాథమికోన్నత విద్య పూర్తయ్యేవరకు ఏ విద్యార్థినీ బహిష్కరించరాదని కేంద్రం స్పష్టం చేసింది.మరోవైపు కేంద్రం నిర్ణయించినట్లు 5, 8 తరగతుల్లో డిటెన్షన్ విధానం అమలు చేస్తే ప్రభుత్వ విద్యా సంస్థల్లో డ్రాపౌట్లు పెరుగుతాయని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రాథమిక విద్య రాష్ట్ర జాబితాలోని అంశమైనందున ఈ విషయంలో ఆయా రాష్ట్రాలు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని దాదాపు 3 వేల కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ, సైనిక పాఠశాలలకు ఇది వర్తిస్తుంది.ఇప్పటికే ఢిల్లీ సహా 16 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాలు నో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేశాయి. డిటెన్షన్ విధానం తెలంగాణలో అమలుపై సందిగ్ధత నెలకొంది. రాష్ట్రంలో ఇటీవల విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం విద్యా కమిషన్ నియమించినది. ఇది విద్యా వ్యవస్థలో నాణ్యత, మౌలిక సదుపాయాలపై అధ్యయనం చేస్తోంది. ప్రస్తుతం 9వ తరగతి వరకు నో డిటెన్షన్ విధానం అమలవుతోంది.పరీక్షల్లో పాసైనా.. కాకున్నా పై తరగతులకు పంపిస్తున్నారు. కేంద్రం నూతన విద్యా విధానం 2020 తీసుకురావడం జరిగింది. ప్రస్తుతం పలు రాష్ట్రాలు నూతన విద్యావిధానం అమలు దిశగా ముందుకుపోతున్నాయి. ఈ విధానంలో కూడా లోపాలు ఉన్నాయని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో పాఠశాల విద్యలో కీలక మార్పులు చేయాల్సిన అవసరమైతే ఉంది. విద్యా నాణ్యతను మరింత మెరుగుపరచడానికి నిరంతర సమగ్ర మూల్యాంకనం, నో డిటెన్షన్ విధానంపై విద్యాహక్కు చట్టంలో చేసిన సవరణలు సమీక్షించాలి. ప్రాథమిక స్థాయిలో నో డిటెన్షన్ విధానం రద్దువలన విద్యార్థుల్లో ఒత్తిడి పెరుగుతుంది. కావున, దీనిపై పునఃసమీక్షించి 8వ తరగతి నుంచి అమలుచేస్తే బాగుంటుంది

# భారతీయ అధ్యాత్మిక బోధకుడు ఓషో -నేడు ఆయన వర్ధంతి



రజనీష్ చంద్రమోహన్ జైన్ 1960లలో ఆచార్య రజనీష్‌గా, 1970-1980లలో భగవాన్ శ్రీ రజనీష్ గా ఆ తరువాత ఓషోగా పిలువబడిన ప్రఖ్యాత భారతీయ ఆధ్యాత్మిక బోధకుడు. ఇండియా, అమెరికా సంయుక్త రాష్ట్రాలతో సహా ఎన్నో దేశాలలో నివసించి ఓషో మూవ్‌మెంట్ అనే ఒక వివాదాస్పదమైన కొత్త ఆధ్యాత్మిక సంఘాన్ని తయారుచేశాడు. ఇతడు మధ్యప్రదేశ్‌లో గల నర్సింగ్‌పూర్ జిల్లాలో ఉన్న కుచ్‌వాడాలో 11డిసెంబర్1931న జన్మించాడు.19 జనవరి 1990 న మరణించాడు.

ఓషో బోధన :

జీవితానికి సంబంధించిన గొప్ప విలువలు ఎఱుక, ప్రేమ, ధ్యానం, సంతోషం, ప్రజ్ఞ, ఆనందం అని అతను బోధించాడు. జ్ఞానోదయం (ఎన్‌లైటెన్‌మెంట్) అన్నది ప్రతి ఒక్కరి సహజ స్థితి, కానీ అది తెలుసుకోలేకపోతున్నారు - మనిషి ఆలోచనా విధానం ముఖ్య కారణం కాగా, సామాజిక పరిస్థితులు, భయం వంటివి మరి కొన్ని కారణాలు అని అతను అన్నాడు.

హిందీ, ఆంగ్లభాషలలో అతను అనర్గళంగా ప్రవచించాడు. బుద్ధుడు, కృష్ణుడు, గురు నానక్, ఏసుక్రీస్తు, సోక్రటీసు, జెన్ గురువులు, గురుజెఫ్, యోగ సంప్రదాయాలు, సూఫీ, హస్సిడిజమ్, తంత్ర వంటి బోధనలు, ఆధ్యాత్మిక సంప్రదాయాలు ఎన్నింటిలోనో అతను ఆరితేరిన దిట్ట. ఏ తత్వమూ సత్యాన్ని పూర్తిగా గ్రహించలేదు అనే నమ్మకాన్ని కలిగి, ఏ "ఆలోచనా పద్ధతి"లో కూడా తనను ఎవరూ నిర్వచించలేరని అతను ప్రకటించాడు.

అరవైలలో తరుచుగా శృంగారానికి సంబంధించిన ప్రవచనాలను వెలువరించినందుకు అతను?ని "సెక్స్ గురువు" అని పిలిచేవారు. ఆ ప్రవచనాలన్నింటిని సెక్స్ టు సూపర్ కన్స్యూషనెస్స్ అనే ఆంగ్ల పుస్తకంగా ప్రచురించారు, ఈ పుస్తకం సంబోగం నుండి సమాధి వరకు అనే పేరుతో తెలుగులో అనువదించబడింది. అతను చెప్పినది, "తంత్ర పద్ధతిలో అనైతికం అనేది లేదు, అంతా నైతికమే" సెక్స్‌ను నైతికంగా అణగద్రొక్కడం లాభ రహితం, సంపూర్ణంగా చైతన్యసహితంగా అనుభవించనప్పుడు దాన్ని దాటి ముందుకు వెళ్ళలేరు అని.

"ప్రేమ ఓ ప్రదేశం. స్వేచ్ఛగా మనస్ఫూర్తిగా అనుభవించు. జీవితంలో ఏ రహస్యం ఉండదు. దాచిపెట్టడమే ఉంటుంది. సెక్స్ వల్లనే మనం పుడతాము. అన్ కాన్షస్ నుండి సెక్స్ సూపర్ కాన్షస్ కు తీసుకు వెళుతుంది. సెక్స్ తోనే ముక్తి.జీవితం పక్షి.ప్రేమ,స్వేచ్ఛ రెండు రెక్కలు.అందరూ మనల్ని వదిలివేయటం ఒంటరితనం.అందర్నీ మనం వదిలి వేయటం ఏకాంతం"

# రిపబ్లిక్ పరేడ్ కి ఇండోనేషియా అధ్యక్షుడు...

న్యూఢిల్లీ, జనవరి 18, (న్యూస్ పల్స్) ఈ సంవత్సరం గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో హాజరుకానున్నారు. సుబియాంటో జనవరి 25, 26 తేదీలలో భారతదేశంలో ఉంటారు. గత సంవత్సరం గణతంత్ర దినోత్సవంసందర్భంగా ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, 2023లో ఈజిప్టు అధ్యక్షుడు అబ్దేల్ ఫట్టా అల్-సిసి భారతదేశాన్ని సందర్శించారు. భారతదేశంలో జనవరి 26 సందర్భంగా ముఖ్య అతిథిని ఆహ్వానించే సంప్రదాయం 1950 నుండి ప్రారంభమైంది. ఈ సంవత్సరం ఇండోనేషియా అధ్యక్షుడు సుబియాంటో భారత పర్యటన అనేక విధాలుగా ప్రత్యేకమైనదిగా పరిగణించబడుతుంది. అటువంటి పరిస్థితిలో.. భారతదేశం ముఖ్య అతిథిని ఎలా ఎంచుకుంటుంది.. సుబియాంటో భారత పర్యటనను ఎందుకు ప్రత్యేకంగా పరిగణిస్తారు అనేది ప్రతి ఒక్కరి మదిలో మెదిలే ప్రశ్న. గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిని ఎంపిక చేయడం భారత ప్రభుత్వానికి ఎంతో ప్రాముఖ్యమైన అంశం. ఇది ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో.. అంతర్జాతీయ సంబంధాల్లో కీలక పాత్ర పోషించడంలో సహాయపడుతుంది. ఈ ప్రక్రియలో ప్రధానంగా పలు అంశాలను పరిశీలిస్తారు.

× ద్వైపాక్షిక సంబంధాలు: ఒక దేశంతో భారతదేశానికి ఉన్న రాజకీయ, ఆర్థిక, వాణిజ్య, రక్షణ, సాంస్కృతిక సంబంధాలను పరిగణనలోకి తీసుకుంటారు.

ఉదాహరణకు.. ఆ దేశంతో వ్యూహాత్మక భాగస్వామ్యం ఉండడం లేదా రెండు దేశాల మధ్య సాంప్రదాయ బంధం ఉండటం.

× గ్లోబల్ స్థితి: అతిథి దేశం ప్రపంచ రాజకీయాల్లోలేదా ఆర్థిక వ్యవస్థలో ప్రాముఖ్యమైన దేశమై ఉంటే ఆ దేశ నాయకుడిని ఆహ్వానించడం ద్వారా భారతదేశం తమ వ్యూహాత్మక ఆవశ్యకతలను ముందుకు తీసుకెళ్తుంది.

× ప్రధానమంత్రి, రాష్ట్రపతి చర్చలు: ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రి, రాష్ట్రపతి చర్చించిన తర్వాత అతిథి ఎంపిక జరుగుతుంది. ఇది మంత్రివర్గంలోని ఇతర సభ్యులతో కూడిన చర్చల అనంతరం నిర్ధారించబడుతుంది.

× అంతర్జాతీయ సంబంధాల ప్రభావం: గణతంత్ర దినోత్సవ వేడుకల నిమిత్తం ముఖ్య అతిథిని ఆహ్వానించడం ద్వారా సంబంధిత దేశంతో భారత్ వ్యూహాత్మక సంబంధాలను మెరుగుపరచడానికి ప్రయత్నిస్తుంది. ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా, లేదా దక్షిణ అమెరికా వంటి ప్రాంతాలలో భారత్ దృష్టి పెట్టిన దేశాలను ఎంపిక చేస్తుంది.

విదేశీ అతిథులకు అత్యున్నత గౌరవం

భారతదేశానికి ముఖ్య అతిథిగా ఒక విదేశీ నాయకుడిని చేయడం అత్యున్నత గౌరవం. ఆయన అన్ని గణతంత్ర దినోత్సవ వేడుకలలో ఉంటారు. ఆయనకు 21 తుపాకీలతో సెల్యూట్ ఇవ్వబడుతుంది. ఆయనకు రాష్ట్రపతి భవన్‌లో గౌరవ వందనం సమర్పించారు. సాయంత్రం భారత రాష్ట్రపతి ఆయన గౌరవార్థం ప్రత్యేక స్వాగతం పలుకుతారు. ఆయన రాజ్ ఘాట్ ను సందర్శించి జాతిపిత మహాత్మా గాంధీకి నివాళు లర్పించారు. ప్రధానమంత్రి ఆయన గౌరవార్థం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తారు. అందులో ఉపరాష్ట్రపతి, విదేశాంగ మంత్రితో సహా అనేక మంది ప్రముఖులు ఆయనను కలుస్తారు. ఈ కారణంగానే ముఖ్య అతిథికి ఇచ్చే గౌరవం అనేక విధాలుగా చాలా ప్రత్యేకమైనది. ఏ ప్రపంచ నాయకుడికీ దీన్ని ఇలా సాధించే అవకాశం రాదు. సుదీర్ఘ ప్రక్రియ తర్వాత ముఖ్య అతిథి పేరు నిర్ణయించబడుతుంది. ఇండోనేషియా అధ్యక్షుడు ఎందుకంటే .. ఇండోనేషియా దక్షిణ ఆసియాలో ఉన్న ప్రముఖ దేశం, భారతదేశానికి ప్రధాన వ్యాపార భాగస్వామి. రెండు దేశాల మధ్య సాంస్కృతిక, వ్యాపార సంబంధాలు 2,000 ఏళ్లకు పైగా కొనసాగుతున్నాయి. ఇండోనేషియా సముద్ర మార్గాలలో అత్యంత వ్యూహాత్మకమైన స్థానం కలిగి ఉంది. రెండూ దేశాలు ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భద్రత, వాణిజ్యం, వ్యూహాత్మక కూటములను బలోపేతం చేసుకునే దిశగా ఉన్నందున, ఈ ఆహ్వానం వ్యూహాత్మకంగా కూడా ఎంతో ప్రాముఖ్యమైనది. గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిని ఆహ్వానించడం కేవలం సాంప్రదాయ ప్రక్రియ మాత్రమే కాదు, దేశాల మధ్య ఉన్న సంబంధాలను బలోపేతం చేసేందుకు కీలక ఉదాహరణ కూడా.

# బడ్జెట్ కు వేళాయెరా...

న్యూఢిల్లీ, జనవరి 18, (న్యూస్ పల్స్) కేంద్రం 2025?26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్ ను పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు సన్నద్ధమవుతోంది. గతేడాది పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో రెండుసార్లు మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఈసారి పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టనుంది. బడ్జెట్ అనేది ఒక వ్యయం, ఆదాయం, ఖర్చులను నియంత్రించడానికి లేదా నిర్వహించడానికి రూపొందించిన ఆర్థిక ప్రణాళిక. ఇది వ్యక్తిగత, కుటుంబ, కంపెనీ లేదా ప్రభుత్వ స్థాయిలో కూడా ఉండవచ్చు. బడ్జెట్ ద్వారా మనం నిర్దిష్టమైన కాలపరిమితిలో ఏ విధంగా డబ్బు గడించాలో, ఖర్చు చేయాలో, పొదుపు చేయాలో నిర్ణయిస్తాం. దేశ ఆదాయ వ్యయాలు, పెట్టుబడులు, పొదుపు తదితర అంశాలకు సంబంధించి కేంద్రం ఏటా బడ్జెట్ ప్రవేశపెడుతుంది. పార్లమెంట్ ఆమోదం మేరకు ధరల పెంపు, తగ్గుదల, పన్నుల విధింపు, ఉపశమనం వంటి అంశాలను ఇందులో పొందుపరుస్తుంది. 2025?26 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను పార్లమెంటు)లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. గతంలో మార్చిలో బడ్జెట్ ప్రవేశపెట్టేవారు. మోదీ ప్రధాని అయిన నాటి నుంచి ఫిబ్రవరి 1న బడ్జెట్ పెడుతున్నారు. ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తోంది. 2025?26 వార్షిక బడ్జెట్‌కు సంబంధించిన పార్లమెంటు సమావేశాలను నిర్వహించే తేదీలను కేంద్రం ఖరారు చేసింది. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు తొలి విడత సమావేశాలు నిర్వహిస్తారు. మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు రెండో విడత సమావేశాలు జరుగుతాయి. జనవరి 31న రాష్ట్రపతి ప్రసంగంతో సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 2025?26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్‌పార్లమెంట్‌లో ప్రవేశపెడతారు. ఇక ఈ బడ్జెట్ సమావేశాల్లో ఢిల్లీకి సంబంధించిన ఊసు ఉండదు. ఫిబ్రవరి 5న అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ఢిల్లీ కేంద్రంగా ఎలాంటి ప్రకటనలు చేయకూడదని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పేరు కూడా ఎత్తే అవకాశం లేదు. ఇక ఈ ఏడాది చివరలో బిహార్ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ బడ్జెట్‌తో బిహార్‌కు వరాలు ఉంటాయని బీజేపీ మిత్ర పక్షాలు జేడీయూ, లోక్ జనశక్తి(రామ్ విలాస్) పార్టీలు ఆశిస్తున్నాయి. ఇక బడ్జెట్‌పై ఆశలు పెట్టుకున్న వేతన జీవులకు ఈసారి శుభవార్త ఉంటుందన్న వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇన్‌కమ్‌ట్యాక్స్‌పరిమితి పరిధిని కూడా కేంద్రం పెంచుతుందన్న కథనాలు వస్తున్నాయి. ప్రస్తుతం రూ. 7 లక్షలుగా ఉన్న ఆదాయ పరిమితిని రూ. 9 లక్షలకు పెంచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# రెడీ అవుతున్న ఇస్రో బాహుబలి

బెంగళూరు, జనవరి 18, (న్యూస్ పల్స్) భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తక్కువ కాలంలో అత్యంత క్లిష్టమైన కీలకమైన ప్రయోగాలను సక్సెస్ చేసి అగ్రదేశాల సరసన నిలబడగలిగింది. ఒకప్పుడు స్పేస్ లో అద్భుతాలు చేయడం అంటే రెండు మూడు దేశాలకు మాత్రమే పరిమితం. అమెరికా, రష్యా, చైనా లాంటి దేశాలకు మాత్రమే సాధ్యమైన అనేక ప్రయోగాలను ఇప్పుడు ఇస్రో చేసి చూపిస్తోంది. నాలుగు దశాబ్దాల క్రితం అంతరిక్ష ప్రయోగాలు చేపట్టేందుకు శ్రీకారం చుట్టిన భారత్‌ను చూసి చాలా దేశాలు అవహేళన చేశాయి. అలాంటి దేశాలకు ఏమాత్రం తీసిపోని విధంగా కీలకమైన ప్రయోగాలను సొంతంగా భారత్ సక్సెస్ చేసి ప్రపంచానికి చాటింది. మ్యాన్ మిషన్ కు సిద్ధమైన ఇస్రో అందుకోసం సొంతంగా భారీ లంచ్ ప్యాడ్ ను సిద్ధం చేస్తోంది. బాహుబలి లాంచ్ ప్యాడ్‌ను ఇస్రో కొత్తగా నిర్మిస్తుంది. ఈ లంచ్ ప్యాడ్ గురించి ఇటీవల పలు ఆసక్తికర వివరాలను వెల్లడించింది. కేంద్రం ఇందుకోసం ఇప్పటికే నిధులను విడుదల చేస్తున్నట్టు ప్రకటించింది. రూ. 3,985 కోట్లను మూడో లాంచ్ ప్యాడ్ కోసం ఆమోదం తెలిపింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోటలో ఇప్పటికే రెండు లాంచ్ ప్యాడ్లు అందుబాటులో ఉన్నాయి. మొదటి లాంచ్ ప్యాడ్ 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేయగా రెండో లాంచ్ ప్యాడ్ 20 ఏళ్ల క్రితం నిర్మించింది ఇస్రో. అయితే భారత్ భవిష్యత్తులో చేపట్టనున్న కీలక ప్రయోగాలకు ఇప్పుడు ఉన్న లాంచ్ ప్యాడ్‌లకు మించిన కెపాసిటీతో కూడిన లాంచ్ ప్యాడ్ అవసరం ఉంది. ప్రస్తుతం ఇస్రో ప్రయోగిస్తున్న రాకెట్ల ద్వారా రెండు నుంచి నాలుగు టన్నుల బరువున్న ఉపగ్రహాలను మాత్రమే నింగిలోకి పంపగలిగే సామర్థ్యం ఉంది. ఇస్రో త్వరలో చేపట్టనున్న మ్యాన్ మిషన్ గగన్యాన్ ప్రాజెక్టు కోసం భారీ రాకెట్ ద్వారా వ్యోమ నౌకలను అంతరిక్షంలోకి పంపాల్సి ఉంటుంది. అందుకోసం అత్యంత బరువైన మాడ్యూల్ ను అంతరిక్షంలోకి పంపాల్సి ఉంటుంది. అలాగే 235 కి భారత్ అంతరిక్షంలో సొంతంగా స్పేస్ స్టేషన్ ఏర్పాటు కూడా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2040లో చంద్రుడిపై భారత్ చెందిన వ్యోమగాములు అడుగు పెట్టాలని లక్ష్యంగా ఉంది. అలాంటప్పుడు రాకెట్ బరువు కాకుండా రాకెట్ ద్వారా తీసుకెళ్లే మాడ్యూల్ దాదాపు 70 నుంచి 75 టన్నుల బరువు ఉన్న పేలోడ్ని సైతం అంతరిక్షంలోకి పంపే సామర్థ్యం గల రాకెట్లను తయారు చేయాల్సి ఉంటుంది. ఇలాంటి న్యూ జనరేషన్ లాంచ్ వెహికల్ ఇస్రో రూపొందించాలన్నీ, ఇతర రాకెట్లను ప్రయోగించాలన్నా భారీగా లాంచ్ ప్యాడ్ సామర్థ్యం కూడా పెంచాల్సి ఉంటుంది. అలాగే అంతరిక్షంలోకి వెళ్లి తిరిగి భూమి మీదకు వచ్చే స్పేస్ షటిల్ ల్యాండ్ అయ్యేందుకు ఒక రన్ వే కూడా అవసరం. ఆ రన్ వే కూడా నిర్మించేందుకు ఇస్రో ప్లాన్ చేసుకుంటుంది. తాజాగా నిర్మించనున్న మూడో లాంచ్ ప్యాడ్ అందుబాటులోకి వస్తే తక్కువ సమయంలో ఎక్కువ ప్రయోగాలు చేసేందుకు అవకాశం ఉంటుంది. ఒక్కో రాకెట్ తయారీ పూర్తయిన తర్వాత లాంచ్ ప్యాడ్ తీసుకువెళ్లి ప్రయోగం పూర్తి చేసేందుకు వారం నుంచి పది రోజులు సమయం పడుతుంది. ప్రస్తుతం రెండు లాంచ్ ప్యాడ్లు మాత్రమే ఉండగా మూడో లాంచ్ ప్యాడ్ అందుబాటులోకి వస్తే ప్రయోగాల సంఖ్య మరింత పెంచే అవకాశం ఉంటుంది. ఇస్రో ఇప్పటివరకు రూపొందించిన పీఎస్ఎల్వీ , జీఎస్ఎల్వి, మార్క్ 3 తరహా వాహక నౌకలు ఉండగా ఇటీవల ఎస్-ఎస్ఎల్వి పేరుతో చిన్న తరహా రాకెట్లను రూపొందించి ప్రయోగం చేసింది. ఈ తరహా రాకెట్ల ప్రయోగం కోసం ప్రత్యేకంగా తమిళనాడులోని కులశేఖర పట్టణంలో లాంచ్ ప్యాడ్ ను ఏర్పాటు చేస్తోంది. అంటే ఇస్రో చేపట్టే రాకెట్ ప్రయోగాల కోసం మొత్తం నాలుగు లాంచ్ ప్యాడ్లు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం ఏడాదికి 10 నుంచి 15 వరకు మాత్రమే ఉన్న ఇస్రో చేపట్టే ప్రయోగాల భవిష్యత్తులో 100కు మించి ఉండేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి

# బాక్స్ డ్రైన్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే, మేయర్

హైదరాబాద్ ఖైరతాబాద్ సర్కిల్ వేంకటేశ్వర నగర్ సర్కిల్ లో బి ఆర్ యస్ భవన్ నుండి బంజారా లేక్ వరకు ప్రతిపాదిత బాక్స్ డ్రైన్ పనులను ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ మన్నె కవిత రెడ్డి తో కలిసి మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, యస్ ఈ రత్నాకర్, ఈ ఈ విజయ కుమార్, డి సీ రజనీ కాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

# బెదిరింపు కాల్స్ వస్తున్నాయి లక్ష్మీ పార్వతి



**హైదరాబాద్.. ప్రజాబలం ప్రతినిధి:** ఎన్టీఆర్ ఘాట్ వద్ద లక్ష్మి పార్వతి హాట్ కామెంట్స్ చేసారు. 29 ఏళు గా ఎన్టీఆర్ దూరమై మనో వేదనకు గురవుతున్నాను. లక్షలాది ప్రజలు చూస్తుండగా నన్ను వివాహం చేసుకున్న విషయం మీకు తెలుసు. నన్ను ఎందుకు ఈ కుటుంబ సభ్యురాలుగా చూడడం లేదు. ఎన్టీఆర్ రాజకీయంగా అధికారంలోకి రావడంలో నా వంతు కృషి చేశాను. ఒక్క రూపాయి ఆశించకుండా చివరి వరకు ఆయనకు సేవలు చేశాను. నిన్న నా ఫోన్ నంబర్ ఎవరో టీడీపీ వాళ్లు సోషల్ మీడియా లో పెట్టారు. నిన్నటి నుండి వెయ్యికి పైగా బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. మీరు అనుకున్నా అనుకోకున్నా నేను మీ అత్తగారిని కదా చంద్ర బాబు.. ఇలాంటి అవమానం నాకు జరుగుతుంటే ఇలానే చూస్తూ ఉంటారా చంద్రబాబు. ఇన్నేళ్ళు డబ్బు ఉన్నా లేకున్నా ఎవరినీ చేయి చాచి అడగలేదు. ఎన్టీఆర్ గౌరవం కాపాడేలా బ్రతుకుతున్నాను. నామీద ఎందుకు మీకు కక్ష.. అసలు నేనేమీ తప్పు చేశానో కూడా నాకు అర్థం కావడం లేదు. ఎన్టీఆర్ పేరుతో మీరంతా లక్షలు కోట్లు సంపాదించారు. అలాగే పెద్దయన్ని సాగనంపారు. నాపై జరుగుతున్న వేధింపులపై స్పందించాల్సిన బాధ్యత మీకు లేదా చంద్రబాబు అని ప్రశ్నించారు.

# క్యాబినెట్ లో ముగ్గురికి ఉద్వాసన..?

**హైదరాబాద్‌ప్రజాబలం ప్రతినిధి:** జనవరి 18, రేవంత్ కేబినెట్‌లో ముగ్గురికి ఉద్వాసన.. అధిష్టానం గ్రీన్ సిగ్నల్? తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చింది. రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటింది. ఏడాదిపాటు పూర్తి క్యాబినెట్ లేకుండానే పాలన సాగించారు. రాష్ట్రానికి హోం మంత్రి, విద్యా శాఖ మంత్రితోపాటు పలు కీలక శాఖలకు మంత్రి లేకుండానే పాలన సాగిస్తున్నారు. ఇంకా ఆరు పదవులు ఖాళీగా ఉన్నాయి. మంత్రివర్గ విస్తరణ రేపు మాపు అంటూ కాలయాపనే జరుగుతోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు ఏడాది పూర్తయింది. కీలక శాఖలకు మంత్రులులేకుండానే పాలన సాగింది. 18 మంత్రి పదవులకు గాను, ప్రస్తుతం 12 పదవులే భర్తీ అయ్యాయి. మరో ఆరు శాఖలు ఖాళీగా ఉన్నాయి. కీలకమైన హోం విద్యశాఖలు సీఎం వద్దే ఉన్నాయి. ఇలాంటి తరుణంలో కేబినెట్ విస్తరణ కోసం సీఎం, డిప్యూటీ సీఎం పలుమార్లు అధిష్టానం అనుమతి కోరారు. అయితే రేపు, మాపు అంటూ వాయిదా వేసుకుంటూనే వచ్చాయి. ఇక ఏడాది పాలనపై సీఎం రేవంత్‌రెడ్డిఇటీవల సర్వే చేయించారు. ఈ సర్వేలో 10 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు మంత్రులపై వ్యతిరేకత వ్యక్తమైనట్లు గుర్తించారు. ఏఐసీసీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవానికి ఢిల్లీ వెళ్లిన సీఎం ఈ నివేదికను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నివేదిక ఆధారంగా రాష్ట్ర క్యాబినెట్‌లో ముగ్గురు మంత్రులకు ఉద్వాసన పలికేందుకు అధిష్టానం రేంత్‌రెడ్డికి అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. ఏడాది పాలనలో రేవంత్ సర్కార్‌పై ఎక్కువగా విమర్శలు, వివాదాలు రావడానికి ఆ ముగ్గురు మంత్రులే కారణమని తెలుస్తోంది. ఆ ముగ్గురి పనితీరు కారణంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తున్నట్లు సీఎం రేంవంత్‌రెడ్డి కూడా అసంతృప్తితో ఉన్నారు. అందుకే త్వరలో చేపట్టబోయే కేబినెట్ విస్తరణలో ముగ్గురిని తప్పించేందుకు అనుమతి ఇవ్వాలని అధిష్టానాన్ని కోరినట్లు తెలిసింది. ఇక కేబినెట్ నుంచి తప్పించాలనుకుంటున్న ముగ్గురు మంత్రులకు ఇప్పటి వరకు తమ శాఖలపై పట్టు సాధించలేదని తెలుస్తోంది. ఇతర విషయాల్లో జోక్యం చేసుకుంటూ అనసవర వివాదాలకు కారణం అవుతున్నారట. అధిష్టానం గ్రీన్ సిగ్నల్ రావడంతో వారిని తప్పించడం ఖాయమైందని తెలుస్తోంది. వేటు పడే మంత్రుల్లో కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్‌రావు ఉన్నట్లు తెలిసింది. అయితే ఈ ముగ్గురిని తొలగించడం వలన పార్టీకి ఏమైనా ఇబ్బందులు వస్తాయా.. కేడర్ ఏమైనా వ్యతిరేకించే అవకాశం ఉందా అనే విషయాలపై ఇప్పటికే సీఎం రేవంత్ సర్వే నిర్వహించినట్లు తెలిసింది. పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నవారిని తొలగించడమే మంచిది అన్న అభిప్రాయం కేడర్‌లోనూ వ్యక్తమైనట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వంలో అత్యంత వివాదాస్పద మంత్రిగా కొండా సురేఖపేరు తెచ్చుకున్నారు. మొదటి నుంచి ఆమె వ్యవహారశైలి దురుసుగానే ఉంది. ఇక విపక్ష నేతలపై ఆమె చేస్తున్న విమర్శలు, సినీ నటుడు నాగార్జున కుటుంబంపై చేసిన విమర్శలు, కేటీఆర్‌పై చేసిన విమర్శలు తీవ్ర దుమారం రేపాయి. ప్రజల్లో కూడా ఆమెపై తీవ్ర త్యతిరేకత ఉందని తెలిసింది. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో కూడా కొండా సురేఖ అతిజోక్యం కారణంగా ఎమ్మెల్యేలు, నాయకులు ఇబ్బంది పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. వరంగల్ జిల్లాలో పార్టీలో వర్గపోరు మొదలైంది. మెదక్ జిల్లా ఇన్‌చార్జిగా కూడా వివాదాలకు కారణమవుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు పెద్దగా కృషి చేయలేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆమెను తప్పించాలన్న నిర్ణయానికి సీఎం రేవంత్‌రెడ్డి వచ్చారట. ఇక అసెంబ్లీ ఎన్నికలకు ముందు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరిన మరో సీనియర్ నేత జూపల్లి కృష్ణారావు సీనియర్ ఎమ్మెల్యే హోదాలో ఆయనకు మంత్రిపదవి దక్కింది. కానీ, ఆయన ఆశించిన మేరకు పని చేయడం లేదన్న టాక్ వినిపిస్తోంది. ఏడాదిగా తన శాఖపై పట్టు సాధించలేకపోయార్న విమర్శలు ఉన్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎమ్మెల్యేలతో కూడా జూపల్లి సమన్వయం చేసుకోలేకపోతున్నారట. ఆయన వైఖరిపై జిల్లా నాయకులు అసంతృప్తితో ఉన్నారని సమాచారం. ఇటీవల యూబీ గ్రూప్ తెలంగాణ నుంచి కింగ్ ఫిషర్ బీర్లను ఉపసంహరించుకున్న వ్యవహారాన్ని సరిగా డీల్ చేయలేదని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారట. ఇక ఖమ్మం జిల్లా నుంచి సీనియర్ నేత హోదాలో మంత్రి పదవి దక్కించుకున్న మరో నేత తుమ్మల నాగేశ్వర్‌రావు ఆయనకు గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం చాలా ఉంది. కానీ, ప్రస్తుతం తన శాఖపై పట్టు సాధించలేదన్న విమర్శలు ఉన్నాయి. తరచూ వివాదాలకు కారణమవుతున్నారు. జిల్లాలో పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి పనిచేయడం లేదు. ఖమ్మం జిల్లా నుంచి భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావుకు మంత్రి పదవులు దక్కాయి. ఒకే జిల్లా నుంచి ముగ్గురికి పదవులు రావడం కూడా ఆయనను తప్పించడానికి కారణంగా తెలుస్తోంది.

# హ్యాట్సాఫ్ హైదరాబాద్ మెట్రో...



**హైదరాబాద్‌ప్రజాబలం ప్రతినిధి:** జనవరి 18, హైదరాబాద్ నగరంలో ట్రాఫిర్ రద్దీ ఎలా ఉంటుందో అందరికీ తెలిసిందే. కొన్ని ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద గంటలకొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితి. అత్యవసర సమయాల్లో నగరంలోని ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి చేరుకోవటం చాలా కష్టమైన పని. అంబులెన్స్ వంటి ఎమర్జెన్సీ వాహనాలు సైతం వేగంగా వెళ్లలేని పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో హైదరాబాద్ మెట్రో ఓ వ్యక్తికి ప్రాణం పోసింది. గ్రీన్ ఛానెల్ ద్వారా మెట్రోలో గుండెను తరలించటంతో వ్యక్తి ప్రాణం నిలిచింది. ఎల్బీనగర్ నుంచి లక్డీకపూల్ వరకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసి సకాలంలో గుండె మార్పిడి చేయటంతో వ్యక్తికి పునర్జన్మను ప్రసాదించినట్లయింది. వివరాల్లోకి వెళితే.. జనవరి 17న రాత్రి 8-9 గంటల సమయంలో ఓః నగర్‌లోని కామినేని హాస్పిటల్‌లో ఓ వ్యక్తి బ్రెయిన్ డెడ్ కావటంతో అతడి అవయవదానానికి కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. లక్డీకపుల్‌లోని గ్లెనీగల్స్ గ్లోబల్ హాస్పిటల్‌లో ఓ వ్యక్తి హృదయ సంబంధిత సమస్యలతో బాధపడుతుండటంతో అతడికి దాత గుండెను అమర్చాలని డాక్టర్లు భావించారు. అయితే ఎల్బీనగర్ నుంచి గ్లెనీగల్స్ ఆసుపత్రికి గుండెను తరలించటం సవాల్‌గా మారింది. ఈ దారిలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. సకాలంలో గుండెను తరలించకపోతే ఉపయోగం ఉండదు. దీంతో హాస్పిటల్ సిబ్బంది ఎల్బీనగర్ మెట్రోను ఆశ్రయించారు. వ్యక్తి ప్రాణం కాపాడేందుకు సహకరించాలని కోరారు. దీంతో వేగంగా స్పందించిన మెట్రో అధికారులు.. రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఎల్బీనగర్ నుంచి లక్డీకపూల్ వరకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేశారు. మె?త్తం ఎల్బీనగర్ నుంచి 13 స్టేషన్లు.. 13 కిలోమీటర్లు.. 13 నిమిషాల్లో లక్డీకపూల్ హాస్పిటల్‌కు గుండెను చేర్చారు. వ్యక్తి ప్రాణాలను రక్షించే క్రమంలో క్లిష్టమైన సమయాన్ని ఆదా చేశారు. ఈ మేరకు హైదరాబాద్ మెట్రో అధికారులు ప్రకటన విడుదల చేశారు. అత్యవసర సేవలకు మద్దతు ఇవ్వడానికి ఒడు మెట్రో రైల్ (హైదరాబాద్) లిమిటెడ్ కట్టుబడి ఉందని తెలిపారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను ఉపయోగించుకోవడం ద్వారా హైదరాబాద్ మెట్రో సమాజ సంక్షేమానికి దోహదపడుతుందన్నారు. హైదరాబాద్ మెట్రో ప్రతినిత్యం లక్షల మందిని గమ్యస్థానాలకు చేరుస్తోంది. ట్రాఫిక్ రద్దీ లేకుండా నగరం ఓ మూల నుంచి మరో మూలకు చేరుకునేందుకు చాలా మంది మెట్రోను ఆశ్రయిస్తుంటారు. ప్రతి నిత్యం ఎల్బీనగర్-మియాపూర్, ఎంజీబీఎస్-జేబీఎస్, నాగోల్-రాయదుర్గం మూడు కారిడార్లలో దాదాపు 5 లక్షల మంది ప్రయాణాలు సాగిస్తున్నారు. మెట్రోకు ఉన్న ఆదరణ దృష్ట్యా ఫేజ్-లో మరిన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు రేవంత్ సర్కార్ సిద్ధమైంది.

# హైదరాబాద్ లో బీదర్ గ్యాంగ్...

**హైదరాబాద్‌ప్రజాబలం ప్రతినిధి: జనవరి 18,** హైదరాబాద్ నడిబొడ్డున పోలీసులపై కాల్పులు జరిపి తప్పించుకున్న బీదర్ గ్యాంగ్ కోసం వేట కొనసాగుతోంది. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపడుతున్నారు. కాల్పులు జరిపిన నిందితులు బోర్డర్ దాటిపోకుండా కట్టడి చర్యలు చేపట్టారు. ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని చెక్ చేస్తున్నారు.బీదర్ పోలీసులపై బీదర్‌కు చెందిన నిందితులు కాల్పులు జరిపారు. బస్‌లో కాల్పులు జరపడంతో సంచలనంగా మారింది. ఇది వేరే రాష్ట్రానికి చందిన వారు అయినప్పటికి హైదరాబాద్‌లో జరగడంతో తెలంగాణ పోలీసులకు ఈ కేసు ప్రతిష్టాత్మకంగా మారిపోయింది. అందుకే బీదర్ పోలీసుల నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్న పోలీసులు వారి ఇచ్చిన క్లూస్ ఆధారంగా విచారణ చేపట్టారు. కర్ణాటకలోని బీదర్‌లో ఏటీఎం వాహనంపై కొందరు దుండగులు అటాక్ చేసి నగదు మాయం చేశారు. 93 లక్షలతో ఉడాయించారు. వాళ్ల ఫోన్‌లు ట్రాప్ చేసిన పోలీసులు వారంతా హైదరాబాద్‌లో ఉన్నట్టు గుర్తించారు. అందుకే వారిని పట్టుకునేందుకు బీదర్ పోలీసులు హైదరాబాద్ వచ్చారు. అఫ్జల్ గంజ్‌లోని ఓ ట్రైవెల్స్ ఆఫీస్ వద్ద పోలీసులను చూసిన దుండగులు కాల్పులు జరిపాడు. బీదర్‌లోని శివాజీ చౌక్ మధ్యాహ్నం దోపిడీ జరిగింది. ఓ ఏటిఎంలో నగదు నింపేందుకు డబ్బులు తీసుకొస్తున్న సిబ్బందిపై ఇదే ముఠా కాల్పులు జరిపి డబ్బులు ఎత్తుకెళ్లింది. అక్కడ ఓ బైక్‌పై పారిపోయారు. ఈ కాల్పుల్లో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. మరో వ్యక్తి కూడా తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. అలా బీదర్‌లో చోరీకి పాల్పడిన దుండగులు బైక్‌పై హైదరాబాద్ వచ్చారు. వారి కదలికలను సీసీ టీవీ ఫుటేజ్ ద్వారా తెలుసుకున్న పోలీసులు వారంతా హైదరాబాద్‌లో ఉన్నట్టు తేల్చారు. తీరా వాళ్లు వచ్చి గాలింపు చర్యలు చేపడుతుంటే వారిపైనే కాల్పులు జరిపి రెండు రాష్ట్రాల పోలీసులకకు మోస్ట్ వాటెండ్‌గా మారిపోయారు. ఇదే విషయాన్ని బీదర్ పోలీసుల నుంచి స్టేట్మెంట్ తీసుకున్న హైదరాబాద్ పోలీసులు అణువణువూ గాలిస్తున్నారు. ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి మాట్లాడుతూ నిందితుల కోసం ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతోపాటు నాలుగు బృందాలు ఫామ్ చేసినట్టు వెల్లడించారు. అనుమానం వచ్చిన ప్రతి వాహనాన్ని గాలిస్తున్నామని అన్నారు.ఆయుధాలు అక్రమంగా అమ్మే వ్యక్తిని పట్టుకొని 24 గంటలు గడవక ముందే ఇలా కాల్పులు జరగడం పోలీసులు హై అలర్ట్ అయ్యారు. బుధవారం నేరేడ్‌మెట్ రాచకొండ కమిషనరేట్ పోలీసులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన హరేకృష్ణ యాదవ్ అనే పాతికేళ్ల కుర్రాడిని అరెస్టు చేశారు. రాంపూర్ బోహలో ఉండే ఈ వ్యక్తి ఆరేళ్ల క్రితం హైదరాబాద్ వచ్చాడు. ఇక్కడ సంపాదన ఖర్చులకు సరిపోవడం లేదని మళ్లీ ఊరెళ్లిపోయాడు. అక్కడే ఆయుధాలు విక్రయించే గ్యాంగ్‌తో చేతులు కలిపాడు. షాపూర్ గ్రామానికి చెందిన సంపత్‌యాదవ్ వద్ద రూ.20వేలకు .32ఎం.ఎం, ఒక తపంచా, 10 బుల్లెట్లు కొన్నాడు. వాటిని అమ్మి సొమ్ము చేసుకోవాలనుకున్నాడు. విషయాన్ని గ్రహించిన పోలీసులు అరెస్టు చేశారు. ఇది జరిగిన 24 గంటల్లోనే కాల్పులు పోలీసులను పరుగులు పెట్టించాయి.

# కొత్త రేషన్ కార్డుల మంజూరుకు రంగం

**హైదరాబాద్, జనవరి 18ప్రజాబలం ప్రతినిధి:** తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల మంజూరుకు రంగం సిద్ధమవుతోంది. ఈనెల 26వ తేదీ నుంచే ఈ ప్రక్రియ ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈలోపే అర్హులను గుర్తించే దిశగా సర్కార్ అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే ఇటీవలనే మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది. ఇందుకు అనుగుణంగా?. జిల్లాల వారీగా కొత్త కార్డులకు ఎవరు అర్హులుగా ఉన్నారనే దానిపై పౌరసరఫరాల శాఖ కసరత్తు చేపట్టింది. ఈ మేరకు ప్రాథమిక వివరాలతో కూడిన జాబితాలను సిద్ధం చేసినట్లు తెలిసింది.రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు ఎంతో కాలంగా కొత్త కార్డుల కోసం ఎదురుచూస్తున్నాయి. ప్రజాపాలన కార్యక్రమంలో అనేక మంది దరఖాస్తులు ఇచ్చారు. నిర్ణీత ఫామ్ లో కాకుండా? తెల్ల కాగితంపైనే రేషన్ కార్డుల కోసం అప్లికేషన్ ఇచ్చారు. అయితే వీటి విషయంలో సర్కార్ నుంచి అధికారికంగా క్లారిటీ రాలేదు. అయితే తాజాగా విడుదల చేసిన మార్గదర్శకాల్లో మాత్రం?.సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా జారీ చేయాలని నిర్ణయించింది. దీంతో సరికొత్త పద్ధతిలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ షురూ కానుంది.గత కొద్ది రోజుల కిందటే రాష్ట్రవ్యాప్తంగానూ సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారు. కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను సేకరించారు. అయితే ఈ వివరాల ఆధారంగా? పౌరసరఫరాల శాఖ ప్రాథమిక జాబితాలను సిద్ధం చేసినట్లు తెలిసింది. దాదాపు 6 లక్షలకుపైగా కుటుంబాలు కొత్త కార్డులకు అర్హమైనవిగా గుర్తించింది. ఈ జాబితాలు ఇప్పటికే జిల్లాలకు చేరినట్లు తెలిసింది.పౌరసరఫరాల శాఖ సిద్ధం చేసిన ప్రాథమిక జాబితాలను జిల్లా అధికారులు పరిశీలిస్తారు. గ్రామాలవారీగా లిస్టులను పంపుతారు. ఈ జాబితాలను గ్రామసభల ముందు ఉంచుతారు. పట్టణాల్లో అయితే బస్తీ సభల్లో ఉంచుతారు. ఇక్కడ లిస్ట్ ను చదివి వినిపించి?. ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తారు. అభ్యంతరాల స్వీకరణ తర్వాత తుది జాబితా ఖరారవుతుంది. ఈ ప్రక్రియ జనవరి 20 నుంచి ప్రారంభం కానుంది. ఆ తర్వాత ఈ లిస్టులను జిల్లా కలెక్టర్లకు చేరుతాయి. కలెక్టర్లు పంపే లిస్ట్ ఆధారంగా పౌరసరఫరాల శాఖ? కొత్త కార్డులను మంజూరు చేస్తుంది. ఈ ప్రక్రియ జనవరి 26న నుంచి ప్రారంభమవుతుంది.ఇప్పటికే ఉన్న కార్డుల్లో పేర్లు మార్పు చేర్పుల దరఖాస్తులను ఆమోదించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. పెళ్లి అనంతరం పుట్టింటి కార్డులో పేరు తొలిగించి, అత్తింటి కార్డుల్లో పేర్లు జోడించాలని దరఖాస్తు చేసుకున్నారు. వీటి విషయంలో కూడా సర్కార్ నిర్ణయం తీసుకోనుంది. మరోవైపు రేషన్ కార్డుల డిజైన్ సైతం మారనుంది. గతంలో ఎలక్ట్రానిక్ రూపంలో కార్డులు జారీ చేశారు. ప్రస్తుతం రీడిజైన్ చేసి ఫిజికల్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తెలుస్తోంది.

# మరో ఫ్లై ఓవర్ రెడీ...

**హైదరాబాద్‌ప్రజాబలం ప్రతినిధి:** జనవరి 18, హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ ట్రాఫిక్ కష్టాలు పెరుగుతున్నాయి. అయితే నగరవాసులకు ట్రాఫిక్ ఫ్రీ జర్నీ అందించడానికి తెలంగాణ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతూనే ఉంది. ఈ క్రమంలోనే ఫ్లైఓవర్, అండర్ పాస్‌లు, స్కైవేలు.. ఇలా ఎన్నోరకాల చర్యలు తీసుకుంటోంది. రద్దీగా ఉండే జంక్షన్ల వద్ద అనేక ఫ్లైఓవర్లు నిర్మించడం వల్ల ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టే ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే నగరంలో ఇప్పటికే చాలా ఫ్లైఓవర్లు అందుబాటులోకి రాగా.. తాజాగా మరొకటి రెడీ అయింది. త్వరలోనే ప్రారంభోత్సవం జరుపుకుని.. వాహనదారుల ట్రాఫిక్ తిప్పలకు అడ్డుకట్ట వేయనుంది. ఇందులో భాగంగానే అంబర్‌పేట్ ఫ్లై ఓవర్ త్వరలోనే వాహనదారులకు అందుబాటులోకి రానుంది4 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ అంబర్‌పేట ఫ్లైఓవర్ పనులు ఈ మధ్యే పూర్తి అయ్యాయి. రూ.445 కోట్లతో గోల్నాక నుంచి ఛే నంబర్ జంక్షన్ మీదుగా ముత్రం హోటల్ వరకు ఈ ఫ్లై ఓవర్‌ను నిర్మించారు. మొత్తంగా 1.625 కిలోమీటర్ల పొడవుతో నాలుగు లేన్లతో ఈ ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తి చేసుకుంది. కేంద్ర ప్రభుత్వ నిధులతో కోర్ సిటీలో నేషనల్ హైవే అథారిటీ నిర్మించిన మొట్టమొదటి ఫ్లై ఓవర్ ఇదే కావడం గమనార్హం. అయితే ఈ ఫ్లైఓవర్ భూసేకరణకు కావాల్సిన రూ.140 కోట్లను మాత్రం రాష్ట్ర ప్రభుత్వమే సమకూర్చింది.అయితే ఈ అంబర్‌పేట ఫ్లై ఓవర్ నిర్మాణ పనులకు 2018లోనే శంకుస్థాపన చేసినా.. 2021 వరకు పనులు మొదలు కాలేదు. అయితే 2021లో పనులు ప్రారంభించిన ఈ ఫ్లై ఓవర్ పనులను 2023 చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా అది ఇప్పటికి పూర్తయింది. మొదట రూ.216 కోట్ల అంచనా వ్యయంతో ఈ ఫ్లైఓవర్ నిర్మాణం ప్రారంభించినా.. అది కాస్తా రూ.445 కోట్లకు చేరుకుంది. ఇందులో రూ.117 కోట్లు స్ట్రెచర్ కాస్ట్ కాగా.. రూ.99 కోట్లు భూసేకరణ కోసం ఖర్చు అవుతుందని భావించారు.అయితే ఆ మార్గంలో ఉన్న రెండు వర్గాలకు చెందిన కట్టడాల పైనుంచి ఫ్లై ఓవర్ నిర్మించేందుకు వారు ఒప్పుకోలేదు. దీంతో కొంతమేర ఆ రూట్‌ను మార్చడం.. భూసేకరణ అధికంగా కావడం.. సమయం కూడా ఆలస్యం కావడంతో రూ.445 కోట్ల అంచనాతో ఈ ఫ్లైఓవర్ పనులను రివైజ్ చేశారు. ఇందులో రూ.265 కోట్లు స్ట్రెచర్ కాస్ట్.. రూ.180 కోట్లు భూ సేకరణ కోసం ఖర్చు చేశారు. ఈ రూ.180 కోట్ల భూసేకరణ వ్యయంలో రూ.140 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది.ఇక ఈ అంబర్‌పేట ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే ఉప్పల్ నుంచి ఎంజీబీఎస్ వెళ్లేవారితో పాటు సిటీ నుంచి వరంగల్ హైవే వైపు వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తీరడంతో పాటు.. వారి ప్రయాణ సమయం కూడా తగ్గనుంది. గతంలో ఛే నంబర్, శ్రీరమణ జంక్షన్ల వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. ఫ్లై ఓవర్ అందుబాటులోకి వస్తే చాదర్‌ఘాట్ నుంచి సిగ్నల్ లేకుండా తగలకుండా రామాంతాపూర్, హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 8 వరకు సులువుగా చేరుకోవచ్చు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లేదా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఈ అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను ప్రారంభించే అవకాశాలు ఉన్నట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ వారు హాజరుకాలేని పక్షంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి.. సీఎం రేవంత్ రెడ్డి కలిసి ప్రారంభిస్తారని సమాచారం.

# నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఫోకస్

**వరంగల్, జనవరి 18, ప్రజాబలం ప్రతినిధి:** తెలంగాణలో కాంగ్రెస్ పాలన ఏడాది పూర్తి చేసుకుంది. అయితే క్షేత్రస్థాయిలోని చాలా మంది ముఖ్య నేతలు నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. కొంతమందికే అవకాశాలు దక్కగా? మరికొంత మంది నేతలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. వీలైనంత త్వరగా భర్తీ చేయాలని కోరుతున్నారు.తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి ఏడాది పూర్తైపోయింది. ఓవైపు సంక్షేమ పథకాలను పట్టాలెక్కించే పనిలో ఉంటూనే.. మరోవైపు రాజకీయంగానూ బలపడే అవకాశాలపై ఫోకస్ పెడుతూ వస్తోంది. బీఆర్ఎస్ నుంచి పది మంది ఎమ్మెల్యేలను కూడా చేర్చుకుంది. కట్ చేస్తే.. త్వరలోనే స్థానిక ఎన్నికల నగారా మోగనుంది. ఈ ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో పాగా వేసి? గ్రౌండ్ లో మరింత బలపడాలని భావిస్తోంది.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పట్నుంచి? పార్టీలోని చాలా మంది నేతలు పదవులపై ఆశలు పెంచుకున్నారు. రేపు మాపు అంటూ భర్తీ ప్రకటనలు వస్తున్నప్పటికీ? ముహూర్తం మాత్రం ఖరారు కావటం లేదు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత? కొన్ని పదవులను భర్తీ చేశారు. అయితే ఇంకా చాలా కార్పొరేషన్లతో పాటు జిల్లా, నియోజకవర్గస్థాయిలో నామినేటెడ్ పదవులు ఉన్నాయి. అయితే పార్టీ కోసం పని చేసిన నేతలను గుర్తించి? పదవులను ఇవ్వాలని నేతలు కోరుతున్నారు. ఇదే విషయాన్ని పదే పదే అధినాయకత్వం దృష్టికి కూడా తీసుకెళ్తున్నారు. ఎవరికి వారుగా ప్రయత్నాలు చేస్తున్నారు.గతేడాది చివరల్లోనే పీసీసీ అధ్యక్షుడిగావ మహేశ్ కుమార్ గౌడ్ ను నియమించారు. ఆయన జిల్లాల్లో పర్యటనలు చేస్తున్నారు. పార్టీ బలోపేతం కోసం కీలక నిర్ణయాలు ఉంటాయని చెబుతున్నారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని పదే పదే స్పష్టం చేస్తున్నారు. కొత్త, పాత అనే తేడా లేకుండా? అందరూ కలిసి పని చేయాలని దిశానిర్దేశం చేస్తున్నారు. పని చేసిన వారికే గుర్తింపు ఉంటుందని చెప్పుకొస్తున్నారు.నామినేటెడ్ పదవులే కాదు? పార్టీ కార్యవర్గంలోనూ మార్పులు చేయనున్నారు. పార్టీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి? కొత్త నియామకాలను చేపట్టాలని టీపీసీసీ భావిస్తోంది. అయితే నామినేటెడ్ పదవులతో పాటే కార్యవర్గంలో కూడా మార్పులు చేసే విషయంపై అధినాయకత్వం ఆలోచిస్తున్నట్లు తెలిస్తోంది. ఇటీవలే మీడియాతో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్? ఈనెలాఖరా నాటికి నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని ఓ ప్రకటన కూడా చేశారు. అధినాయకత్వం గ్రీన్ సిగ్నల్ రాగానే?. ఈ ప్రక్రియ పట్టాలెక్కుతుందని చెప్పుకొచ్చారు.అటు ప్రభుత్వంలో ఇటు పార్టీలో పదవుల భర్తీ ఆలస్యం అవుతుండటంతో పార్టీలోని నేతలు పూర్తి నిరాశ నిస్పృహలో ఉన్నారన్న టాక్ వినిపిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే ముందే..నామినేటెడ్ పోస్టుల భర్తీని పూర్తి చేయాలని నేతలు కోరుతున్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో? రాష్ట్ర నాయకత్వం ఏం చేయబోతుందనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ టీపీసీసీ నిర్ణయం తీసుకున్నా? ఢిల్లీ నాయకత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తుదా..? లేక మరికొన్ని రోజులు ఆపుతుందా..? అనే విషయంలో కూడా క్లారిటీ రావాల్సి ఉంటుంది.పార్టీ పరంగా భర్తీ ప్రక్రియ ఆలస్యమవుతున్నప్పటికీ పదవులు ఆశిస్తున్న నేతలు? మాత్రం వెనక్కి తగ్గటం లేదు. ఎవరికి వారుగా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కింది స్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు పావులు కదుపుతున్నారు. ఎలాగైనా పదవి దక్కించుకోవాలని? రాజకీయంగా బలపడాలని చూస్తున్నారు. ప్రస్తుతం ఆశల పల్లకిలో ఉన్న నేతల్లో ఎంత మందిని అదృష్టం వరిస్తుందో చూడాలి?!

# ఆర్టీసీకి కాసుల వర్షం

**వరంగల్, జనవరి 18, ప్రజాబలం ప్రతినిధి:**వరంగల్ ఆర్టీసీకి సంక్రాంతి పండుగ కాసుల వర్షాన్ని కురిపించింది. సంక్రాంతి పండుగ రద్దీ నేపథ్యంలో దాదాపు వారం రోజుల పాటు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపించగా.. గతంతో పోలిస్తే ఈసారి పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరింది.వరంగల్ రీజియన్ పరిధిలో హనుమకొండ, వరంగల్1, వరంగల్ 2, పరకాల, భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, నర్సంపేట, తొర్రూరు .. ఇలా మొత్తం 9 డిపోలు ఉండగా.. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఈ నెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది.వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను ఆదేశాల మేరకు పండుగ నేపథ్యంలో మొత్తంగా 927 బస్సులు 26.61 లక్షల కిలోమీటర్ల మేర నడిపించగా.. వారం రోజుల సమయంలో మొత్తంగా 26.42 లక్షల మంది ప్రయాణించారు. అందులో రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించగా.. ఓవరాల్ గా 16.30 లక్షల మంది మహిళలు ఆర్టీసీ సేవలను వినియోగించుకున్నారు.ఇదిలా ఉంటే వరంగల్ రీజియన్ కు సాధారణ రోజుల్లో ప్రతి రోజు రూ.2 కోట్ల వరకు ఆదాయం వస్తుండగా.. కేవలం ఈ ఏడు రోజుల్లో రూ.16.47 కోట్ల ఆదాయం రావడం గమనార్హం. ఇందులో మహాలక్ష్మి పథకం ద్వారా ప్రయాణించిన 16.30 లక్షల మంది నుంచి రూ.7.6 కోట్ల ఆదాయం రాగా.. టికెట్ ఛార్జీలు చెల్లించి ప్రయాణించిన 10.12 లక్షల మంది నుంచి రూ.8.86 కోట్ల లాభం వచ్చింది.వరంగల్ రీజియన్ పరిధిలోని తొమ్మిది డిపోల్లో అత్యధికంగా వరంగల్ ? 2 డిపో నుంచే ఆదాయం సమకూరింది. వరంగల్ 2 డిపో నుంచి బస్సులు 4.82 లక్షల కిలోమీటర్లు బస్సు సర్వీసులు నడవగా రూ.2.86 కోట్ల ఆదాయం వచ్చింది. వరంగల్ 1 డిపో నుంచి బస్సులు 3.72 లక్షల కిలో మీటర్లు నడవగా రూ.2.26 కోట్ల లాభం వచ్చింది.హనుమకొండ డిపో నుంచి 1.98 కోట్లు, జనగామ డిపో నుంచి 1.90 కోట్లు, తొర్రూరు నుంచి 1.84 కోట్లు, భూపాలపల్లి డిపో నుంచి రూ.1.64 కోట్లు, నర్సంపేట డిపో నుంచి రూ.1.63 కోట్లు, పరకాల డిపో నుంచి రూ.1.21 కోట్లు, మహబూబాబాద్ డిపో నుంచి 1.13 కోట్ల వరకు ఆదాయం వచ్చింది. ఇదిలాఉంటే హనుమకొండ డిపో పరిధిలో నడిచిన బస్సుల్లో అత్యధికంగా 4.36 లక్షల మంది ప్రయాణం చేయగా.. అత్యల్పంగా తొర్రూరు డిపో నుంచి 2.43 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగించుకున్నారు.కాగా సమష్టి కృషి తోనే ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు నడిపించామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. రద్దీ రూట్లపై ఎక్కువ ఫోకస్ పెట్టి బస్సులు తిప్పినట్లు పేర్కొంటున్నారు. కాగా ఆర్టీసీకి పెద్ద ఎత్తున ఆదాయం సమకూరడంతో ఆఫీసర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వివిధ ప్రాజెక్టులకు ఆటవీ అనుమతులు

## స్పందించిన కేంద్ర ప్రభుత్వం

హైదరాబాద్ తెలంగాణ లో ప్రాజెక్టు లకు అటవీ అనుమతులపై కేంద్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అటవీ అనుమతులు కావాల్సిన ప్రాజెక్టు లపై వివరాలు సేకరిస్తుంది. కొద్ది రోజుల క్రితం అటవీ అనుమతుల్లో జాప్యం కారణంగా గా నిర్మాణం లో ఉన్న ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి కి కేంద్ర ప్రభుత్వం స్పందించింది. అటవీ శాఖ డైరెక్టర్ జనరల్ జితేంద్ర కుమార్ ను ను తెలంగాణ కు కేంద్ర ప్రభుత్వం పంపింది. తెలంగాణ అటవీ శాఖ అధికారులతో అయన సమావేశం అయ్యారు. ఏపీ ప్రాంతాల్లో అటవీ అనుమతులు పెండింగ్ లో ఉన్నాయి.. ఎంత భూమి అవసరం ఉంది అన్న దానిపై ఆరా తీసారు. ఆయా ప్రాంతాల్లో నిర్మించతలపెట్టిన ప్రాజెక్టుల వివరాలు సేకరించారు.

## మంత్రి కొండా సురేఖ పర్యటనలో ప్రోటోకాల్ రచ్చ

మెదక్‌శనివారం జరిగిన మంత్రి కొండా సురేఖ పర్యటనలో ప్రోటోకాల్ వివాదం చెలరేగింది. చేగుంట మండలం వడియారం గ్రామంలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ వచ్చారు. స్టేజిపై దుబ్బాక కాంగ్రెస్ ఇంచార్జి చెరకు శ్రీనివాస్ రెడ్డి కూర్చోవడంతో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిఅభ్యంతరం తెలిపారు. మంత్రి సూచనతో చెరకు శ్రీనివాస్ రెడ్డి వెనుక వెళ్లి కూర్చున్నారు. చిల్లర పనులు చేయొద్దని విజ్ఞత పాటించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చెప్పడంతో వివాదం రాజుకుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య పోటాపోటీ నినాదాలు చోటు చేసుకున్నాయి.

# దీపాదాస్ మున్షీ తప్పిస్తారని ప్రచారం



**హైదరాబాద్ జనవరి 18,ప్రజాబలం ప్రతినిధి:** కింది మీద పడి పదేళ్ల తర్వాత పార్టీ పవర్‌లోకి వచ్చింది. వన్ ఈయర్ పాలన కూడా కంప్లీట్ అయింది. అయినా పార్టీ పరంగా ఏదో లోటు ఉందని భావిస్తోందట హస్తం పార్టీ హైకమాండ్. పార్టీలో ప్రక్షాళన చేయాలని ఫిక్స్ అయ్యారట. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ నుంచే మార్పులు, చేర్పులు మొదలు పెడుతారని చర్చ జరుగుతోంది. త్వరలోనే టీపీసీసీ పూర్తిస్థాయి కార్యవర్గ ఏర్పాటు చేస్తారట. అంత కంటే ముందే ఏఐసీసీ ఇంచార్జ్ దీపా దాస్ మున్షిని తప్పిస్తారన్న టాక్ వినిపిస్తోంది.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి అధికారంలోకి వచ్చి ఏడాది అయిపోయింది. పీసీసీ చీఫ్‌గా మహేశ్ కుమార్ గౌడ్ పదవీ బాధ్యతలు చేపట్టి కూడా 4 నెలలు దాటిపోయింది. అయినా ఇప్పటివరకు పీసీసీ కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేయలేదు. గతంలో పీసీసీ చీఫ్‌గా రేవంత్ రెడ్డి ఉన్నప్పుడు నియమించిన పాత కార్యవర్గమే కొనసాగుతూ వస్తోంది. రాష్ట్ర కాంగ్రెస్‌కు కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రయత్నించినప్పటికీ అధిష్టానం నుంచి గ్రీన్‌సిగ్నల్ రాలేదట. దీంతో పార్టీ పదవులపై ఆశలు పెట్టుకున్న ఆశావహులంతా ఇంకెప్పుడు ఢిల్లీ పెద్దల నుంచి అనుమతి లభిస్తుందా అని ఆశగా ఎదురు చూస్తున్నారట.ఇటీవల ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం తర్వాత దేశవ్యాప్తంగా పార్టీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని నిర్ణయించిందట హైకమాండ్. సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడంపై దృష్టిపెట్టిన అధిష్టానం పెద్దలు..ముందుగా చాలా రాష్ట్రాల పార్టీ వ్యవహారాల ఇంచార్జ్‌లు, ప్రధాన కార్యదర్శులను మార్చాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే తెలంగాణలో కూడా త్వరలోనే భారీ మార్పులు, చేర్పులు ఉంటాయనే సంకేతాలు ఇచ్చారట. అయితే పీసీసీ ప్రక్షాళన కంటే ముందు తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ దీపా దాస్ మున్షీని మార్చాలని అధిష్టానం భావిస్తున్నట్లు టాక్.దీపా దాస్ మున్షీని తప్పించాలని ఢిల్లీ పెద్దలు నిర్ణయించడానికి చాలా కారణాలు ఉన్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. చాలామంది తెలంగాణ కాంగ్రెస్ నేతలు రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ దీపా దాస్‌మున్షీ వైఖరిపై అసంతృప్తితో ఉన్నారట. అధికార పార్టీకి ఇంచార్జ్‌గా ఉన్న దీపా దాస్ మున్షి వ్యవహరించే తీరు ఇది కాదన్నది మెజార్టీ నేతల అభిప్రాయంగా తెలుస్తోంది.పార్టీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేయడంలో ఆమె ఫెయిల్ అయ్యారని భావిస్తున్నారట నేతలు. ఎన్నికల సమయంలో కొంతమందికి పట్టుబట్టి టికెట్లు ఇప్పించారని, ఇప్పుడు కూడా మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో తనకు నచ్చిన కొన్ని పేర్లను తెర మీదకి తెస్తున్నారంటూ సీనియర్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి లాంటి వారు ఈ విషయాన్ని బహిరంగంగానే చెప్పేయడం పార్టీలో చర్చనీయాంశమైంది.పార్టీలో సీనియర్లను ఏ మాత్రం పట్టించుకోకుండా..దీపా దాస్ మున్షి తనకంటూ ఓ వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారని పార్టీ వర్గాలు చెప్పుకుంటున్నాయి. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి సహా, మంత్రులు, ప్రభుత్వంలో కీలకంగా ఉన్నవారితో దీపాదాస్‌కు ఏ మాత్రం కోఆర్డినేషన్ లేదని అంటున్నారు. అందుకే ప్రభుత్వానికి, పార్టీకి మధ్య సమన్వయం లోపించిందని నేతలు వాపోతున్నారు. ఈ విషయాలన్నీ నేతలు వరుసగా అధిష్టానం దృష్టికి తీసుకెళ్లడంతో ఢిల్లీ పెద్దలు కూడా దీపాదాస్ తీరుపై నివేదిక తెప్పించుకున్నారని తెలుస్తోంది.అందులో భాగంగానే మొన్న గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశానికి ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రత్యేకంగా హాజరయ్యారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తానికి పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ దీపాదాస్ మున్షీని తప్పించి..తెలంగాణ కాంగ్రెస్‌లో ప్రక్షాళన మొదలుపెడుతామని ఢిల్లీ నుంచి సంకేతాలు వస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో త్వరలోనే పీసీసీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తారని..ఆశల పల్లకిలో ఉన్నారు ఆశావహులు. అయితే దీపాదాస్ మున్షిని తప్పిస్తారా ఒకవేళ తప్పిస్తే ఇంచార్జ్‌గా రాబోయే నేత ఎవరనేది ఆసక్తిరేపుతోంది.

# సినిమా



## మూడు పాటలతో మేజిక్ చేయడం ఎలా?



ఏదైనా పెద్ద సినిమాకు సంగీత దర్శకుడిని ఎంచుకునే పని స్టార్ హీరోల దర్శకులకు పెద్ద సవాల్ గా మారుతున్న తరుణంలో ఇప్పుడు భీమ్స్ ఇండస్ట్రీ హాట్ టాపిక్ గా మారాడు. పండగ బ్లాక్ బస్టర్ సంక్రాంతికి వస్తున్నాంకి అతను ఇచ్చింది మూడు పాటలే. వాటిలో గోదారి గట్టు మీద చందమామవే ఏకంగా ఓపెనింగ్స్ లో సింహ భాగం పోషించే రేంజ్ లో ఛార్ట్ బస్టర్ అయ్యింది. తమన్ కంపోజ్ చేసిన గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్ పాటల కన్నా వేగంగా వంద మిలియన్ల క్లబ్బులో చేరింది భీమ్స్ సాంగ్సే. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ పరంగానూ ఇతని మీద ప్రశంసల వర్షం కురుస్తోంది. కొన్ని లక్షల రీల్స్ ఈ పాటల మీద వచ్చాయి. మామూలుగా ఆడియో కంపెనీలు ఏదైనా బడా మూవీ హక్కులు కొనేటప్పుడు ఎన్ని పాటలు ఉన్నాయనేది ముందు చూసుకుంటారు. దాన్ని బట్టే రేట్ ఉంటుంది. ఎన్ని ఎక్కువ ఉంటే అన్ని వ్యూస్ పెరిగే అవకాశం ఉంటుంది కాబట్టి. కానీ అనిల్ రావిపూడి దానికి కట్టుబడకుండా కేవలం కథ డిమాండ్ కు అనుగుణంగా మూడుతోనే సరిపుచ్చాడు. కాకపోతే అవి బెస్ట్ కావాలని భీమ్స్ తో కో ఆర్డినేట్ చేసుకుని 2025 బెస్ట్ ఆల్బమ్ అయ్యే రేంజ్ లో వర్క్ చేయించుకున్నాడు. దాని ఫలితమే ఫ్యామిలీ ఆడియన్స్ లో ఎక్కడ లేని క్రేజ్ తీసుకొచ్చింది. పాటలు బాగున్నాయి కాబట్టి సినిమా బాగుంటుందనే ఫీలింగ్ రిలీజ్ కు ముందే వచ్చేసింది. మ్యూజిక్ విషయంలో ఎంత జాగ్రత్తగా ఉండాలో చెప్పేందుకు ఇంతకన్నా ఉదాహరణ అక్కర్లేదు. వందల కోట్ల బడ్జెట్ పెట్టినా కొన్నిసార్లు కేవలం పాటల వల్లే బజ్ హెచ్చుతగ్గులకు గురైన సందర్భాలు ఎన్నో. తమన్, దేవిశ్రీప్రసాద్ ఎందుకో తమ మేజిక్ ని పూర్తి స్థాయిలో ఆవిష్కరించుకోలేకపోతున్న టైంలో భీమ్స్ ఇలా దూసుకురావడం శుభ పరిణామం. చిరంజీవి అనిల్ రావిపూడి సినిమాకు కూడా ఇతన్నే తీసుకున్నారనే లీక్ ఆల్రెడీ చక్కర్లు కొడుతోంది. ఇది నిజమైతే మెగా జాక్ పాట్ తగిలినట్టే. పోకిరిలో మహేష్ స్టైల్ లో చెప్పాలంటే పాటలు ఎన్ని ఇచ్చామనేది కాదు, ఇచ్చినవి అదిరిపోయాయా లేదా. సంక్రాంతికి వస్తున్నాంకు జరిగింది ఇదే.

## కంగువ సౌండ్‌పై దేవి ఏమన్నాడంటే?




సూర్య సినిమా 'కంగువా' మీద విడుదల ముంగిట ఏ స్థాయిలో అంచనాలున్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. కానీ ఆ అంచనాలను అందుకోవడంలో సినిమా ఘోరంగా విఫలమైంది. గత ఏడాది ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలోనే అతి పెద్ద డిజాస్టర్లో ఒకటిగా కంగువా నిలిచింది. ఈ సినిమాతో సంగీత దర్శకుడిగా మరో మెట్టు ఎక్కుతాడనుకున్న దేవిశ్రీ ప్రసాద్ సైతం విమర్శలు ఎదుర్కొన్నాడు.సినిమా చూసి బయటికి వచ్చిన వాళ్లంతా అందులోని శబ్ద కాలుష్యానికి తట్టుకోలేక తలలు పట్టుకున్నారు. సినిమాలో పాత్రలన్నీ అదే పనిగా అరుస్తూ ఉంటే.. నేపథ్య సంగీతం సైతం మరీ లౌడ్‌గా ఉండడం ప్రేక్షకులకు చిర్రెత్తుకొచ్చేలా చేసింది. దీంతో సౌండ్ ఎఫెక్ట్స్ గురించి రిలీజ్ టైంలో బాగా ట్రోలింగ్ జరిగింది. దీంతో ఈ సినిమాకు సౌండ్ ఇంజినీర్‌గా పని చేసిన ఆస్కార్ విన్నింగ్ టెక్నీషియన్ రసూల్ పొకుట్టి సైతం పరోక్షంగా బ్యాగ్రౌండ్ స్కోర్ మీద అసహనం వ్యక్తం చేశాడు. ఈ శబ్ద కాలుష్యం వల్ల ఒకసారి చూడ్డానికే తలపోటు వస్తుండడంతో రిపీట్ ఆడియన్స్ ఎలా వస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ విమర్శలపై తాజాగా దేవిశ్రీ ప్రసాద్ స్పందించాడు. ఎవరి పేరూ ప్రస్తావించలేదు కానీ.. కంగువా సినిమాకు తన వర్క్ విషయంలో ఎక్కువగా ప్రశంసలే వచ్చాయని, విమర్శలు చేసిన వాళ్లు తక్కువ అని దేవి పేర్కొన్నాడు. ''నేను సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్‌ను పట్టించుకోను. నా పని నేను చేసుకుంటూ వెళ్తాను. మనం ఏది చేసినా విమర్శించేవాళ్లు ఉంటారు. కంగువా ఆల్బం నాకు చాలా స్పెషల్. అందులో మన్నిప్పు పాటకు ఎన్నో ప్రశంసలు వచ్చాయి. సూర్య ఫ్యాన్స్ ఆ పాటను ఎంతగానో సెలబ్రేట్ చేసుకున్నారు. సూర్య గారు కూడా నాకు ఫోన్ చేసి మ్యూజిక్ గురించి అరగంట మాట్లాడారు. ప్రతి సినిమాలోనూ మంచి చెడులు ఉంటాయి. కంగువ సినిమా కోసం టీం ఎంత కష్టపడిందో దాని విజువల్స్ చూసినా, సూర్య నటనను పరిశీలించినా అర్థమవుతుంది. మేమందరం ఎంతో కష్టపడి, ఎంజాయ్ చేస్తూ పని చేసిన సినిమా అది. కొందరికి ఈ సినిమా నచ్చకపోయినా.. మేం మాత్రం కంగువా విషయంలో గర్వపడుతున్నాం'' అని దేవిశ్రీ ప్రసాద్ స్పష్టం చేశాడు.

## మనోహరంగా మాట వినాలి



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'హరి హర వీరమల్లు పార్ట్-1 స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్'. ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ. దయాకర్ రావు ఈ చిత్రాన్ని భారీస్థాయిలో నిర్మిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న 'హరి హర వీర మల్లు' చిత్ర పాటల కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'మాట వినాలి' అంటూ సాగే మొదటి గీతాన్ని నిర్మాతలు ఆవిష్కరించారు. ఈ పాటను స్వయంగా పవన్ కళ్యాణ్ ఆలపించడం విశేషం. సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేసే 'మాట వినాలి' లిరికల్ వీడియోతో 'హరి హర వీర మల్లు' సంగీత ప్రయాణం మొదలైంది. 'వినాలి, వీరమల్లు మాట చెప్తే వినాలి' అంటూ తెలంగాణ మాండలికంలో పవన్ కళ్యాణ్ చెప్పే హృద్యమైన పంక్తులతో పాట ప్రారంభమైన తీరు అమోఘం. అందరూ పాడుకునేలా అర్థవంతమైన పంక్తులు, శక్తివంతమైన జానపద బీట్ లతో 'మాట వినాలి' గీతం మనోహరంగా ఉంది. పెంచల్ దాస్ అందించిన సాహిత్యం లోతైన భావాన్ని కలిగి ఉంది. మంచి మాటలను వినడం, వాటి నుండి వచ్చే జ్ఞానం యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ అద్భుతమైన సందేశంతో ఈ పాట సాహిత్యం నడిచింది. ప్రతి వాక్యం విలువైన జీవిత పాఠాలను అందిస్తుంది. జీవితంలో సానుకూలత, ధర్మాన్ని స్వీకరించడానికి శ్రోతలను ప్రోత్సహిస్తుంది. అటవీ నేపథ్యంలో చిత్రీకరించిన 'మాట వినాలి' పాట విజువల్స్ ఆకట్టుకున్నాయి. అడవిలో మంట చుట్టూ వీరమల్లు అనుచరుల బృందం గుమిగూడినట్లుగా లిరికల్ వీడియోలో చూపించారు. ఇక పవన్ కళ్యాణ్ గ్రేస్‌ఫుల్ డ్యాన్స్‌లు పాట విడుదలైన కొద్ది నిమిషాల్లోనే సామాజిక మాధ్యమాల్లో సంచలనంగా మారాయి. ఎం.ఎం. కీరవాణి స్వరపరిచిన ఈ మనోహరమైన, ఆకర్షణీయమైన గీతం సంగీత ప్రియుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకునేలా ఉంది. 'హరి హర వీరమల్లు' చిత్రం పాన్ ఇండియా స్థాయిలో ఐదు భాషల్లో అలరించనుంది. ఈ క్రమంలో మొదటి గీతాన్ని తెలుగులో మాట వినాలి, తమిళంలో కెక్కనుం గురువే, మలయాళంలో కేల్క్కనం గురువే, కన్నడలో మాతు కేలయ్యా, హిందీలో బాత్ నీరాలి గా విడుదల చేశారు.

## పుష్ప సినిమాలో నటిస్తానని చెప్పా




టాలీవుడ్ డైరెక్టర్ సుకుమార్ కూతురు సుకృతి వేణి లీడ్ రోల్‌లో నటించిన డెబ్యూ చిత్రం 'గాంధీ తాత చెట్టు'. పద్మావతి మల్లాది దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై సుకుమార్ రైటింగ్స్ బ్యానర్-గోపీటాకీస్‌తో కలిసి నవీన్ యేర్నేని, యలమంచిలి రవిశంకర్, శేష సింధురావు నిర్మించారు. తబితా సుకుమార్ సమర్పిస్తున్న ఈ మూవీ జనవరి 24న విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా చిత్రబృందం తాజాగా ప్రెస్‌మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా సుకృతి మాట్లాడుతూ, 'చిన్నప్పటి నుండి నటించడం చాలా ఇష్టం. నాన్న సినిమాల్లో నటిస్తానని చాలాసార్లు అడిగాను. పుష్ప, పుష్ప 2కి కూడా అడిగాను. 'నా టీచర్స్, స్నేహితులు, తెలిసినోళ్లందరూ నువ్వు పుష్పలో నటిస్తున్నావా' అని అడిగేవారు. అప్పుడు మాత్రం 'చేస్తలేను నాకు చేయబుద్ధి అవ్వలేదు. ఎందుకంటే నేను సుకుమార్ పాపను కదా.. అందుకే పెట్టినారు అనుకుంటారు' అన్నా. కానీ అసలు విషయమేంటంటే.. డాడీని పుష్పలో యాక్ట్ చేస్తా అని అడిగితే.. ఆడిషన్ చెయ్.. చూద్దాం అన్నారని సమాధానమిచ్చింది.

## అవకాశాలొస్తేనే నటిస్తా



'నేను మొదటి నుంచి కష్టపడి పనిచేశా. మంచి అవకాశాలొచ్చాయి. దానికి సంతృప్తిగా ఉన్నా. అవకాశాల కోసం ఆడిషన్స్ ఇచ్చే పరిస్థితిలో లేను. హాలీవుడ్ కోసమో, మరో చోటో ఆఫర్ల కోసం ఆడిషన్స్‌కు వెళ్లాల్సిన అవసరం నాకు లేదు. మూడు దశాబ్ధాలపాటు సాగిన నా కెరీర్‌లో ఎన్నో సినిమాలు విమర్శకుల నుంచి ప్రశంసలు పొందాయి. ఇలా 30 ఏళ్ల పని తర్వాత కొత్తగా ఆడిషన్స్ పాల్గొనే ఓపిక నాకు లేదు. నా టాలెంట్ గురించి తెలుసుకోవాలంటే గత చిత్రాలను చూడండి. నేను సరిగ్గా సరిపోతుంటే ఆడిషన్ చేయాల్సిన అవసరం లేదు. ఏదేమైనా నా జీవితంలో కుటుంబానికి మొదటిస్థానం. పని కోసమో మరింత పేరు ప్రతిష్టల కోసమో ఆరాటపడుతూ ఎక్కువ కాలం పిల్లలకు దూరంగా ఉండటం నా వల్ల కాదు' అని బాలీవుడ్ కథానాయిక శిల్పాశెట్టి కుంద్రా అన్నారు. బాజీఘర్ లాంటి బాక్సాఫీస్ హిట్స్ ఇచ్చిన శిల్పాశెట్టికి బాలీవుడ్‌లో స్టార్‌డమ్ దక్కలేదు. ఉత్తరాది కథానాయికల్లో తక్కువమందికే సాధ్యమైన విధంగా టాలీవుడ్ సహా దక్షిణాదిలో చెప్పుకోదగ్గ సంఖ్యలోనే సినిమాలు చేసినా ఇక్కడా పెద్ద పేరు రాలేదు. వెంకటేష్‌తో సాహసవీరుడు సాగరకన్య, నాగార్జునతో ఆజాద్, వీడెవడండీ బాబు వంటి పలు తెలుగు సినిమాల్లో నటించారు. నేటికీ అడపా దడపా సినిమాలు చేస్తూనే ఉన్నారు.

### తమన్ భావోద్వేగం..

సోషల్ మీడియా ప్రపంచంలో రోజురోజుకి నెగటివిటీ ఎక్కువైపోతోంది. ఇది ఏ స్థాయికి చేరుకుందంటే వందల కోట్లు పోసిన ఒక ప్యాన్ ఇండియా మూవీ మీద ప్రభావం చూపించేంత. కొన్నిసార్లు హద్దులు దాటి పరస్పరం మాటల దాడులతోనే వ్యక్తిత్వ హననం చేసుకునేంత. హీరోలు ఇలాంటివి చేయొద్దంటూ సందర్భం వచ్చిన ప్రతిసారి చెబుతూనే ఉన్నా ఫ్యాన్స్ చెవులకు ఎక్కడం లేదు. అదేదో ఘనకార్యంలాగా పదే పదే వాటికే పాల్పడుతున్నారు. డాకు మహారాజ్ సక్సెస్ ఈవెంట్ లో సంగీత దర్శకుడు తమన్ దీని గురించి ఓపెనయ్యాడు. సినిమాలను చంపొద్దంటూ బహిరంగంగా విన్నవించుకున్నాడు. సక్సెస్ వస్తే అందులో ఉండే ఆనందమే వేరని కానీ దాన్ని అందుకోకుండా తప్పుడు ఉద్దేశాలతో విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దంటూ హితవు పలికాడు. తమన్ చెప్పింది నిజంగా సీరియస్ గా ఆలోచించాల్సిన విషయమే. నెగటివ్ ట్రెండ్స్ వల్ల మనస్థాపం కలుగుతోందని, నిర్మాతలను గౌరవించడం మన బాధ్యతంటూ మంచి విషయాలు చెప్పాడు. గత కొన్ని నెలలుగా ఈ ధోరణి తీవ్ర రూపం దాల్చిన మాట వాస్తవం. దేవర, కల్కి నుంచి మొన్న గేమ్ ఛేంజర్ దాకా ఎన్నో పెద్ద సినిమాలను లక్ష్యంగా చేసుకున్న కొందరు యాంటీ ఫ్యాన్స్ ఒక ప్రమాదరకమైన సంస్కృతికి బీజం వేశారు. అదిప్పుడు చెట్టవుతోంది. మొగ్గలోనే తుంచితే మంచిదనేది తమన్ అభిప్రాయం. లేదంటే ఇది తర్వాతి జనరేషన్లకు పాకిపోయి వాళ్ళు కూడా ఇదే అలవాటు చేసుంటారు. మేం మేం బాగుంటామని హీరోలు ఎన్నిసార్లు చెప్పినా అభిమానులు మళ్ళీ మళ్ళీ మొదటికే వస్తున్నారు. గుంటూరు కారం ఆడియో టైం తమన్ వీటికి బలయ్యాడు. జరగండి జరగండి లీక్ లోనూ ఇలాగే చేశారు. లెక్కలేనన్ని సార్లు టార్గెట్ గా పెట్టుకుని మరీ ట్రోల్ చేశారు. చాలా సహనంతో భరిస్తూ వచ్చిన తమన్ డాకు వేడుకలో ఓపెనయ్యాడు. ఎవరినీ తిట్టకుండా జీవితంలో ఏం చేయాలనే స్పష్టత యువతకు ఉండాలని కోరాడు. విని ఆచరిస్తే అంతకన్నా కావాల్సింది ఏముంటుంది.

## వేగంగా కోలుకుంటున్నారు !



గురువారం తన ఇంట్లో దుండగుడి కత్తిపోట్లకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలివుడ్ స్టార్ సైఫ్ ఆలీ ఖాన్ ఆరోగ్యం ప్రస్తుతం బాగుందని, చాలా వేగంగా కోలుకుంటున్నారని డాక్టర్లు శుక్రవారం తెలిపారు. రెండు మూడు రోజుల్లో ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ చేసే అవకాశం వుందని చెప్పారు. ఆయన ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు డాక్టర్ల బృందం నిశితంగా పర్యవేక్షిస్తునుందని, తాము అనుకున్నట్లుగానే ఆయన చాలా వేగంగా కోలుకుంటున్నారని ఇదే పరిస్థితి కొనసాగితే త్వరలోనే ఇంటికి పంపించేస్తామని లీలావతి ఆస్పత్రి న్యూరోసర్జన్ డాక్టర్ నితిన్ డాంగే తెలిపారు. ఇంటెన్సివ్ కేర్ నుండి ఆయనకు స్పెషల్ రూమ్‌కు కూడా తరలించినట్లు చెప్పారు. చేతిపై, మెడపై, వెనుక వెన్నెముకపై మూడు గాయాలయ్యాయని చెప్పారు. మరో 2 మి.మీ లోతుకు కత్తి వెళ్ళి వున్నట్లైతే ఇంకా తీవ్రంగా గాయమయ్యేదని, అప్పుడు పరిస్థితి కొంచెం క్లిష్టమయ్యేదనిడాక్టర్ వ్యాఖ్యానించారు. కాసేపు నడిపించామని, ఆయన కూడా నడవడానికి సౌకర్యంగానే ఫీలయ్యారని చెప్పారు. అయితే ఆయన బెడ్‌రెస్ట్‌లో వుండడం మంచిదని సూచించినట్లు చెప్పారు. అందుకే సందర్శకులపై కూడా ఆంక్షలు పెట్టినట్లు చెప్పారు.



# క్రీడలు



## భారత్‌కు గుడ్‌న్యూస్.. ఛాంపియన్స్ ట్రోఫీకి జస్ప్రీత్ బుమ్రా రెడీ.. తెరపైకి ఎవరూ ఊహించని మరో ప్లేయర్ పేరు!

**మరికాపేపట్లో ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టును ప్రకటించనున్న బీసీసీఐ**

**15 మంది సభ్యులతో కూడిన జట్టులో బుమ్రాకు చోటు దక్కడం ఖాయమంటూ 'ఇండియా టుడే' కథనం**

**కానీ, అతని ఫిట్‌నెస్ ఆధారంగా మాత్రమే టోర్నీలో ఆడే అవకాశం**

మరికాపేట్లో బీసీసీఐ సెలక్షన్ కమిటీ ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టును ఖరారు చేయనుంది. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ మీడియా సమావేశంలో టీమిండియా స్క్వాడ్‌ను ప్రకటించనున్నారు. అయితే, స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఈ ఐసీసీ టోర్నీలో ఆడడంపై గత కొన్ని రోజులుగా నెలకొన్న సందిగ్ధత తొలిగిపోయినట్లు సమాచారం.

ఇండియా టుడే కథనం ప్రకారం ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కోసం 15 మంది సభ్యులతో కూడిన జట్టులో స్టార్ ఫాస్ట్ బౌలర్ బుమ్రాను చేర్చడానికి బీసీసీఐ సిద్ధంగా ఉందట. సిడ్నీలో ఆస్ట్రేలియాతో జరిగిన ఆఖరి టెస్ట్ మ్యాచ్‌లో బుమ్రా వెన్నునొప్పితో బాధపడిన తర్వాత అతను ఈ టోర్నీలో ఆడతాడా లేదా అనే దానిపై ఎన్నో చర్చలు జరిగాయి. అయితే, బుమ్రా తన గాయం విషయమై వచ్చిన పుకార్లను కొట్టిపారేశాడు. నిరాధార ప్రచారాలను నమ్మొద్దంటూ సోషల్ మీడియా వేదికగా ప్రకటించాడు.

అయితే, అతనిని జట్టులోకి తీసుకుంటారని తెలుస్తోంది. కానీ, బుమ్రా టోర్నీలో పాల్గొనడం అనేది మాత్రం అతని ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంటుందని కథనం పేర్కొంది. "సెలక్టర్లు బుమ్రా ఫిట్‌నెస్‌ను అంచనా వేయడానికి, తుది నిర్ణయం తీసుకోవడానికి ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు కనీసం ఒక మ్యాచ్ ఆడాలని కోరుకుంటున్నారు" అని ఇండియా టుడే కథనం తెలిపింది.

అలాగే సంజూ శాంసన్ జట్టులో చోటు దక్కకపోవచ్చని, విజయ్ హజారే ట్రోఫీ (వీహెచ్‌టీ)లో సంచలన ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న కరుణ్ నాయర్‌ను మాత్రం సెలక్షన్ టీమ్ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందని పేర్కొంది. కరుణ్ నాయర్ వీహెచ్‌టీలో 8 మ్యాచ్‌ల్లో 752 పరుగులతో రాణించాడు. ఏడు ఇన్నింగ్స్‌ల్లో ఐదు సెంచరీలు చేశాడు. అయితే, "ఒక ప్రధాన టోర్నమెంట్‌కు ముందు 2017లో చివరిసారిగా భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన నాయర్‌ను రీకాల్ చేయడం మంచి నిర్ణయం కాదని సెలక్టర్లు భావిస్తున్నారని" కథనం పేర్కొంది.

అటు వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ ఇంగ్లండ్‌తో టీ20ల కోసం జట్టులో చోటు దక్కడం ఖాయం. కానీ, ఇంగ్లండ్‌తో వన్డేలు, ఛాంపియన్స్ ట్రోఫీకి మాత్రం అతడు ఎంపిక అయ్యే అవకాశం లేదు. దీనికి ఒక కారణం అతను విజయ్ హజారే ట్రోఫీలో పాల్గొనకపోవడం. జాతీయ జట్టుకు ఆడాలనుకునే ఆటగాళ్లు తప్పనిసరిగా దేశవాళీ క్రికెట్ ఆడాల్సిందేనని బీసీసీఐ ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో సెలక్టర్లు అతని గైర్హాజరుపై సంతోషంగా లేరని కథనం పేర్కొంది.




## ఇంగ్లండ్ తో వన్డే సిరీస్, ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడే టీమిండియా జట్ల ఎంపిక రేపే!

**ఫిబ్రవరి 6 నుంచి ఇంగ్లండ్ తో వన్డే సిరీస్**

**ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ**

**రేపు ముంబయిలో సమావేశం కానున్న సెలెక్షన్ కమిటీ**




ఫిబ్రవరి 6 నుంచి టీమిండియా, ఇంగ్లండ్ మధ్య మూడు వన్డేల సిరీస్ జరగనుంది. ఇక ఫిబ్రవరి 19 నుంచి పాకిస్థాన్, దుబాయ్ వేదికలుగా ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో, ఇంగ్లండ్ తో వన్డే సిరీస్, ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడే టీమిండియా జట్లను రేపు (జనవరి 18) ఎంపిక చేయనున్నారు.

ముంబయిలో రేపు టీమిండియా సీనియర్ సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్, టీమిండియా సారథి రోహిత్ శర్మ భారత జట్లను ప్రకటించనున్నారు. శనివారం ఉదయం ముంబయిలో చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ సమావేశం కానుంది. ఈ సమావేశం ముగిశాక జట్లను ఖరారు చేస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు రోహిత్ శర్మ, అజిత్ అగార్కర్ ముంబయిలోని వాంఖెడే స్టేడియంలో మీడియాకు వివరాలు వెల్లడిస్తారు.

కాగా, ఇటీవల ఆస్ట్రేలియాతో చివరి టెస్టులో గాయపడి మ్యాచ్ మధ్యలో జట్టుకు దూరమైన స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఫిట్ నెస్ పై రేపు స్పష్టత రానుంది. అంతేకాదు, చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఫిట్ నెస్ పైనా రేపటితో స్పష్టత వస్తుంది. ముఖ్యంగా, బుమ్రా లేకుండా ఛాంపియన్స్ ట్రోఫీ వంటి మెగా ఈవెంట్లలో టీమిండియా ఆడడాన్ని ఊహించుకోలేం. ఇటీవల కాలంలో టీమిండియాకు బుమ్రా ప్రధాన పేసర్ గా ఎదిగాడు. అలాంటిది, గాయం నుంచి బుమ్రా కోలుకోకపోతే అతడికి ప్రత్యామ్నాయంగా ఎవరిని ఎంపిక చేస్తారన్నది చర్చనీయాంశంగా మారింది.

## ఛాంపియన్స్ ట్రోఫీకి టీమిండియాను ప్రకటించిన బీసీసీఐ... బుమ్రా ఫిట్, తిరిగొచ్చిన షమీ

**ఫిబ్రవరి 19 నుంచి ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ**

**పాకిస్థాన్, దుబాయ్ వేదికలుగా మెగా ఈవెంట్**

**రోహిత్ శర్మ కెప్టెన్ గా టీమిండియా జట్టు ఎంపిక**




ఫిబ్రవరి 19 నుంచి పాకిస్థాన్, దుబాయ్ వేదికలుగా జరిగే ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ మెగా టోర్నమెంట్ లో ఆడే భారత జట్టును నేడు ఎంపిక చేశారు. నేడు ముంబయిలో 15 మందితో కూడిన టీమిండియా ఎంపికపై బీసీసీఐ ప్రకటన విడుదల చేసింది.

ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా కెప్టెన్ గా రోహిత్ శర్మ, వైస్ కెప్టెన్ గా శుభ్ మాన్ గిల్ వ్యవహరిస్తారని ఆ ప్రకటనలో వెల్లడించింది. జస్ప్రీత్ బుమ్రా గాయం నయం కావడంతో అతడికి కూడా ఛాంపియన్స్ ట్రోఫీ జట్టులో స్థానం కల్పించారు. ఇక గాయాల కారణంగా సుదీర్ఘకాలంగా జట్టుకు దూరంగా ఉన్న స్టార్ పేసర్ మహ్మద్ షమీ, శ్రేయాస్ అయ్యర్ లకు కూడా చోటిచ్చారు.

ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడే టీమిండియా ఇదే...

రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్ మాన్ గిల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్, రిషబ్ పంత్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమీ, అర్షదీప్ సింగ్, కుల్దీప్ యాదవ్.

## పాకిస్థాన్ కే గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి: గవాస్కర్

**వచ్చే నెల 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ**

**టోర్నీకి ఆతిథ్యం ఇస్తున్న పాకిస్థాన్**

**స్వదేశంలో పాక్ ను ఓడించడం అంత ఈజీ కాదన్న గవాస్కర్**




ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుంది. ఈ టోర్నీలో ఎనిమిది దేశాలు పాల్గొంటున్నాయి. ఈ టోర్నీకి పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనుంది. అయితే భారత్ ఆడే మ్యాచ్ లు మాత్రం దుబాయ్ లో జరుగుతాయి. ఈ టోర్నీలో ఎవరు గెలిచే అవకాశం ఉందనే దానిపై క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ తన విశ్లేషణను అందించారు.

ఛాంపియన్స్ ట్రోఫీలో పోటీ తీవ్రంగా ఉన్నప్పటికీ... పాకిస్థాన్ కే గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని గవాస్కర్ తెలిపారు. ఛాంపియన్స్ ట్రోఫీలో హాట్ ఫేవరెట్ అనే ట్యాగ్ ను హోమ్ టీమ్ కే ఇవ్వాలని చెప్పారు.

గత వన్డే ప్రపంచ కప్ లో భారత్ ఫైనల్ కు వెళ్లిన సంగతిని అందరూ గుర్తుంచుకోవాలని... ఫైనల్స్ లో ఇండియా ఓడిపోయినప్పటికీ... వరుసగా మ్యాచ్ లు గెలుచుకుంటూ వచ్చిందని తెలిపారు. ఇప్పుడు పాకిస్థాన్ కు కూడా అలాంటి అవకాశమే ఉందని చెప్పారు. స్వదేశంలో పాకిస్థాన్ ను ఓడించడం అంత సులభం కాదని అన్నారు. అందుకే పాక్ ను ఫేవరెట్ గా భావిస్తున్నానని చెప్పారు.

# వ్యవసాయ యోగ్యం కాని భూములను జాబితా నుంచి తొలగించాలి



రాజన్న సిరిసిల్ల జిల్లా,
వేములవాడ రూరల్/చందుర్తి/ కోనరావుపేట,
18 జనవరి 2025,
ప్రజాబలం ,ప్రతినిధి.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా కు సంబంధించిన జాబితా నుంచి వ్యవసాయ యోగ్యం కాని భూములను తొలగించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు.వేములవాడ రూరల్ మండలం నాగయ్యపల్లి, చందుర్తి మండలం జోగాపూర్, వేములవాడ పట్టణంలోని 28, 29 వార్డులు, కోనరావుపేట మండలం ధర్మారంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు, నూతన రేషన్ కార్డుల జారీకి కొనసాగుతున్న సర్వేను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు, నూతన రేషన్ కార్డుల జారీకి కొనసాగుతున్న సర్వే పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులను గుర్తించి, వారికి ఆయా పథకాలు అందించాలని సూచించారు.జిల్లా పశు వైద్యాధికారి, మండల ప్రత్యేక అధికారి రవీందర్ రెడ్డి, డిస్ట్రిక్ట్ ఆడిట్ ఆఫీసర్ శ్రీనివాస్, వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్ , చందుర్తి తహసీల్దార్లు సుజాత, శ్రీనివాస్, విజయ్ ప్రకాష్ రావు, మహేష్, చందుర్తి, ఎంపీడీఓ ప్రదీప్, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# కందుల కొనుగోలు పై సంబంధిత అధికారులతో సమీక్ష





రాజన్న సిరిసిల్ల జిల్లా,
18 జనవరి 2025,
ప్రజా బలం ప్రతినిధి

రాజన్న సిరిసిల్ల జిల్లా ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ లో వచ్చే కందుల పంటను మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు.

శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో కందుల కొనుగోలు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ లో కందుల కొనుగోలు యాక్షన్ ప్లాన్ ను అధికారులు అదనపు కలెక్టర్ కు వివరించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1129 ఎకరాల 28 గుంటల భూమిలో కందుల సాగు జరిగిందని, ప్రస్తుత వానాకాలం 6 వేల 211 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని, మార్క్ ఫెడ్ ద్వారా రైతులకు మద్దతు ధర వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.వానాకాలం 2024-25 సీజన్ లో ప్రతి క్వింటాల్ కందుల పంటకు 7550 రూపాయల మద్దతు ధర తప్పనిసరిగా అందించాలని అన్నారు. కందుల పంట కొనుగోలుకు వ్యవసాయ సహకార సంఘాలు, డిసిఎంఎస్ లలో అనువైన కేంద్రాలను గుర్తించాలని అదనపు కలెక్టర్ సహకార అధికారికి సూచించారు.

కందుల పంట ను కొనుగోలు కేంద్రాల నుంచి సమీపంలో ఉండే స్టోరేజ్ పాయింట్ కు తరలించేందుకు వీలుగా రవాణా ఏర్పాట్లు చేసుకోవాలని, మార్క్ ఫెడ్ వద్ద అవసరమైన మేరా గన్ని బ్యాగులు, వెయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు ఇతర సామాగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.జిల్లాలో వ్యవసాయ మార్కెట్ యార్డులు, ఎఫ్.సి.ఐ గోదాములు , ఇతర గోదాముల వద్ద అందుబాటులో ఉన్న స్థలాన్ని పరిశీలించి కందుల స్టోరేజ్ కోసం ఎంపిక చేయాలని, కందులు కొనుగోలు అంశంలో సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని, కందులు కొనుగోలు వద్ద హమాలీల కొరత రాకుండా జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో జిల్లా మార్కెఫెడ్ అధికారి హాబీబ్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జలిబేగం, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వసంత లక్ష్మి, శాఖ మేనేజర్ రజిత, వ్యవసాయ మార్కెట్ కమిటీల కార్యదర్శులు , సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలి.

## -ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి చొరవ చూపాలి



ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 18 :మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలని అఖిలపక్ష నాయకులు అందుగుల శ్రీనివాస్, మేడిపల్లి సంపత్, ఆర్ వెంకన్న, ముల్కళ్ళ రాజేంద్రప్రసాద్, సురేష్ కుమార్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో శనివారం విలేకరుల సమావేశంలో అఖిలపక్ష జేఏసీ నాయకులు మాట్లాడారు. మందమర్రి పట్టణంకు పాలకవర్గం లేకపోవడం వలన అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వాలు ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేశాయన్నారు. 1998లో మరో ఐదు రోజుల్లో మున్సిపాలిటీకి ఎన్నికలు జరుగనుండగా ఊరు మందమర్రికి చెందిన రామచందర్ అనే వ్యక్తి కోర్టు నుండి స్టే తేవడంతో ఎలక్షన్లు ఆగిపోయాయాయన్నారు. అప్పటినుండి ఇప్పటివరకు ఎలక్షన్ లేక అభివృద్ధిలో వెనుకబడి ఉందన్నారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం భద్రాచలం, పాల్వంచ, ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన విధంగా మందమర్రిని కూడా మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఊరు మందమర్రి, రామకృష్ణాపూర్, నార్లాపూర్ లను కలిపి గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయాలని వారు సూచించారు. ఈవిషయమై కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షాను కలిసి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని బిజెపి నాయకులు అందుగుల శ్రీనివాస్ అన్నారు . బి ఆర్ ఎస్ నాయకులు ఓ. రాజశేఖర్ మాట్లాడుతూ అవసరమైతే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరహాలో ఉద్యమించాలన్నారు. మందమర్రి అభివృద్ధికి ఎన్నికలు ఒకటే మార్గమని సిపిఐ నాయకులు రాయబారపు వెంకన్న సూచించారు. బీఎస్పీ నాయకులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికలు జరిపించే అంతవరకు ఈ పోరాటం ఆగదన్నారు. అఖిలపక్ష పోరాటానికి మా మద్దతు ఎప్పుడు ఉంటుందని జనసేన నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అఖిలపక్షం నాయకులు కొంగల తిరుపతిరెడ్డి, బండారి సూరిబాబు, పల్లె నర్సింహులు, సప్పిడి నరేష్, ఎం.డి అబ్బాస్, బర్ల సదానందం, మద్ది శంకర్, భూపెల్లి కనకయ్య, బట్టు రాజ్ కుమార్, జనార్ధన్, రాజేంద్రప్రసాద్, బాలాజీ, రంగు శీను, చిత్రాల చారి, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా వేసిన షెడ్లను తొలగించిన మున్సిపల్ అధికారులు



ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 18:మందమరి మార్కెట్ ఏరియాలో అక్రమంగా వేసిన దుకాణాలను శనివారం మున్సిపల్ అధికారులు తొలగించారు. గత కొన్ని రోజుల క్రితం వెలసిన ఈ దుకాణాలను అక్రమంగా నిర్మించారని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు వెళ్లడంతో వారు ఈ చెరువులకు ఉపక్రమించారు. ఇకపై ఎవరైనా ఇలా షాపులు నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఐ.ఎన్.టి.యూ.సి కేంద్ర కమిటీ ప్రచార కార్యదర్శి గా బన్న లక్ష్మణ్ దాస్



ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 18 :సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్-ఐ.ఎన్. టి.యూ. సి కేంద్ర కమిటీ ప్రచార కార్యదర్శిగా బన్న లక్ష్మణ్ దాస్ ను నియమిస్తూ ఐ ఎన్ టి యు సి సెక్రటరీ జనరల్, తెలంగాణ కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. కాసిపేట మండల కేంద్రానికి చెందిన బన్న లక్ష్మణ్ దాస్ ఎన్ ఎస్ యు ఐ, యూత్ కాంగ్రెస్ లో సుదీర్ఘ కాలం పని చేసి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆదేశాలను పాటిస్తూ పార్టీ పటిష్టతకు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల బలోపేతానికి కృషి చేసారు. ఆయన సేవలను గుర్తించిన ఐఎన్టీయూసీ సెంట్రల్ కమిటీలో స్థానం కల్పించింది. లక్ష్మణ్ దాస్ తండ్రి బన్న ఆశాలు 1965 నుండి కాంగ్రెస్ పార్టీలో పని చేసి అనేక పదవులను అలంకరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ దాస్ మాట్లాడుతూ నాకు అవకాశం కల్పించిన ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షులు సంజీవరెడ్డికి సెక్రటరీ జనరల్ బి. జనప్రసాద్ కి నా నియమకానికి సహకరించిన శాసన సభ్యులు, పార్లమెంట్ సభ్యులకు, ఐ.ఎన్.టి. యూ.సి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కాంపెల్లి సమ్మన్నకి, సెంట్రల్ కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాంశెట్టి నరేందర్ నాయుడుకి, మందమర్రి ఏరియా ఉపాధ్యక్షులు దేవి భూమన్న కి, అసంఘటిత కార్మిక విభాగం మందమర్రి ఉపాధ్యక్షులు రాపర్తి శ్రీనివాస్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తూ కార్మికుల శ్రేయస్సు కోసం యూనియన్ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు.

# జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలపై అవగాహన



ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గం రిపోర్టర్ జనవరి 18:జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని మంచిర్యాల జిల్లా సాంస్కృతిక సారథి కళాకారులు మార్కెట్లో శనివారం ఆటపాటల ద్వారా అవగాహన కల్పించారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్టీవో ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను నిర్వహిస్తున్నారు. వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని వేగాన్ని అదుపులో ఉంచి బండ్లను నడపాలని తమ పాటలు ద్వారా వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా సాంస్కృతిక సారథి కళాకారులు వెల్తురు పోషం, కొప్పర్తి రవీందర్, వావిలాల నాగలక్ష్మి, చేగుంట నిరోషా, మామిళ్ళ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


# కొండపిలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ ర్యాలీ పాల్గొన్న మంత్రి డోలా

ఒంగోలు పల్లెలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉండాలన్న మహాత్మాగాంధీ ఆశయాలకనుగుణంగా సీఎం చంద్రబాబు స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనే యస్వామి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఒంగోలు కొండపి నియోజకవర్గ పరిధిలోని తూర్పు నాయుడు పాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో మ్యారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్బంగా గ్రామంలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతిని పురస్కరించుకుని గ్రామంలో ఉన్న ఆయన విగ్రహానికి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, దామచర్ల సత్య లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్బంగా మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి విలేకరులతో మాట్లాడుతూ, ప్రతినెల 3 వ శనివారం నిర్వహించే స్వచ్ఛ్ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని ఆయన అన్నారు.మరోవైపు ఒంగోలులో స్వచ్ఛ ఆంధ్ర,స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తమీం అన్సారియా ఒంగోలు శ్యాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ ,ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు.



**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** శనివారం నాడు గోషామహల్ నియోజకవర్గం కు సంభందించిన రెండు కుటుంబాలవారికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు లను అందించిన గౌరవ దయానంద్ గుప్త ఎమ్ ఎల్ సి ఇందులో పాల్గొనవారు బద్దం సతీష్ గౌడ్ మేఘ గ్రేటర్ హైదరాబాద్ డెవలప్మెంట్ ఫోరమ్ కన్వినర్. ధనరాజ్ వైస్ ప్రెసిడెంట్ నగర కాంగ్రెస్ కమిటీ. అశోక్. అశోక్ జైన్. ప్రభ తదితరులు పాల్గొన్నారు

# అన్న ను చంపిన తమ్ముడు.



హత్య సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలిస్తున్న తూప్రాన్ సి.ఐ రంగ కృష్ణ చిత్రంలో నిందితుడు తమ్ముడు గోపాల్

**గజ్వేల్ ప్రజాబలం ప్రతినిధి:జనవరి, 18. ప్రాజబలం ప్రతినిది :**-అన్న ధమ్ముల మధ్య ఏర్పడ్డ మనస్పర్థలతో ఏకంగా హత్య కు దారి తీసింది. నిద్రిస్తున్న సమయంలో కరెంట్ వైర్ల తో చేతికి కాలుకు సుట్టి ప్లగ్ లో పెట్టీ కరెంట్ షాక్ తో హత్య చేసిన సంఘటన చోటు చేసుకుంది. తూప్రాన్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రంగ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం శివంపేట మండలం నాను తండా గ్రామంలో చందర్ అనే వ్యక్తికి ఇద్దరూ కొడుకులు ఉన్నారన్నారు. వారు పెద్ద కొడుకు శంకర్ 28, చిన్న కొడుకు గోపాల్ 22, అయితే ఇద్దరు అన్న దమ్ములకు గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయన్నారు. గోపాల్ ఈ మధ్యలో ఒక దొంగ తనం కేసు లో జైల్ నుండి విడుదల అయ్యాడన్నారు. అయితే పాత గొడవలు మనసులో పెట్టుకుని నిన్న రాత్రి ఇద్దరు అన్నదమ్ములు కలిసి నిద్ర పోయాక అర్థ రాత్రి 12:30 గంటల సమయంలో తమ్ముడు గోపాల్ లేచి రెండు వైర్ లను ఒకటి చేతికి ఒకటి కాలికి చుట్టి స్విచ్ ఆన్ చేయడం తో అన్న శంకర్ అక్కడికక్కడే మరణించాడు. అదే సమయంలో తన అన్న గట్టిగా అరవడం తో ముందు గది లో నిద్ర పోతున్న తండ్రి చందర్ లేచి డోర్ ఓపెన్ చేయమని గోపాల్ ని పిలిచాడు. అప్పుడు గోపాల్ డోర్ ఓపెన్ చేసి తండ్రిని ప్రక్కకు నెట్టివేసి అక్కడి నుంచి పారిపోయాడు. అప్పటికే శంకర్ చనిపోవడం జరిగిందని ఈ మేరకుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడిని త్వరలో పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపిస్తామని సి.ఐ రంగ కృష్ణ తెలిపారు.

## నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ కల్పనలో డీట్ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు





**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** శనివారం సాయంత్రం నిర్మల్ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ జిల్లా కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తో కలిసి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిరుద్యోగ యువకులకు ఉద్యోగ కల్పనకై రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన డీట్ యాప్ లో కళాశాలల విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకునే విధంగా అధికారులు ప్రోత్సహించాలని తెలిపారు.అధికారులు ఈ యాప్ పై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. డైట్ యాప్ లో తమ విద్యార్హతలతో పేరును నమోదు చేసుకోవడం ద్వారా వివిధ ప్రైవేటు కంపెనీలు, పరిశ్రమలు వారికి అవసరమయ్యే ఉద్యోగులను నియమించుకుంటుందని తెలిపారు. నిరక్షరాస్యులు కూడా ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం ఈయాప్ లో తమ పేరును నమోదు చేసుకోవచ్చునన్నారు. నిరుద్యోగులు ఇచ్చిన సమాచారం క్రోడీకరించుకొని యాప్ లో ఆన్లైన్ రెస్యూమేను పొందుపరుస్తుందని తెలిపారు.ఆ సమాచారం ఆధారంగా కంపెనీలు నిరుద్యోగుల్ని సంప్రదిస్తాయని తెలిపారు.ఇందులో తమ పేర్లను నమోదు చేసుకోవడం ద్వారా నైపుణ్యానికి తగ్గ వేతనం లభిస్తుందన్నారు. పలు కంపెనీలో ఖాళీలను డీట్ యాప్ లో పొందుపరుస్తాయని తెలిపారు. డీట్ యాప్ నిరుద్యోగులకు కంపెనీలకు మధ్య వారధిలా పని చేస్తుందన్నారు.ఈ యాప్ ద్వారా నిరుద్యోగులు పారదర్శకంగా తమ విద్యార్హతకు తగిన ఉద్యోగాన్ని పొందవచ్చు అన్నారు. నిరుద్యోగులకు అప్రెంటిస్, ఇంటర్న్ షిప్ ల సమాచారం ఎప్పటికప్పుడు అందిస్తుంది అన్నారు. ఇప్పటివరకు ఈ యాప్ లో నమోదు చేసుకున్న జిల్లా నిరుద్యోగుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటివరకు జిల్లాకు చెందిన ప్రజలు అనధికారిక ఏజెంట్ల ద్వారా ఇతర దేశాలకు ఉపాధి కోసం వెళ్ళినట్లయితే వారి వివరాలను వారి కుటుంబ సభ్యులు జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలోని కార్మిక శాఖ కార్యాలయంలో వారి ఆధార్ కార్డుతో రేపటి నుంచి 26 వ తేదీ లోపు సంప్రదించి వివరాలు నమోదు చేయించాలని తెలిపారు. ఇతర వివరాలకు 9866072044 నంబరును సంప్రదించవచ్చునని తెలిపారు.

ఈ సమావేశంలో పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి,సిపిఓ జీవరత్నం,మెప్మా పిడి సుభాష్,జిల్లా కార్మిక అధికారి ముత్యం రెడ్డి, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## యువకుల దాడిలో వ్యక్తి మృతి

రాజన్న సిరిసిల్ల వేములవాలో యువకుల దాడిలో గాయపడిన రాజేందర్ (29) వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతు మృతి చెందాడు. భగవంతరావు నగర్ కాలనీ లో అనుమానితులుగా భావించి ఈనెల 15న ఇద్దరిని గమద్యం మత్తులో ఉన్న యువకులు చితకబాదారు. దాడిలో మంచిర్యాలకు చెందిన శంకర్, రాజేందర్ కు గాయాలు అయ్యాయి. ఇద్దరిని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాజేందర్ శనివారం మృతి చెందాడు. మృతుడుమంచిర్యాల జిల్లా జెండా వెంకటాపురం గ్రామానికి చెందిన వ్యక్తి. దాడిలో గాయపడి చికిత్స పొందుతు ఒకరు మృతి చెందడంతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దాడి చేసిన నలుగురు యువకులు పరారీలో వున్నారు.

# దేశ రాజకీయాల్లో అరుదైన నాయకుడు ఎన్టీఆర్ -టిడిపి పట్టణ అధ్యక్షుడు వాసాల సంపత్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 18:**దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన అరుదైన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్)అని పట్టణ అధ్యక్షుడు వాసాల సంపత్ అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం స్థానిక సింగరేణి పాఠశాలలో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహంకు నివాళులు అర్పించారు. అనంతరం మానసిక వికలాంగులకు పిల్లలకు పండ్లు, బ్రెడ్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణ అధ్యక్షులు వాసాల సంపత్ మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో ఎన్టీఆర్ అరుదైన నాయకుడని పేద బడుగు బలహీనవర్గాల ప్రజల కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. తొమ్మిది నెలల్లో రాష్ట్రమంతా పాదయాత్ర చేసి అధికార కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తెచ్చిన మహా నాయకుడన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో తెలుగుదేశం పార్టీకి తెలంగాణలో పూర్వ వైభవం దిశగా కార్యకర్తలు నాయకులు నడిపించాలన్నారు. చెన్నూరు నియోజకవర్గంలో బి. సంజయ్ కుమార్ నాయకత్వాన్ని బలపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ మహిళా అధ్యక్షురాలు ఆర్. జయ, అపర్ణ, జ్యోతి, నరసయ్య, పారుపల్లి శ్రీనివాస్, సత్యనారాయణ. చాట్లపల్లి రాజేష్, కనకయ్య, నరసమ్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



# నూతన సాంకేతిక టెక్నాలజీతో ముందుకు దూసుకు వెళ్తున్న నిర్మల్ జిల్లా పోలీసులు




**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** ఈరోజు ఉదయం జిల్లా పోలీస్ కార్యాలయంలో డీజీపీ తెలంగాణ ద్వారా ఆమోదించబడిన ఈ సాక్ష ఆప్ ను(అడ్వాన్స్ %డ%ఇన్వెస్టిగేషన్ ) నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల ఐపీఎస్, అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ఈ సాక్ష మొబైల్ ఆప్ కొరకు ప్రతి పోలీస్ స్టేషన్ కి రెండు మొబైల్ ఫోన్ లతో పాటు అదనంగా 128 జిబి మైక్రో ఎస్డి కార్డు కూడా ఇవ్వడం జరిగింది.ఈ మొబైల్ ఫోన్ లోని ఈ సాక్ష ఆప్ ద్వారా నేరానికి సంబంధించిన సాక్ష్యాలు చెదిరిపోకుండా సాక్ష్యాలను ఫోటోగ్రఫీ మరియు వీడియోగ్రఫీ రికార్డు చేయుట మరియు ఆ రికార్డులను ఈ సాక్ష ఆప్ ద్వార కోర్టులో ప్రవేశ పెట్టడం ద్వారా నేరస్తులకు త్వరితగతిన శిక్షలు విధించవచ్చు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ఎస్పీ తో పాటు అడిషన్ ఎస్పీ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు కనిపిస్తే కబ్జా...?-

### మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకివడం లేదు .

### బ్రాహ్మణపల్లి మాజీ ఉప సర్పంచ్ శివ నర్సింలు ఆరోపణ ..






**గజ్వేల్ ప్రజాబలం ప్రతినిద్ :**-తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని బ్రహ్మణపల్లి గ్రామంలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా కబ్జా చేసి అర్.సి.సి భవనం ను ఎలాంటి అనుమతులు లేకుండా యధేచ్చగా నిర్మిస్తున్నారని ఆ గ్రామ మాజీ ఉప సర్పంచ్ శివ నర్సింలు శుక్రవారం తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ కు, ఆర్డీవో కు, ఎమ్మార్వో కు లిఖిత పూర్వకంగా పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఉప సర్పంచ్ శివనర్సింలు మాట్లాడుతూ గ్రామ కంఠం భూమిలో మాజీ సర్పంచ్ పచ్చిమట్ల సుశీల భర్త అంజాగౌడ్ గతంలో సర్పంచ్ గా ఉన్నప్పుడు చేసిన పనులకు బిల్లులు రాలేదనే మీమాంశతో ఏకంగా ప్రభుత్వ భూమిపై కన్నేసి అక్రమంగా కబ్జా చేశాడని ఆరోపించారు. అప్పటి గ్రామ పంచాయితీ భూమి ఇప్పుడు మున్సిపాలిటీ పరిధిలో ఉన్నదని మున్సిపల్ అధికారులకు వార్డు ఆఫీసర్ కు ఫిర్యాదు చేసిన పట్టించు కోవడం లేదని నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. మున్సిపల్ పరిధిలోని భూమి ఆక్రమణకు గురై అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడమే కాకుండా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా స్పందించక పోవడం దారుణమన్నారు. 15 ఎకరాల భూమి ఉండి పెద్ద భూస్వామి అయి ఇక ప్రజా ప్రతినిధిగా ఎన్నికై కాపాడాల్సిన గ్రామ పెద్ద పచ్చిమట్ల అంజాగౌడ్ భూమి కాజేశారని ఆరోపించారు. బ్రాహ్మణపల్లి గ్రామ ప్రజల తరపున ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ శుక్రవారం రోజు రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు పిర్యాదు చేసినట్లు తెలిపారు. సంబధిత అధికారులు స్పందించి అక్రమ కబ్జా ప్రభుత్వ భూమిని కబ్జా చెర నుండి విడిపించకపోతే మెదక్ జిల్లా కలెక్టర్ కి అనంతరం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి పిర్యాదు చేస్తామని తెలిపారు.

## మున్సిపల్ కమిషనర్ ని కలిసిన బిఆర్పిఎస్ నిర్వాకులు



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి** జనవరి 18: జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక జవహర్ నగర్ మున్సిపల్ కమిషనర్ డాకు నాయక్ ని శనివారం భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి నిర్వాహకులు మహంకాళి బిక్షపతి మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఆదివారం అంబేద్కర్ కి జ్ఞానమాల వేసి. భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు , ఆదేశిక సూత్రాలను, సమాజానికి తెలియజేయడమే భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాకారుడు గడ్డం గిరి, బి ఆర్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాదె రమేష్. తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు విశేష కృషి: మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** జనవరి 18: నగరంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు విశేష కృషి చేస్తున్నట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. శనివారం మేయర్ వెంకటేశ్వర నగర్ కాలనీ, షేక్ పేట్ డివిజన్ లోని పలు కాలనీలలో కార్పొరేటర్లు కల్పన రెడ్డి, మహమ్మద్ రషీద్ లతో కలిసి వెంకటేశ్వర కాలనీ డివిజన్ లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తో కలిసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పర్యటించారు.

ఈ సందర్భంగా మేయర్ సింగిడి కుంట ప్రాంతంలో టి.ఆర్.ఎస్ భవన్ నుండి బంజారా లేక్ వరకు గల నాలా 2.5 కిలోమీటర్ల నాలా పై సుమారు 30 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన బాక్స్ డ్రెయిన్ పనులు పరిశీలించారు. డ్రెయిన్ నాలా పనులతో పాటుగా త్రాగు నీటి పైప్ లైన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మేయర్ వాటర్ వర్క్స్ శాఖ అధికారులను ఆదేశించారు. డ్రైన్ పూర్తయిన తర్వాత వాటర్ పైప్ లైన్ కోసం తిరిగి తవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పనులు చేపట్టే సందర్భంలో ప్రజలు సహకరించాలని ఆమె ప్రజలను కోరారు.

బాక్స్ డ్రైన్ నిర్మాణంలో రోడ్డు చిన్నగా ఉన్న నేపథ్యంలో నిర్మాణ సమయంలో కాలనీ వాసులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. ఎవ్వరి ఇళ్లను కూడా ముట్టుకోరని ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే దానం నాగేందర్ కాలనీ వాసులను కోరారు. అదే వార్డులో గల ప్రతాప్ నగర్ లో ప్రతిపాదించిన మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి స్థల పరిశీలన చేసారు. మేయర్, తాను, అధికారులు కలిసి మరొక సారి క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. అదే కాలనీలో అంతర్గత రోడ్లు వాటర్ పైప్ లైన్ వేసే సందర్భంలో తవ్వి మరమ్మత్తులు చేయకుండా వదిలి పెట్టారని అందుకు సి సి రోడ్లు వేయాలని కాలనీ వాసులు విన్నవించారు.

ఈ సందర్భంగా మన్నె కవిత రెడ్డి మాట్లాడుతూ... నిధులు మంజూరు అయిన నేపథ్యంలో ఎమ్మెల్యే గారిచే వచ్చే సోమవారం శంకుస్థాపన చేయనున్నట్లు కార్పొరేటర్ వివరించారు. ప్రతాప్ నగర్ కాలనీలో ఖాళీ స్థలంలో చెత్తతో పాటుగా ద్విచక్ర వాహనాలు పడవేసి ఉండటంతో వెంటనే చెత్త తొలగించి ఫోటో పెట్టాలని ఏ ఎం అండ్ హెచ్ ఓ ఆదేశించారు. తిరిగి చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని ఖాళీ స్థలంలో వేసిన వారిపై జరిమానా విధించాలని మేయర్ ఆదేశించారు. అక్కడ నుండి షేక్ పేట్ డివిజన్ లో కార్పొరేటర్ మహమ్మద్ రషీద్ తో కలిసి పలు కాలనీలో పర్యటించి అక్కడికక్కడే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అక్కడిక్కడే అధికారులకు ఆదేశించారు. పార మౌంట్



కాలనీలో బలకపూర్ నాలా కంటే హైట్ తక్కువ గా ఉన్న ప్రాంతంలో వర్షపు నీరు నిలిచిపోకుండా ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు మేయర్ కు వివరించడంతో బలకపూర్ నాలా హైట్ కంటే తక్కువ ఉన్న నేపథ్యంలో వాటర్ హెూల్డింగ్ స్ట్రక్చర్ నిర్మించి నిలిచిన నీరును బల్కపూర్ నాలాలోకి పంపించేందుకు అవసరమైన అంచనా ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. సి సి రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని వెంటనే సి సీ రోడ్డుకు ఏర్పాటు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అక్కడ నుండి ఆదిత్య నగర్ రోడ్డు, రాహుల్ కాలనీలలో పర్యటించి స్టార్మ్ వాటర్ డ్రైన్ లో పై నుండి డ్రైన్ లో మురుగు నీరు రావడం మూలంగా లోతట్టు ప్రాంతాలు మురుగు నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారని, కాలనీ వాసులు మేయర్ కు విన్నవించగా ఇట్టి సమస్యకు గల కారణాలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని మేయర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ... కనీస వసతులు ప్రజలకు కల్పించాలనే ఉద్దేశ్యంతో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులతో క్షేత్రస్థాయిలో పర్యటించి దీర్ఘ కాలిక సమస్యలను శాశ్వత పరిష్కారం చేయుటకు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేసి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు మేయర్ పేర్కొన్నారు. నగర వ్యాప్తంగా అన్ని డివిజన్ లో పర్యటించాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు, ముందుగా స్టాండింగ్ కమిటీ సభ్యుల వార్డుల్లో పర్యటించి తదుపరి అన్ని వార్డులో పర్యటించేందుకు కృషి చేస్తున్నట్లు మేయర్ తెలిపారు.

ఎక్కువగా చెత్త వేసే ప్రదేశాలను గుర్తించి తిరిగి అక్కడ చెత్త వేయకుండా నివారించే ప్రక్రియలో భాగంగా బిన్ లను ఏర్పాటు చేసి తద్వారా క్లీన్ సిటీగా ఉండడానికి బిన్ లో వేసే విధంగా నిర్దేశించిన ప్రదేశాలలో ఏర్పాటుకు జిహెచ్ఎంసి చర్యలు తీసుకున్న నేపథ్యంలో బిన్ లో చెత్త కుండీ నిండుతుండగా ఆటోమేటిక్ గా కుండీ నుండి శబ్దం రావడంతో అట్టి సమాచారం కంట్రోల్ రూం కు సమాచారం పోతుంది. అక్కడి నుండి వాహనం నిండిన చెత్త కుండీ వద్దకు వచ్చి చెత్తను బిన్ నుండి మానవ రహితంగా యంత్రం డంప్ చేసుకొని పోతుంది. చెత్త రహిత సమాజం కోసం జిహెచ్ఎంసి కసరత్తు చేసింది. నగర వ్యాప్తంగా ఈ చర్యలు తీసుకోనున్నట్టు మేయర్ వివరించారు. అదే విధంగా వేసిన చెత్త ను కూడా యంత్రాలు తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. షేక్ పేట్ వద్ద అట్టి మిషన్ పనితీరును మేయర్ అధికారులతో పరిశీలించారు. మిషన్ పని తీరును గతంలో కంటే మెరుగైన పద్ధతి లో పని చేసే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను మేయర్ ఆదేశించారు.

ఈ పర్యటనలో భాగంగా జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కమిషనర్ శివ కుమార్ నాయుడు, ఎస్.ఎన్.డి.పి సిఈ కోటేశ్వర రావు, జోనల్ ఎస్ ఈ రత్నాకర్, డిసి రజనీ కాంత్ రెడ్డి, ఈ ఈ విజయ్ కుమార్, జోనల్ యుబిడి, యుసిడి, ఏ ఎం అండ్ హెచ్ ఓ భార్గవ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తు అంతా విజ్ఞానంపైనే ఆధారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





**మెదక్ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి :-** శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో ఈ నెల 7 నుండి 9 వరకు జరిగిన రాష్ట్రస్థాయి విజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొని దక్షిణ భారత స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థులను కలెక్టర్ అభినంధించారు

ఈ సందర్భంగా

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. భవిష్యత్తు మొత్తం విజ్ఞానం మీదే ఆధారపడి ఉందని, వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక కావడం గర్వకారణం అని తెలిపారు విద్యార్థినీ,విద్యార్థులకు ఎంతో ప్రయోజికంగా ఎదగాలన్నారు

ఇదీ స్ఫూర్తితో ఈ నెల 21 నుండి 25 వరకు పుదుచ్చేరిలో జరిగే దక్షిణ భారత స్థాయి ప్రదర్శనలో రాణించి జిల్లాను మంచి పేరు తేవాలని సూచించారు

ఈ కార్య క్రమంలో విద్యాధికారి రాధాకిషన్, సైన్స్ అధికారి అభవురి రాజిరెడ్డి ఏ ఎం ఓ సుదర్శన మూర్తి పాల్గొన్నారు.

ఎంపికైన వారు

1). శివ చైతన్య జిల్లా పరిషత్ హై స్కూల్ లింగాయపల్లి చీకోడ్

2). అంజన్యశ్రీ మనూష గీత హై స్కూల్ మంబోజి పల్లి మెదక్

3. యుమన్, గీతా స్కూల్ మెదక్

## సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించిన.... - కొల్చారం ఎస్సై మహమ్మద్ గౌస్....




**మెదక్ నియోజకవర్గం ప్రజాబలం కొల్చారం మండలం జనవరి 18**మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని రంగంపేట దుంపలకుంట తదితర గ్రామాలలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించిన కొల్చారం ఎస్సై మహ్మద్ గౌస్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో సైబర్ మోసాలు చాలా పెరిగిపోయాయని ఇట్టి విషయంపై ప్రజలు తెలియని వ్యక్తుల ద్వారా, కొత్త కొత్త నంబర్ల ద్వారా ఫోన్లు వస్తే ఫోను ఎత్తితే వాళ్ళు మేము బ్యాంకు నుండి ఫోన్ చేస్తున్నామని, మీ అబ్బాయి పై కేసు నమోదు అయిందని కావచ్చు, లేదా మీకు పెద్ద మొత్తంలో లాటరీ తగిలిందని కావచ్చు పలు రకాల అబద్ధాలు చెప్పి చదువు రానివారే టార్గెట్ గా ముఖ్యంగా వ్యవసాయదారులను, మహిళలను టార్గెట్ చేస్తూ తమ యొక్క ఓటీపీ నంబరు, బ్యాంకు ఖాతా నెంబర్ చెప్పమని ఫోన్లు చేయడం జరుగుతుందని ఇలాంటి విషయంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే ఫోన్ కాల్ కట్ చేయాలని సైబర్ మోసాలకు సంబంధించిన నెంబరు 1930 కు కాల్ చేసి తెలుపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భారీగా ప్రజలు, పోలీస్ సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమకు తాగు, సాగు నీరందించిన మహానుభావుడు ఎన్టీఆర్

విజయవాడ రాష్ట్రంలో ఇరిగేషన్ వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడంతో పాటు రాయలసీమ ప్రాంతానికి తాగు, సాగు నీరు అందించిన మహానుభావుడు ఎన్టీఆర్ అని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అసలు సంక్షేమం అంటే ఏంటో తెలియని రోజుల్లోనే దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసింది ఎన్టీఆర్ అని నిమ్మల అన్నారు.




Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com